

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 315

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 28-7-2024



మెడల్‌పై మనూ గురి

విశ్వ క్రీడల్లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రెండు జోడీలు బరిలోకి దిగినా పతకానికి దూరంగా నిలిచాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో మనూ భాకర్ ఫైనల్లోకి ప్రవేశించింది. -12లో



ఆరంభం అదిరింది

టి20 ప్రపంచ చాంపియన్ భారత్.. శ్రీలంక పర్యటనలో శుభారంభం చేసింది. తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ బృందం 43 పరుగుల తేడాతో లంకపై విజయం సాధించింది. మూడు టి20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. -13లో



అధ్యక్ష బరిలో కమలా హారిస్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పేరు ఖరారైంది. అధికారిక పత్రాలపై ఆమె సంతకాలు చేశారు.

వివరాలు 6లో ▶



తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ

పలు రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు.

వివరాలు 2లో ▶

సీటుకు నోటు!

రెవెన్యూ, పోలీసు శాఖల్లో పోస్టింగ్‌లకు పైరవీలు, మామూళ్లు

నచ్చిన వారిని నియమిస్తూ టీడీపీ నేతల వసూళ్ల పర్వం

- ఎస్సై నుంచి సీఐ దాకా ఎమ్మార్వో నుంచి ఆర్డీవో వరకు పైసలిస్తేనే పోస్టింగ్
- ఉన్నచోటే కొనసాగాలన్నా.. బదిలీ చేయాలన్నా నోట్ల కట్టలు ఇవ్వాల్సిందే.. తిరుపతి ఆర్డీవో పోస్టు కోసం ఏకంగా రూ.3 కోట్లు?
- సీఐకి రూ.40 లక్షలు.. ఎస్ఐకి రూ.10 లక్షలు
- ఆర్డీవోలు, డీఎస్పీలు, సీఐలు తదితర ముఖ్యమైన పోస్టింగులన్నీ మంత్రి లోకేశ్ కనుసన్నల్లోనే..
- కర్నూలులో ఓ సీఐ పోస్టుకు రూ.15 లక్షలకు బేరం
- విజయనగరంలో అశోక్ బంగ్లా నుంచే ఆదేశాలు
- ఇకపై నెలవారీ మామూళ్లు సైతం తమకే ఇవ్వాలంటూ టీడీపీ నేతల హుకుం



సాక్షి టాస్క్‌ఫోర్స్

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వ పెద్దలు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుంటే పచ్చమూకలు ఇసుక దోపిడీ నుంచి భూ దందాలతో బరి తెగిస్తున్నాయి. అంతటితో సంతృప్తి చెందకుండా ఇది బదిలీల సీజన్ కావడంతో అందులోనూ సొమ్ము చేసుకుంటున్నాయి. వేలం పాటల తరహాలో ఈ వ్యవహారం పెద్ద ఎత్తున సాగిపోతోంది. బదిలీలలో పైరవీలు నడుస్తుండడంతో అధికారులంతా అక్కడి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. రాష్ట్రమంతా ఆర్డీవో, డీఎస్పీ, సీఐలు తదితర ముఖ్యమైన పోస్టింగులన్నీ పూర్తిగా మంత్రి నారా లోకేష్ కనుసన్నల్లో జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఒకపక్క దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండ, మహిళలపై అఘాయిత్యాలతో రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిస్థితి దారుణంగా ఉండగా మరోపక్క అధికార పార్టీ నేతలు బదిలీలలో అందినకాడికి వసూలు చేసుకుంటున్నారు! ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖల్లో బదిలీలను అవకాశంగా మార్చుకుని వసూళ్ల పర్వానికి తెర తీశారు. ఉద్యోగుల బదిలీలు జరుగుతుండటంతో హోదాను బట్టి రేటు నిర్ణయించి వసూళ్లకు దిగారు. తమ్ముడు తమ్ముడే..! పేకాట పేకాటే! అన్నట్లుగా తమకు కొమ్ము కాసే ఖాకీలను నియమించుకోవడంతోపాటు పోలీస్ స్టేషన్లకు అందే నెలవారీ మామూళ్లపైనా కన్నేశారు. ఇకపై నేరుగా తమకే ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు.

రూ.కోట్లలో బేరసారాలు..

కొత్త సర్కారు కొలువుదీరిన వెంటనే బదిలీలపై కూటమి నేతలు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తమకు అనుకూలంగా వ్యవహరించే వారికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రస్తుతం ఉన్నవారిని

మిగతా 14వ పేజీలో ▶

పెట్టుబడి తక్కువ.. మోసం ఎక్కువ

పెరుగుతున్న సైబర్ నేరాలు

- పెట్టుబడికి రెట్టింపు ఆదాయం అంటూ మోసగాళ్ల ఎర
- నమ్మి మోసపోతున్న వారిలో విద్యావంతులే అధికం
- మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టోకరెన్సీ పేరిట పుట్టుకొస్తున్న సైట్లు, యాప్‌లు
- వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్న సైబర్ నిపుణులు
- సైబర్ నేరాలపై తక్షణం ఫిర్యాదు చేయాలంటూ సూచన

గుంటూరుకు చెందిన రవి ఫోన్ నంబర్‌ను ఐపీజీ అనే పేరుతో ఉన్న ఓ వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసినట్టు నోటిఫికేషన్ వచ్చింది. కొద్దిసేపటికి గ్రూప్ అడ్మిన్ 'రూ.800 పెట్టుబడి పెడితే ఏడాదంతా రోజుకు రూ.35 చొప్పున ఆదాయం' అంటూ మెసేజ్ పెట్టింది. గ్రూప్ సభ్యులు కొందరు కొన్ని స్క్రీన్‌షాట్స్ షేర్ చేసి తాము సంపాదిస్తున్నాం అంటూ వంతపాడారు. ఇవన్నీ చూసిన రవి వాళ్లను నమ్మి అడ్మిన్ సూచించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రూ.800 పెట్టుబడి పెట్టాడు. తనకు తెలిసిన మరికొందరితోనూ పెట్టుబడి పెట్టించాడు. ప్రారంభంలో వాళ్లు చెప్పినట్లే చెల్లిస్తూ వచ్చారు. ఇది బావుందని భావించి రవి రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టాడు. అంతే రెండు రోజుల్లోనే యాప్ పనిచేయకుండా పోయింది. మెసేజ్‌లకు అడ్మిన్ రిప్లై ఇవ్వలేదు. దీంతో మోసపోయానని రవి గుర్తించి లబోదిబోమన్నాడు. తక్కువ పెట్టుబడి. ఎక్కువ ఆదాయం.. పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు.. ఇంట్లో కూర్చుని టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బు వచ్చి ఖాతాలో జమ అవుతుంది అంటూ సైబర్ నేరగాళ్లు విద్యావంతులను బురిడీ కొట్టిస్తున్నారు. వీళ్ల ఉచ్చులో పడి పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌లు, ఉద్యోగులు, యువత తమ కష్టార్జితాన్ని సమర్పించుకుంటున్నారు. ఈ తరహా ఘటనలు రోజు రోజుకు పెరుగుతున్నాయి.

సాక్షి, అమరావతి: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ పేరిట ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలో వేల మందిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే రెండు వారాల్లో రెట్టింపు ఆదాయం లభిస్తుందని బురిడీ కొట్టించారు. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకూ పెట్టుబడి పెట్టి మోసపోయామని విశాఖతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో బాధితులు లబోదిబోమంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బు, లింక్ క్లిక్ చేస్తే చాలు అంటూ నెట్‌ఫ్లిక్స్ ఫాలో అనే యాప్ పేరిట 2021లో గుంటూరు, కృష్ణా, నెల్లూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది బాధితులను బురిడీ కొట్టించారు. రూ. లక్షల్లో సొమ్మును సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. ఇలాంటి నేరగాళ్ల, గొలుసుకట్టు ఇన్వెస్ట్‌మెంట్ సైబర్ ఫ్రాడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.


నమ్మించి మోసం చేస్తారు..

అదనపు ఆదాయం వస్తుందని కొందరి ఆశే.. సైబర్ మోసగాళ్లకు వరమవుతోంది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే వరకూ నమ్మకంగా ఉంటూ ఆ తర్వాత బోర్డు తిప్పేస్తున్నారు. బాధితులు తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. టెలీగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా నేరగాళ్లు ప్రజలను ఆకట్టుకుంటున్నారు. గ్రూప్‌లు క్రియేట్ చేసి ఫలానా స్కీమ్ ద్వారా ఫలానా లాభం ఉంటుందని ఆకర్షిస్తున్నారు. ఈ తరహా యాప్‌లు, వెబ్‌సైట్‌లు రోజు రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నేపథ్యంలో ఏదైనా యాప్, వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు ఒకటి రెండుసార్లు పరిశీలించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఫిర్యాదు చేయండిలా

దేశంలో రోజు రోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ఫిర్యాదులు చేయడానికి కేంద్ర హోమ్ శాఖ ప్రత్యేక వేదికను అందుబాటులోకి తెచ్చింది. https://www. cybercrime.gov.in./ వెబ్‌సైట్ ద్వారా, 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి బాధితులు మోసాలపై ఫిర్యాదులు చేయవచ్చు. అదే విధంగా సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్/సాధారణ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయడానికి వీలుంటుంది. ఒక వేళ ఓటీపీ, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ల ద్వారా మోసానికి గురై డబ్బు పోగొట్టుకున్నట్లయితే వెంటనే ఫిర్యాదు చేయడం ఉత్తమమని పేర్కొంటున్నారు.

2023లో దేశ వ్యాప్తంగా సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రకారం వివిధ రాష్ట్రాల్లో నమోదైన సైబర్ మోసాల ఫిర్యాదులు ఇలా..





పోటీ పరీక్షలు..

ప్రమాణాలు పాతాళంలో

- ఇంజనీరింగ్, మెడికల్, లా కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం కటాఫ్‌లు తగ్గింపు
- నాణ్యత విషయంలో రాజీపడి అడ్మిషన్లు
- జీరో మార్కులు వచ్చిన విద్యార్థులకు మెడికల్ పీజీలో ప్రవేశం
- జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో 40 వేలకు పైన ర్యాంకులకు సీట్లు
- ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రమాణాలు పడిపోతే ప్రతికూల పరిణామాలు

2 లో

గోదావరి మళ్లీ ఉగ్రరూపం



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద గోదావరి వరద ఉధృతి

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- పోటెత్తి ప్రవహిస్తున్న ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి, వాగులు
- భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక.. కూనవరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- పోలవరం ప్రాజెక్టు నుంచి 11.87 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ.. బ్యారేజ్ నుంచి 13.20 లక్షల క్యూసెక్కులు కడలిలోకి..
- వరద గుప్పెట్లో ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని పలు గ్రామాలు
- ఉప్పొంగిన కృష్ణా, తుంగభద్ర

10 లో

'వికసిత భారత్' సాకారంలో రాష్ట్రాలదే కీలకపాత్ర

పేదరిక నిర్మూలనే మా ప్రాధాన్యం నీతి ఆయోగ్ భేటీలో మోదీ

- వివరాలు 6లో

మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారు: మమత

నన్ను ఘోరంగా అవమానించారు నీతి ఆయోగ్ భేటీ నుంచి వాకౌట్

- వివరాలు 6లో


బాబు సూపర్ 6 మొదట్లోనే డకౌట్



- సీఎం చంద్రబాబు శ్వేతపత్రం కాదది.. సాకు పత్రం
- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన మండిపాటు
- నాడు కోవిడ్ కష్టాలను అధిగమించి పథకాలు అమలు చేశాం
- నిధులు సరిపోవని చెబితే మా నాయకుడు కుదరదన్నారు
- ఇది పేద వారికి సంబంధించిన వాగ్దానం.. మాట తప్పలేమన్నారు.. ఒకవేళ తప్పాల్సి వస్తే తానే దిగిపోతానన్నారు.. ఇదీ కమిట్‌మెంట్
- ఇప్పుడు కొండను ఎత్తిపెడితే బాబు మోస్తానంటున్నారు
- చివరకు గవర్నర్‌తో కూడా అబద్ధాలు చెప్పించారు
- బాబు పాలనలో అప్పులు ఎల్లో మీడియాకు కనిపించవా?
- మా హయాంలోనే స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెరుగుదల.. సంపద సృష్టి అంటే అప్పులు చేయడమా?

2 లో

పాతబకాయిలే అడుగుతున్నాం



- వాళ్లేమీ ఇప్పుడు కొత్తగా ఇచ్చిందిలేదు
- కాంగ్రెస్ విభజన చట్టం వల్ల నష్టపోయాం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంవల్ల అమరావతి, పోలవరం నాశనమయ్యాయి
- నీతి ఆయోగ్ సమావేశానంతరం జలశక్తి మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

14 లో

మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్



- బెంగళూరులో అరెస్ట్ చేసిన పోలీసులు
- తాపీగా 52 రోజుల తర్వాత 'పులివర్తి' కేసులో ఏ–37గా చేర్చడంపై విస్మయం
- ఘటన సమయంలో కలెక్టర్, జేసీ సమక్షంలో స్ట్రాంగ్ రూంలోనే ఉన్న మోహిత్‌రెడ్డి
- ముందస్తు బెయిల్‌పై సోమవారం విచారణ.. కోర్టుకిచ్చిన హామీని ఉల్లంఘించిన పోలీసులు
- నాని 'కట్టు'కథ బట్టబయలైనా కక్ష సాధింపా?

2 లో

నాటి 'పవర్' విజన్‌కు అవార్డుల వెలుగు

- విద్యుత్ రంగంలో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలలో పలు యాప్‌ల రూపకల్పన
- ఏఐ, మెషిన్ లెర్నింగ్ ఆధారిత అప్లికేషన్లకు తాజాగా 'సౌత్ గోవ్-టెక్ సింపోజియం' అవార్డులు



ఏపీ ట్రాన్స్‌కోకు లభించిన అవార్డులు

సాక్షి, అమరావతి: మారుతున్న కాలానికి, పెరుగుతున్న సాంకేతిక విధానాలకి అనుగుణంగా సేవల్లో అలస్యాన్ని నివారించేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో తీసుకొచ్చిన పలు సంస్కరణలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. అవార్డులు అందిస్తున్నాయి. గత ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు (ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలు) ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అవుతూ వచ్చాయి. సొంతంగా కొన్ని యాప్‌లను రూపొందించాయి. వాటిద్వారా విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలు, పంపిణీ, సరఫరా వ్యవస్థలను మెరుగుపరుచుకుంటూ అవార్డులు అందుకుంటున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) జాయింట్ మీటర్ రీడింగ్ (జేఎంఆర్) అప్లికేషన్, కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మెషిన్ లెర్నింగ్ సాంకేతికతలతో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ) రూపొందించిన డే ఎహెడ్ పవర్ డిమాండ్ ఫోర్ కాస్టింగ్ మోడల్‌కు 'సౌత్ గోవ్-టెక్ సింపోజియం' అవార్డులు లభించాయి. హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల సింపోజియంలో ఈ అవార్డులను అందుకున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో తాజాగా వెల్లడించింది.

ఏటా రూ.750 కోట్లు ఆదా

విద్యుత్ వ్యవస్థలో సరికొత్త ఆధునిక విధానాలను అనుసరిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని గత ప్రభుత్వ హయాంలో జేఎంఆర్ అప్లికేషన్ రూపొందింది. దీనివల్ల ఏపీ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) చేసిన విద్యుత్ కొనుగోళ్లకు గడువులోగా బిల్లులు చెల్లించగలిగారు. దీంతో లేట్ పేమెంట్ సర్‌చార్జ్ (ఎల్‌పీఎస్) భారం తప్పింది. సాధారణంగా ఎల్‌పీఎస్.. మొత్తం బిల్లుపై 15 శాతం ఉంటుంది. అందులో 1 శాతం రిబేట్ పోను 14 శాతం చెల్లించాల్సి వచ్చేది. అలాగే ఇన్వాయిస్ బిల్లులపైనా రాయితీ పొందేందుకు అవకాశం కలిగింది. ఈ లెక్కన ఏడాదిలో ఏపీపీసీసీ కొన్న రూ.50 వేల కోట్ల విద్యుత్ బిల్లులో రూ.750 కోట్లు ఆదా అయ్యాయి.

గతంలోను పలు అవార్డులు

గత ప్రభుత్వంలో రెండు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వెబ్ ఆధారిత యాప్‌లను విద్యుత్ సంస్థల కోసం ఏపీఎస్ఎల్‌డీసీ అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లు ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్, లైన్ క్లియర్ అప్లికేషన్ పేరుతో పనిచేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఐఎస్ఓఏ అప్లికేషన్‌కు ఏపీ ట్రాన్స్‌కో స్కోచ్ సెమీ ఫైనలిస్ట్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు పొందింది. పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించినందుకు ఏపీ నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉత్తమ నోడల్ ఏజెన్సీగా బిజినెస్ కనెక్ట్ అవార్డును సొంతం చేసుకుంది. గత ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎంతో ముందుచూపుతో రూపొందించినందువల్లే ఈ అప్లికేషన్లకు అవార్డులు లభిస్తున్నాయని పలువురు ప్రశంసిస్తున్నారు.

క్లుప్తంగా...

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: దేశం గర్వించే శాస్త్రవేత్త, విద్యావేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అన్నారు. కలలు కనండి..వాటిని సాకారం చేసుకోండి అంటూ యువతలో స్ఫూర్తి నింపిన మిస్సైల్ మ్యాన్ కలాం అని పేర్కొన్నారు. మారుమూల గ్రామంలో జన్మించి, దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన కలాం తీరు అందరికీ ఆదర్శనీయమని పేర్కొంటూ కలాం వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను అంటూ జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నిరంతరాయంగా నీటి నమూనా పరీక్షలు



సాక్షి, అమరావతి: నీటి నమూనాల పరీక్షలు నిరంతరాయంగా కొనసాగించాలని, నీటి కాలుష్యం ఉన్న చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు పంచాయతీరాజ్ సెక్రటరీకి రాతపూర్వకంగా సమాచారమివ్వాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ ఆదేశించారు. ఆదివారం నిర్వహించే వరల్డ్ హెపటైటిస్ డేపై వివిధ రూపాల్లో ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్ శాఖల్ని సమన్వయంతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 2 వరకూ జిల్లాల్లో లెప్రసీ క్యాంపెయిన్ శరవేగంగా చేయాలన్నారు. ఆగస్టు 1 నుంచి ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని, రోజూ ఎన్‌సీడీ క్లినిక్‌లను తెరవాలని సూచించారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

15 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు



కృష్ణబాబును సత్కరిస్తున్న డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, ఇతర అధికారులు

మహారాణిపేట (విశాఖ జిల్లా): రాష్ట్రంలో క్యాన్సర్ వైద్యానికి రూ.680 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు తెలిపారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో మెడికల్ ఆంకాలజీ విభాగం, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా శనివారం నిర్వహించిన నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, రొమ్ము, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్లతో ఎక్కువ మంది బాధపడుతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్యాన్సర్‌కు సంబంధించి స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ పోస్టులు త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ శా మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి కన్వీనర్ డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణబాబును వైద్యులు సత్కరించారు.


రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తాం

- ఐదేళ్ల తర్వాత ఏపీకి ప్రత్యేక కేటాయింపులు
- కేంద్ర సహాయ మంత్రి మురుగన్



సాక్షి, అమరావతి/గుణదల (విజయవాడ తూర్పు): కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉన్నందున డబుల్ ఇంజన్ శక్తితో ఏపీలో అభివృద్ధి జరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ అన్నారు. ఐదేళ్ల తర్వాత కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక కేటాయింపులు జరిగాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. శనివారం విజయవాడలో వ్యాపారవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఏపీ రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు 'పూర్వోదయ' కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఏపీ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు ఆర్థికసాయం అందించి.. త్వరగా పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి కూడా తమ వంతు సాయం చేస్తామన్నారు.

దేశంలో ఇంజనీరింగ్, మెడికల్, లా తదితర కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం కటాఫ్ మార్కులు తగ్గించుకుంటూపోతున్నారు. నాణ్యత ప్రమాణాలతో రాజీ పడుతున్నారు. జీరో మార్కులు వచ్చిన వారు కూడా ఇంజనీరింగ్, మెడికల్, లా కోర్సుల్లో అడ్మిషన్ పొందే పరిస్థితి ఉంది. సీట్ల భర్తీ కోసం కటాఫ్‌లు తగ్గించుకుంటూ పోవడం వల్ల ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రమాణాలు పడిపోతాయి. ఇది దీర్ఘకాలంలో ప్రతికూల పరిణామాలకు దారితీస్తుంది. కాబట్టి ప్రొఫెషనల్ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు కనీస ప్రమాణాలు పాటించాలని చెబుతున్నారు.. కెరీర్స్360 ఫౌండర్ చైర్మన్ మహేశ్వర్ పెరి. ప్రస్తుతం ప్రొఫెషనల్ కోర్సుల్లో పడిపోతున్న ప్రమాణాలపై ఆయన అందిస్తున్న విశ్లేషణాత్మక కథనం..




పోటీ పరీక్షలు.. ప్రమాణాలు పాతాళంలో!!

మెడికల్, లాకే పరిమితం కాలేదు..




వాస్తవానికి ఈ అర్హత మార్కులు తగ్గింపు అనేది లా, మెడికల్‌కే పరిమితం కాలేదు. 2018 జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సంబంధించి కేంద్ర విద్యాశాఖ ఐఐటీల్లో ప్రతి విభాగం, ప్రతి కేటగిరీకి సంబంధించి సీట్ల సంఖ్యకు రెట్టింపు సంఖ్యలో విద్యార్థులు అందుబాటులో ఉండేలా కటాఫ్‌ను తగ్గించాలని ఆదేశించింది. అంటే.. ఐఐటీల్లో అందుబాటులో ఉన్న మొత్తం 10వేల సీట్లకు 20 వేలమంది విద్యార్థులను జోసా కౌన్సెలింగ్ పిలుస్తారు. దీనికోసం అడ్మిషన్ బోర్డు అర్హత మార్కులను 35 శాతం నుంచి 25 శాతానికి తగ్గించింది. ఏకంగా 10 శాతం తగ్గించారు. దీంతో తొలుత మెరిట్ లిస్ట్‌లో 18,138 మంది మాత్రమే ఉండగా.. కొత్తగా 13,842 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. ఇలా మొత్తంగా పదివేల సీట్ల కోసం 31,980 మంది విద్యార్థులు జోసా కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

- ఇంజనీరింగ్, మెడికల్, లా కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం కటాఫ్‌లు తగ్గింపు
- నాణ్యత విషయంలో రాజీపడి అడ్మిషన్లు
- జీరో మార్కులు వచ్చిన విద్యార్థులకు మెడికల్ పీజీలో ప్రవేశం
- జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో 40 వేలకు పైన ర్యాంకులకూ సీట్లు
- ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ కటాఫ్ తగ్గించడానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రమాణాలు పడిపోతే ప్రతికూల పరిణామాలు



నీట్ యూజీ

- 2020లో మొత్తం 13,66,945 మంది విద్యార్థులు నీట్ యూజీ పరీక్షకు హాజరైతే.. కటాఫ్ 147(మొత్తం 720 మార్కులకు(20.4 శాతం)గా నిర్ణయించారు. ఆ సంవత్సరం మొత్తం మెడికల్ సీట్ల సంఖ్య 93,470. కానీ డెంటల్ సీట్లు భర్తీ కాకపోవడంతో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆ ఏడాది కటాఫ్‌ను 113కు తగ్గించింది. దీంతో 15.7 శాతం మార్కులు వచ్చిన వారికి కూడా సీటు లభించింది.
- అదే విధంగా 2021లో మొత్తం 15,44,273 మంది విద్యార్థులు నీట్ యూజీ పరీక్ష రాశారు. మొత్తం మెడికల్ సీట్లు 99,695 ఉన్నాయి. ఆ ఏడాది కటాఫ్ 138(19.2 శాతం). కాని ఆయుష్ సీట్లు భర్తీ కాకపోవడంతో ఆయుష్ అడ్మిషన్స్ సెంట్రల్ కౌన్సిలింగ్ కమిటీ కటాఫ్‌ను 122కు తగ్గించింది. అంటే 17% మార్కులు సాధించిన విద్యార్థులు కూడా సీటు పొందొచ్చు. ఇలా సీట్లు భర్తీ చేయడం కోసం కటాఫ్ తగ్గిస్తూ నాణ్యత విషయంలో రాజీపడుతున్నారు.



నీట్ ఎండీఎస్ 2023




ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఫర్ మెడికల్ సైన్సెస్.. ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తుంది. ఈ పరీక్షకు కేటాయించిన మొత్తం మార్కులు 960. మొత్తం సీట్లు 6,937. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 23,847. దీనికి కూడా సీట్ల భర్తీ కోసం 2021 నుంచి కటాఫ్ తగ్గించుకుంటూ వస్తున్నారు.

దేశ అత్యున్నత న్యాయస్థానం.. సుప్రీంకోర్టు ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ) కటాఫ్‌ను తగ్గించేందుకు నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఏఐబీఈ కటాఫ్‌ను తగ్గించడం వల్ల న్యాయ విద్యలో ప్రమాణాలు పడిపోతాయని పేర్కొంది. "పరీక్ష నిర్వాహకులు.. ఏఐబీఈ జనరల్ కేటగిరీ కటాఫ్ 45 మార్కులు, ఎస్సీ/ఎస్టీలకు కటాఫ్ 40 మార్కులుగా నిర్ణయించారు. ఆ మాత్రం కూడా స్కోర్ చేయకుంటే లాయరుగా ఎలా రాణించగలరు. మీరు దాన్ని ఇంకా 40, 35కు తగ్గించాలని కోరుతున్నారు.. దయచేసి వదవండి" అంటూ ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ప్రధాన న్యాయమూర్తి మనందరి తరఫున మాట్లాడుతున్నారు. దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల్లో పడిపోతున్న ప్రమాణాలు, అర్హత మార్కులు, తగ్గుతున్న ఉత్తీర్ణత ఇప్పుడు ట్రెండ్‌గా మారింది.

నీట్ పీజీ 2023

2023లో నీట్ పీజీకి హాజరైన మొత్తం విద్యార్థుల సంఖ్య.. 2,00,517. ఆ ఏడాది అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు 47,526. మొత్తం 800 మార్కులకు పరీక్ష జరిగింది. 2023లో తొలుత కటాఫ్ 291 మార్కులు(36 శాతం). ఆ తర్వాత కౌన్సెలింగ్ కొనసాగుతున్న కొద్దీ కటాఫ్‌ను తగ్గించుకుంటూ వచ్చి.. చివరకు జీరోగా నిర్ణయించారు. అంటే.. పరీక్షకు హాజరైతే చాలు.. మెడికల్ పీజీలో ప్రవేశం పొందొచ్చన్నమాట! ఇది ఒకరకంగా ప్రవేశ పరీక్షను చంపివేయడంలాంటిదే!! ప్రస్తుతం పలు మెడికల్ కాలేజీల్లో పీజీ చదువుతున్న విద్యార్థుల్లో జీరో మార్కులు వచ్చిన వారుకూడా ఉండొచ్చు.



నీట్ సూపర్ స్పెషాలిటీ



దేశంలో నీట్ సూపర్ స్పెషాలిటీలో మొత్తం సీట్ల సంఖ్య 4,243. ఈ పరీక్షకు 2023లో వచ్చిన దరఖాస్తులు 19,944. 2023లో మొదటి రౌండ్‌లో కటాఫ్ 50 పర్సంటైల్‌గా నిర్ణయించారు. సీట్లు భర్తీకాలేదు. దీంతో రెండో రౌండ్‌లో కటాఫ్‌ను 20 పర్సంటైల్‌కు తగ్గించారు. అయినా సీట్లు నిండలేదు. ఇక చివరగా స్పెషల్ రౌండ్‌లో అర్హతను జీరో పర్సంటైల్‌గా నిర్ణయించారు.

నేషనల్ లా యూనివర్సిటీలు

2022 సర్క్యులర్‌లో నేషనల్ లా యూనివర్సిటీల కన్సార్టియం ప్రతి కేటగిరీలో అందుబాటులో ఉన్న సీట్లకు ఐదు రెట్ల మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలవాలని నిర్ణయించింది. దీని అర్థమేమిటంటే.. వారు కనీస ప్రమాణాలను కూడా వదిలేసి ప్రతి సీటుకు ఐదుగురిని పిలవాలని నిర్దేశించారు. ప్రవేశానికి కనీస మార్కులు నిర్దేశించకపోవడం వల్ల కనీసం నాణ్యత లేని విద్యార్థి కూడా అడ్మిషన్ పొందే అవకాశం ఉంటుంది. 2023లో 40 వేల కంటే ఎక్కువ ర్యాంకు వచ్చిన విద్యార్థులు సైతం ఎన్ఆర్ఐ కోటాలో నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశం పొందే వీలు కలిగింది. 150కు 15–17 మార్కుల(10 శాతం మార్కులు)మధ్య వచ్చిన విద్యార్థులు కూడా జాతీయ లా వర్సిటీల్లో ఎన్ఆర్ఐ కోటా ద్వారా అడ్మిషన్ పొంది.. ఈ దేశంలో లాయర్‌గా మారే అవకాశం ఏర్పడింది.

సూపర్ సిక్స్ మొదట్లోనే డకౌట్

- సీఎం చంద్రబాబు శ్వేతపత్రం కాదది.. సాకు పత్రం
- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపాటు



సాక్షి, సిటీ బ్యూరో: చంద్రబాబు ఎన్నికల ముందు అట్టహాసంగా ప్రకటించిన సూపర్ సిక్స్.. అమలు ఆరంభానికి ముందే, తొలి ఓవర్‌లోనే డకౌట్ అయిందని ఏపీ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసింది శ్వేతపత్రం కాదని, అది ఒక సాకు పత్రమని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా కుంటి సాకులతో అన్నీ అసత్యాలు వల్లించారని, ప్రజలను తప్పుదారి పట్టించాలని తప్పుడు లెక్కలు చూపించారని ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అసలు శ్వేతపత్రానికే అర్థం మార్చాడని, రాష్ట్రాభివృద్ధి కోసం తామేం చేయబోతున్నామో చెప్పకుండా.. కేవలం గత ప్రభుత్వంపై నిందలు, అన్నింటికీ బాధ్యులను చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్వేతపత్రాల 'పేరుతో' డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల సీఎంగా పని చేశానని పదే పదే వల్లించే చంద్రబాబు.. సంపద సృష్టించడం తనకు మాత్రమే తెలుసని గొప్పగా ప్రచారం చేసుకొని, ఇప్పుడు తమ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలను అడుగుతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బాబు వైఖరి చూస్తుంటే.. 'మీరంతా కొండను ఎత్తి, నా నెత్తిపై పెట్టండి. నేను దాన్ని మోస్తాను' అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. చివరకు గవర్నర్‌తో కూడా అబద్ధం చెప్పించారని విమర్శించారు. రాష్ట్ర పరిపాలన కోసం రూ.2 లక్షల 50 వేల కోట్లు అవసరం ఉంటే ఆదాయం రూ.2 లక్షల 40 వేల కోట్లని.. రెగ్యులర్ జీతభత్యాలు, పెన్షన్లు, సబ్సిడీలు, పీడీఎస్, అప్పులకు వడ్డీలు ఏటా రూ.10 వేల కోట్లు అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందని, ఏం చేయాలని ప్రజలను ప్రశ్నిస్తే ఏలా అని నిలదీశారు. అలాంటప్పుడు ఏటా దాదాపు లక్షన్నర కోట్ల వ్యయమయ్యే పథకాలను ఎలా ప్రకటించారని దుయ్యబట్టారు.

వైఎస్సార్‌సీపీ చేస్తే అప్పు.. టీడీపీ చేస్తే నిప్పా?

- టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 50 రోజుల్లోనే అపరిమితంగా అప్పు చేసింది. గత జూన్ 20న రూ.2 వేల కోట్లు, జూలై 2న రూ.5 వేల కోట్లు, జూలై 16న మరో రూ.2 వేల కోట్లు అప్పు చేశారు. 2014–19 మధ్య రాష్ట్ర అప్పులు 21 శాతం పెరిగితే, మా హయాంలో 2019–24 మధ్య ఆ పెరుగుదల 12 శాతం మాత్రమే. ఇది ఎల్లో మీడియాకు కనిపించడం లేదా? వైఎస్సార్‌సీపీ చేస్తే అప్పు.. టీడీపీ చేస్తే నిప్పా?
- రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అప్పులు 2014లో రూ.1,18,051 కోట్లు ఉంటే, 2019 నాటికి అవి రూ.2,71,795 కోట్లకు చేరుకున్నాయి. అంటే టీడీపీ హయాంలో 21.63 శాతం పెరిగాయి. మా ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.5.18 లక్షల కోట్లు. అంటే 12.9 శాతం పెరుగుదల మాత్రమే. అయినా ఎల్లో మీడియా దారుణంగా వ్యవహరిస్తోంది. రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న ప్రజాశక్తి, విశాలాంధ్ర లాంటి పత్రికలు ఎన్నడూ ఇలా వన్ సైడ్ తప్పుడు కథనాలు ప్రచురించలేదు. ఆ రెండు (ఈనాడు, ఆంధ్రజ్యోతి) పత్రికలు మాత్రం ఏకపక్షంగా తప్పుడు రాతలు రాస్తున్నాయి.

"పేదల పథకాలకు సంబంధించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం కష్టమని మేము తొలి ఏడాది ఓ సమావేశం (అంతర్గత)లో చెబితే..'ఇది నేను ఇచ్చిన మాట. మేనిఫెస్టోలో పెట్టాం. ఇది పేద వారికి సంబంధించిన వాగ్దానం. మాట తప్పేందుకు కుదరదు. ఒకవేళ తప్పాల్సి వస్తే నేనే దిగిపోతాను' అన్నారు. మేమంతా షాక్ అయ్యాం. ఆ తర్వాత కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం మేము, మా అధికారులందరం కోవిడ్‌ను సైతం లెక్కచేయకుండా తిరిగాం. అలా మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమిట్‌మెంట్‌తో హామీలు అమలు చేశారు" అని బుగ్గన వివరించారు.

వాటిని అమలు చేయడం సాధ్యం కాదని తెలిసి.. శ్వేతపత్రాల పేరుతో సాకు పత్రాలు విడుదల చేస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం కింద ప్రతి పిల్లాడికి రూ.15 వేలు, 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, ఏటా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం.. వీటన్నింటి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. బుగ్గన ఇంకా ఏం చెప్పారంటే..

సంపద సృష్టి ఒట్టి మాటే

- చంద్రబాబు సంపద సృష్టి అంతా ఒట్టి మాటే. 2014–15లో రాష్ట్ర ఆదాయం రూ.90,672 కోట్లు. 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.1,14,671 కోట్లు. ఆదాయం ఏటా 6.09 శాతం పెరిగింది.
  2019–20లో రాష్ట్ర ఆదాయం రూ.1,11,034 కోట్లు కాగా, 2023–24 నాటికి అది రూ.1,76,448 కోట్లకు చేరింది. రాష్ట్ర ఆదాయం ఏటా 16.7 శాతం పెరిగింది. మేము అధికారంలోకి వచ్చాక 2019 జూలైలోనే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఇప్పుడు మీరెందుకు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టలేదు? అలా చేస్తే మీ బండారం బయట పడుతుందనే కదా!
- నిజానికి రాష్ట్ర నికర అప్పు రూ.4,38,278 కోట్లు మాత్రమే. పబ్లిక్ అకౌంట్స్ లయబిలిటీ కింద మరో రూ.80,914 కోట్ల రుణాలున్నాయి. ఇతరత్రా అన్నీ కలుపుకున్నా కూడా మొత్తం అప్పులు రూ.7 లక్షల కోట్లు మాత్రమే. మా ప్రభుత్వ హయాంలో ప్రాధాన్య రంగాలకు ఎక్కువ ఖర్చు చేశాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంపై కేవలం రూ.13,255 కోట్లు ఖర్చు చేస్తే, మేము ఏకంగా రూ.47,800 కోట్లు ఇచ్చాం. మేము తీసుకొచ్చిన 'గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్' (జీపీఎస్)ను ఇప్పుడు దేశమంతా అమలు చేయాలని కేంద్రం యోచిస్తోంది.

అన్నీ తప్పుడు లెక్కలు

- టీడీపీ హయాంలో 2014–19 మధ్య స్థూల ఉత్పత్తి బ్రహ్మాండంగా పెంచామని చంద్రబాబు శ్వేతపత్రంలో చెప్పుకోవడం సరికాదు. కోవిడ్ పీరియడ్.. కోవిడ్ లేని కాలంతో పోలికా? టీడీపీ పాలన కంటే, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే స్థూల ఉత్పత్తిలో వృద్ధి సాధించాం. 2014 నుంచి 2019 వరకు దేశ స్థూల ఉత్పత్తిలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి నిష్పత్తి 4.47 కాగా, అదే 2019 నుంచి 2024 వరకు 4.82గా నమోదైంది. పారిశ్రామిక రంగానికి సంబంధించి దేశ జీడీపీలో రాష్ట్ర జీడీపీ వాటా 2014– 2019 మధ్య 2.98 శాతం కాగా, 2019–2024 మధ్య 4 శాతం. అయినా పరిశ్రమలు రాలేదని అసత్య ప్రచారం చేయడం విడ్డూరం.
- వైఎస్ జగన్ పాలనలో స్థూల ఉత్పత్తితో పాటు తలసరి ఆదాయం కూడా మెరుగుపడింది. టీడీపీ పాలన చివరి ఏడాది 2018–19లో తలసరి ఆదాయం రూ.1,54,031 కాగా, ఆ పెరుగుదల 11.38 శాతం. వైఎస్సార్‌సీపీ పాలనలో చివరి ఏడాది 2023–24లో తలసరి ఆదాయం రూ.2,19,518 కాగా, అది 13.98 శాతానికి పెరిగింది. దీంతో మన రాష్ట్రం 18వ స్థానం నుంచి 13వ స్థానానికి చేరింది. సులభతర వాణిజ్యం (ఈఓడీబీ)లో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచింది. మా పాలనలో మద్యం అమ్మకాలు తగ్గినా, ప్రభుత్వ ఆదాయం పెరిగింది.

మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్




చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని పోలీసులు శనివారం సాయంత్రం అక్రమంగా అరెస్ట్ చేశారు. దుబాయ్‌లో స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ఆయన్ను బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. పోలింగ్ తర్వాత రోజు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో పులివర్తి నాని ఉద్రిక్తతలు రేకెత్తించిన ఘటనకు సంబంధించి మోహిత్‌రెడ్డిని ఏ–37గా చేర్చారు. నిజానికి ఆ సమయంలో మోహిత్‌రెడ్డి వర్సిటీలోని స్ట్రాంగ్ రూంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఎన్నికల అధికారుల వద్ద ఉండటం గమనార్హం. సీసీ కెమెరాల సాక్షిగా ఇదే విషయం నిర్ధారణ అయింది. కేసు నమోదు సమయంలోనూ మోహిత్‌రెడ్డి పేరు ఎక్కడా లేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఘటన జరిగిన 52 రోజుల అనంతరం రాజకీయ కక్షతో మోహిత్‌రెడ్డి పేరును కేసులో చేర్చారు. ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్‌పై కోర్టులో సోమవారం విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలోఅరెస్ట్ చేయబోమని కోర్టుకు నివేదించిన పోలీసులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నాని రాజకీయ కక్షలో భాగంగానే తనపై ప్రత్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కేసులో ఇరికించి అక్రమ అరెస్టుతో పైశాచిక ఆనందం పొందుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాటకమని తేలినా కక్ష సాధింపా?

తనపై హత్యాయత్నం జరిగిందని పులివర్తి నాని నాడు స్విమ్స్‌లో చేరి.. చేతులు, కాళ్లకు బ్యాండేజ్ కట్లతో చేసిన హడావుడి అంతా నాటకమని తేలింది. ఆ వ్యక్తి ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఎక్కడా గాయాల్లేవని ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ద్వారా స్పష్టమైంది. ఆ రిపోర్టులు ఇటీవలే బయటపడ్డాయి. మొత్తానికి ఆ రోజు అంతా డ్రామా నడిచిందని తేటతెల్లమైంది. ఆ నాటకం వల్ల ఇప్పటికే 37 మందిని జైలు పాలు చేశారు. అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకా ఎంత మందిని శిక్షిస్తారు? తప్పుడు కేసులు పెట్టి అమాయకులను మానసిక క్షోభకు గురి చేయడం దారుణం. ఆ వ్యక్తి గాయాలన్నీ 'కట్టు' కథలే అని తేలినప్పటికీ, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గం.

విదేశాల్లో చదివిన వాడిని వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారు



నా కొడుకు వయస్సు 25 ఏళ్లు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా జీవితంలోకి వచ్చాడు. అక్రమ కేసులో అరెస్ట్ చేయించారు. విదేశాల్లో చదివిన నా కొడుకుని వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు. నేను విద్యార్థి దశ నుంచే ఉద్యమాలతో పెరిగినవాడిని. నాకంటే మించి నా కొడుకు ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు ఎలా ఉంటాయో ఈ ప్రభుత్వానికి, ఈ పోలీసు అధికారులకు రుచి చూపిస్తారు. ప్రజల పక్షాన ఏ స్థాయి పోరాటానికైనా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాం.

– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, చంద్రగిరి

తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ

పలు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం



న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. రాజవంశీకుడైన ఆయన రామజన్మభూమి ఉద్యమ సమయంలో 1990లలో బీజేపీలో చేరారు. 2018–23 వరకు త్రిపుర ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కూడా. జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధా దేవ్‌వర్మ. వీరికి ఇద్దరు కుమారులు. వర్మను తెలంగాణ గవర్నర్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులిచ్చింది. ఓంప్రకాశ్ మాథుర్ సిక్కిం గవర్నర్‌గా, హరిభావు కిషన్‌రావు బాగ్డే రాజస్తాన్ గవర్నర్, విజయశంకర్ మేఘాలయ గవర్నర్‌గా నియమితులయ్యారు. సంతోష్‌కుమార్ గంగ్వార్ జార్ఖండ్‌కు, రామెన్ డేకా ఛత్తీస్‌గఢ్‌కు గవర్నర్లుగా నియమితులయ్యారు. జార్ఖండ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను మహారాష్ట్రకు మార్చారు. అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను పంజాబ్‌కు మార్చి చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా కూడా బాధ్యతలు అప్పగించారు. లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ను అస్సాం గవర్నర్‌గా నియమించి మణిపూర్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. కె.కైలాస్‌నాథ్‌ను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించారు.

క్లుప్తంగా...

చంద్రబాబు చెవుల్లో మోదీ కాలీఫ్లవర్లు

మాజీ ఎంపీ చింతామోహన్



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కేంద్ర బడ్జెట్ బాగుందని, ఆహా ఓహో అంటూ సీఎం చంద్రబాబు సంకలు గుద్దుకుంటున్నాడని మాజీ ఎంపీ చింతా మోహన్ ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సీఎం చంద్రబాబు రెండు చెవుల్లో కాలీఫ్లవర్ పెట్టాడని చింతామోహన్ ఎద్దేవా చేశారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఒక చెవిలో పోలవరం, మరో చెవిలో రాజధాని అమరావతి ఫ్లవర్స్ పెట్టాడన్నారు. రాష్ట్రానికి కేటాయించారని చెబుతున్న రూ.15 వేల కోట్లు కేవలం రుణం మాత్రమేనని, గ్రాంట్‌గా ఎక్కడా ప్రకటించలేదని తెలిపారు. చంద్రబాబు తీరు చూసి పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు నవ్వుకుంటున్నారన్నారు. మరో పదేళ్లయినా పోలవరాన్ని పూర్తి చేయలేరని వివరించారు. రాష్ట్రంలో 20శాతం పైగా ఉన్న ఎస్సీలకు ఏం చేస్తారో స్పష్టం చేయాలని చంద్రబాబును ప్రశ్నించారు.

హౌసింగ్ ఏఈ ఆత్మహత్యాయత్నం

అధికారుల వేధింపులే కారణమని భార్య ఫిర్యాదు



చికిత్స పొందుతున్న బాలాజీ

ధర్మవరం అర్బన్/అనంతపురం మెడికల్: శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన హౌసింగ్ ఏఈ అన్నం బాలాజీ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ధర్మవరంలోని హౌసింగ్ కార్యాలయంలో శనివారం తన వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగడంతో తోటి ఉద్యోగులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అధికారుల వేధింపుల వల్లే తన భర్త ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు బాలాజీ భార్య వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలాజీ నాలుగేళ్ల పాటు ధర్మవరం హౌసింగ్ ఏఈగా పనిచేశారు. కొన్నిరోజుల క్రితం ఆయనను జిల్లా కేంద్రంలోని హౌసింగ్ పీడీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అటూ ఇటూ తిరగలేనని, ధర్మవరంలోనే పోస్టింగ్ ఇవ్వాలని పట్టుబట్టినట్టు సమాచారం. పోస్టింగ్ విషయంలో జాప్యం జరగడంతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. కాగా.. రెండు నెలలుగా హౌసింగ్ పీడీ శంకర్ నారాయణ, డీఈ శంకర్‌లాల్, ముగ్గురు కిందిస్థాయి ఉద్యోగులు తన భర్తను వేధిస్తున్నారని, డీఈ శంకర్‌లాల్ భారీగా డబ్బు డిమాండ్ చేశారని బాలాజీ భార్య వనిత ఆరోపించారు. వారు అడిగిన మొత్తం ఇవ్వనందుకే ఎటువంటి కారణం చెప్పకుండానే పీడీ కార్యాలయానికి అటాచ్ చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అనుమానాస్పద మృతి

- రైలు పట్టాలపై మృతదేహం
- విచారణ చేస్తున్న రైల్వే పోలీసులు



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



కుదిరి సర్పంచ్ చెంగయ్య (ఫైల్)

సూళ్లూరుపేట రూరల్ (తిరుపతి జిల్లా) : సూళ్లూరుపేట మండలం కుదిరి పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ బుంగా చెంగయ్య శనివారం ఉదయం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ పట్టాలపై శవమై కనిపించారు. ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతిచెందాడా లేక ఆత్మహత్యా.. అనే విషయాలపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుంగా చెంగయ్య వైఎస్సార్‌సీపీ నుంచి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు కుమారుడు, కుమార్తె. ఆయన మృతితో వైఎస్సార్‌సీపీ నేతలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఇదిలా ఉండగా, బుంగా చెంగయ్య మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్ రెడ్డి, స్థానిక పార్టీ నేతలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

■ 'గవర్నర్ గారూ.. మన్నించండి'



గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ పాలక భవనాన్ని ప్రారంభించిన శిలాఫలకాలు

- చాన్సలర్ హోదాలో ఆయన ప్రారంభించిన శిలాఫలకాన్ని తొలగించిన జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ
- ఆ స్థానంలో చంద్రబాబు శిలాఫలకం ఏర్పాటు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ హెచ్.సుదర్శనరావు స్వామిభక్తిని ప్రదర్శించారు. జేఎన్‌టీయూఏ నూతన పాలక భవనాన్ని జనవరి 6న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో ప్రారంభించారు. వర్సిటీలో స్నాతకోత్సవానికి హాజరైన సందర్భంగా ఆయన నూతన భవనాన్ని ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని భవనం ముందు ఏర్పాటు చేశారు. కాగా.. 2017లో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పరిపాలన భవనం, లెక్చర్ హాల్ కాంప్లెక్స్, ఫార్మసీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకం వర్సిటీ క్యాంపస్‌లో అప్పట్లో ఏర్పాటు చేశారు. తాజాగా నూతన పాలక భవనాన్ని గవర్నర్ ప్రారంభించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ వచ్చి భవనాన్ని ప్రారంభిస్తే.. ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ హెచ్.సుదర్శనరావు ఆ శిలాఫలకాన్ని తొలగించి, సీఎం చంద్రబాబు 2017లో వర్చువల్‌గా భూమి పూజ చేసిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఇదే విషయాన్ని మీడియాకు సైతం తెలిపారు. రాష్ట్రంలోనే అత్యున్నత హోదా కలిగిన గవర్నర్‌కు ఇచ్చే మర్యాద ఇదేనా? వర్సిటీ చాన్సలర్ అంటే ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌కు లెక్కలేదా? అని పలువురు విస్మయం వ్యక్తం చేశారు.



గవర్నర్ శిలాఫలకాన్ని తొలగించి ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు ఏర్పాటు చేయించిన శిలాఫలకం

సైనికుడిపైనా టీడీపీ అరాచకం

తమకు ఓటేయలేదనే కక్షతో అతనిపై టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో ఆ పార్టీ నేత ఫిర్యాదు

పెద్ద సంఖ్యలో పోలీసులు, అధికారులు వచ్చి ఇంటి ప్రహరీ కూల్చివేత

- వెంకినాయుడు కన్నీటితో ప్రాధేయపడినా కనికరించని అధికారులు
- ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు
- టీడీపీ నేతల ఆక్రమణలను కూల్చివేయాలంటూ ఆందోళన
- విజయనగరం జిల్లా దన్నానపేటలో ఘటన



భారీ బందోబస్తుతో మాజీ సైనికుడి ఇంటి ప్రహరీని జేసీబీతో కూల్చివేసిన అధికారులు

నెల్లిమర్ల రూరల్/విజయనగరం అర్బన్: అధికార దర్పంతో చెలరేగిపోతున్న టీడీపీ మూకలు చివరకు దేశ సైనికుడినీ వదిలిపెట్టలేదు. టీడీపీకి ఓటేయలేదనే అనుమానంతో అతనిపై దౌర్జన్యానికి దిగాయి. టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసి.. అధికార బలంతో అతని ఇంటిపైకి జేసీబీని దూకించాయి. 24 ఏళ్ల పాటు దేశానికి రక్షణగా నిలిచిన మాజీ జవాన్ ఇంటి ప్రహరీని నిర్దాక్షిణ్యంగా కూల్చివేయించాయి. తనకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని అతను కన్నీటిపర్యంతమైనా టీడీపీ మూకలు, అధికారులు కనికరించలేదు. ఈ ఘటన శనివారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం దన్నానపేటలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. దన్నానపేటకు చెందిన పతివాడ వెంకినాయుడు 24 ఏళ్ల పాటు సైనికుడిగా దేశానికి సేవ చేశాడు. ఆ కష్టార్జితంతో ఇల్లు నిర్మించుకున్నాడు. అయితే ఆ ఇంటి ప్రహరీ ఆక్రమణలో ఉందని ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గేదెల రాజారావు అమరావతికి వెళ్లి ఆ పార్టీ నాయకులను కలిసి.. టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడి నుంచి అందిన ఆదేశాల మేరకు ఆర్డీవో సూర్యకళ గురువారం గ్రామంలో పర్యటించారు. వెంకినాయుడు ఇంటి ప్రహరీ ఆక్రమణ భూమిలో ఉందని.. దానిని తొలగించాలని తహసీల్దార్ ధర్మరాజుకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో టీడీపీ నాయకుల ఆక్రమణలు కోకొల్లలుగా ఉన్నాయని, వాటిని తొలగించకుండా.. సైనికుడి ఇంటి మీదకు రావడమేంటని గ్రామస్తులు మండిపడ్డారు. కానీ, రెవెన్యూ అధికారులు శనివారం సుమారు 50 మందికి పైగా పోలీస్ సిబ్బందితో వచ్చి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేశారు. ఆ వెంటనే జేసీబీతో వెంకినాయుడు, అతని సోదరుడు లక్ష్మణరావుకు చెందిన ఇంటి ప్రహరీని కూల్చివేశారు. వెంకినాయుడు దంపతులు కన్నీటిపర్యంతమై ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదు. దీంతో అధికారులు, టీడీపీ నేతల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆందోళనకు దిగారు. దీంతో తహసీల్దార్ ధర్మరాజు.. టీడీపీ నేతల ఆక్రమణలు కూడా తొలగిస్తామంటూ పేపర్‌పై సంతకం పెట్టి బాధితులకు అందజేశారు.

జవాన్‌ను వేధించడమే మీ రాజకీయమా?: బొత్స



దేశ రక్షణ కోసం సేవలందించిన జవాన్ ఇంటి ప్రహరీని అన్యాయంగా కూల్చేయడమే మీ మంచి సంప్రదాయమా? సైనికుడిని వేధించడమే మీ రాజకీయమా? అని నెల్లిమర్ల టీడీపీ ఎమ్మెల్యేపై, ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఉగ్రవాది ఇంటికి వెళ్లినట్లుగా.. ఆర్మీ ఉద్యోగి ఇంటిపైకి 50 మంది పోలీసులతో వెళ్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. 'మాజీ సైనికుడు వెంకినాయుడు ఇంటి ప్రహరీ కూల్చితే మీకొచ్చే లాభమేంటి? అదో మారుమూల గ్రామం. అయినా ఎందుకు కూల్చారు? కలెక్టర్, ఎస్పీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి. రాజకీయాలకు కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే జిల్లాలోకి ఇలాంటి సంస్కృతిని తీసుకురావడం దారుణం' అని మండిపడ్డారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొన్నారు.

దేశానికి సేవ చేస్తే.. ఇదా బహుమతి!



ప్రహరీ కూల్చేయడంతో రోదిస్తున్న మాజీ సైనికుడు వెంకినాయుడు దంపతులు

మాజీ సైనికుడు వెంకినాయుడు మీడియాతో మాట్లాడుతూ... 'నేను 24 ఏళ్ల పాటు దేశ రక్షణ కోసం పని చేశా. అలాంటి నాకు ఇదా ఈ ప్రభుత్వమిచ్చే బహుమతి. గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటు వేయలేదనే కక్షతో గ్రామ టీడీపీ నేత గేదెల రాజారావు అమరావతి వరకు వెళ్లి మరీ నాపై ఫిర్యాదు చేశాడు. న్యాయం, ధర్మం అంటూ మాట్లాడే పవన్‌కళ్యాణ్, చంద్రబాబుకు ఈ మాజీ సైనికుడికి జరుగుతున్న అన్యాయం కనిపించడం లేదా? రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేని నాపై వేధింపులకు పాల్పడడం సరికాదు. గ్రామంలోని టీడీపీ నేతల ఆక్రమణలు తొలగించే వరకు నా పోరాటం ఆగదు. టీడీపీ వాళ్ల దౌర్జన్యాలను అడ్డుకొని రాష్ట్రపతి నాకు న్యాయం చేయాలని కోరుకుంటున్నా' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆపరేషన్ ధూల్‌పేట్

సాక్షి, హైదరాబాద్: గంజాయికి నగరంలో కేంద్రంగా మారుతున్న ధూల్‌పేట్ ప్రాంతాన్ని ఆగస్టు 31లోపు గంజాయి రహిత ప్రాంతంగా మార్చే లక్ష్యంతో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ధూల్‌పేట్ చేపట్టినట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. నగరంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ధూల్‌పేట్‌లోనే మూలాలు ఉంటున్నందున ఎక్కువ దృష్టి పెట్టినట్టు తెలిపారు. ధూల్‌పేట్ ప్రాంతంలో గంజాయి రవాణా, అమ్మకాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న 15 మంది నిందితులను గుర్తించామని, ఇందులో ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. శనివారం ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషితో కలిసి కమలాసన్‌రెడ్డి మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ పోలీసు, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారుల సమన్వయంతో దాడులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ధూల్‌పేట్‌తోపాటు గంజాయికి అడ్డాలుగా మారుతున్న నానక్‌రామ్‌గూడ, లంగర్‌హౌస్, సీతాఫల్‌మండి సహా ఇతర ప్రాంతాల్లోనూ నిఘా పెంచినట్టు తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈఎస్ అంజిరెడ్డి బృందం శనివారం జరిపిన సోదాల్లో 54 కిలోల గంజాయి పట్టుబడిందని, గంజాయి రవాణా ముఠాలో కీలకంగా ఉన్న ఏ–1 రాహుల్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో హైదరాబాద్‌లో గంజాయితోపాటు ఇతర మత్తుపదార్థాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో క్రమంగా పెరుగుతున్న నాటుసారాపై సైతం దృష్టి పెట్టామని, మూడు నెలల్లో దీన్ని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు.

మంత్రి సుభాష్ అనుచరులమంటూ బెదిరింపులు

అధికారులకు మొరపెట్టుకున్న తాళ్లపొలం సర్పంచ్



కట్టా గోవింద్ పొలం వద్ద సుభాష్ అనుచరులతో మాట్లాడుతున్న పోలీస్ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరులమంటూ కొందరు వ్యక్తులు తమను తరచూ బెదిరిస్తున్నారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం తాళ్లపొలం సర్పంచ్ కట్టా గోవింద్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సుమారు రెండున్నర ఎకరాల పొలాన్ని గోవింద్ తన తల్లి నుంచి వీలునామా ద్వారా పొంది పంటలు పండించుకుంటున్నారు. ఈ క్రమంలో తన చెల్లెళ్లు పిల్లి నాగమణి, కురుపూడి జానికమ్మ, మేనల్లుడు పిల్లి వీరమణికంఠ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ విషయమై ఇప్పటికే కోర్టులో రెండు కేసులు నమోదయ్యాయి. రామచంద్రపురం ఎమ్మెల్యేగా వాసంశెట్టి సుభాష్ గెలిచి, మంత్రి అయిన తరువాత ఆయన అనుచరులమని, తెలుగుదేశం నేతలమని, శెట్టిబలిజ సంఘం పెద్దలమంటూ పిల్లి వీర మణికంఠ, వాసంశెట్టి చంద్రశేఖర్ (బాల), దొంగల శ్రీధర్, వనుం గోవింద రాజు, మేడిశెట్టి భాస్కరరావు, కోడి త్రినాథ్, యాంద్ర సుబ్రహ్మణ్యం, వనుం వెంకటేశ్, కురుపూడి వెంకటేశ్వర్లు, దోనుమూడి రామకృష్ణ ఈ నెల 18 తమపై దాడి చేశారని, తాను ఊడ్చిన పంటలు నాశనం చేశారని గోవింద్ తెలిపారు. వారి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. ఈ మేరకు రామచంద్రపురం అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, జిల్లా కలెక్టర్, రామచంద్రపురం ఆర్డీవో, తహసీల్దార్, ఎస్పీ, రామచంద్రపురం డీఎస్పీ, సీఐ, ద్రాక్షారామ ఎస్సైలకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

టీడీపీ వేధింపులే కారణం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాగవేణి

ఓడీ చెరువు : శ్రీ సత్యసాయి జిల్లాలో టీడీపీ నాయకుల వేధింపులు పరాకాష్టకు చేరాయి. వారి వేధింపులు తాళలేక ఓడీ చెరువు మండలం కొండకమర్ల పంచాయతీ వీరప్పగారిపల్లికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణి శనివారం ఆత్మహత్యకు ప్రయత్నించారు. సెల్ఫీ వీడియోలో టీడీపీ నాయకుల వేధింపులను వివరిస్తూ పురుగు మందు తాగారు. గ్రామస్తులు ఆమెను హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కథనం ప్రకారం.. 2013లో సాధారణ నియామకాలలో భాగంగా గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, నాగవేణి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. 2014లో ఈశ్వరమ్మను అంగన్‌వాడీ కార్యకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. అయితే.. ఈశ్వరమ్మ నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచిందని నాగవేణి కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదం కోర్టులో ఉండగానే 2019లో ఈశ్వరమ్మ తన పోస్టుకు రాజీనామా చేశారు. తదుపరి నోటిఫికేషన్ ద్వారా నాగవేణిని నియమించారు. కాగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ మద్దతుదారుల వేధింపులు అధికమయ్యాయి. ఈశ్వరమ్మతో పాటు టీడీపీకి చెందిన వెంకటేశ్ భార్య భాగ్యమ్మ, సోము భార్య వరలక్ష్మి, కేశన్న తదితరులు ప్రతిరోజూ వేధిస్తున్నట్లు నాగవేణి భర్త గంగాద్రి వాపోయారు. వారి వేధింపులు తాళలేక ప్రతిరోజూ మదనపడేదని, అవసరమైతే రాజీనామా చేద్దామని చెప్పానని, ఇంతలోనే ఆత్మహత్యకు ప్రయత్నించిందని కన్నీటి పర్యంతమయ్యాడు.

ఎంపీపీకి టీడీపీ బెదిరింపులు

- చిలమత్తూరు ఎంపీపీ పదవి కోసం అధికార బలం ప్రయోగం
- ఒక్క ఎంపీటీసీ లేకపోయినా పదవి కోసం దుష్ట రాజకీయం
- సర్వసభ్య సమావేశానికి వెళ్లకుండా ఎంపీపీకి బెదిరింపులు
- రాష్ట్రం విడిచి వెళ్లిన ఎంపీపీ.. సమావేశం వాయిదా
- 9 మంది ఎంపీటీసీలను పార్టీలోకి చేర్చుకున్న టీడీపీ
- వారితో పదవిని చేజిక్కించుకొనే కుట్ర
- బాలకృష్ణ నియోజకవర్గంలో బరితెగింపు



144 సెక్షన్ ఉన్నా ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు: ఒక్క ఎంపీటీసీ కూడా లేకపోయినా, అధికారం బలంతో ఎంపీపీ పదవి చేజిక్కించుకొనేందుకు టీడీపీ నీచ రాజకీయానికి దిగింది. నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు ఎంపీపీని బెదిరించి, అధికార బలాన్ని ఉపయోగించి, ఆయన మండల సమావేశంలో పాల్గొనకుండా అడ్డుకొంది. రాష్ట్రం విడిచి వెళ్లిపోయేలా చేసింది. శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయించింది. అక్కడ పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి, 144 సెక్షన్ విధించి, భారీ సంఖ్యలో కార్యకర్తలతో హంగామా సృష్టించింది. 9 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను బలవంతంగా టీడీపీలో చేర్చుకొంది. ఈ ఎంపీటీసీల బలంతో ఎంపీపీ పదవిని చేజిక్కించుకొనేందుకు ఎత్తులు వేస్తోంది. ఒక్క ఎంపీటీసీ కూడా గెలవని టీడీపీ.. చిలమత్తూరు ఎంపీపీ పదవి కోసం పోలీసులను ఉపయోగించింది. ఇందు కోసం ఎంపీపీ పురుషోత్తంరెడ్డిని లక్ష్యంగా చేసుకొంది. ఆయన్ని పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురి చేసింది. సమావేశానికి హాజరైతే రౌడీషీట్ తెరిపించి జిల్లా బహిష్కరణ చేస్తామని పోలీసులు, టీడీపీ నేతలు బెదిరించినట్టు సమాచారం. దీంతో శనివారం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనాల్సిన పురుషోత్తమరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయినట్లు సమాచారం. ఎంపీపీ లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీవో ప్రకటించారు. సర్వసభ్య సమావేశం సందర్భంగా గొడవలు జరుగుతాయంటూ పోలీసులు 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. అయితే దాని ప్రభావం ఎక్కడా కనిపించలేదు. వందలాది టీడీపీ కార్యకర్తలు, నాయకులు మండల కేంద్రంలో హల్‌చల్ చేశారు. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి బల ప్రదర్శన చేశారు. అయినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు.

టీడీపీలో లుకలుకలు

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను చేర్చుకోవడంతో టీడీపీలో విభేదాలు నెలకొన్నాయి. తమ అనుమతి లేకుండా ఎలా పార్టీల్లో చేర్చుకుంటారంటూ ఆ పంచాయతీల్లోని టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీ పదవి పైనా టీడీపీలో నాగరాజు యాదవ్, రంగారెడ్డి రెండు వర్గాలుగా విడిపోయారు. ఎవరికి వారు ఎంపీపీ పదవిని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. తమ పార్టీలోకి వచ్చిన ఎంపీటీసీలను వారి శిబిరాల్లో చేర్చుకొనే ప్రయత్నాల్లో ఉన్నారు.

భవిష్యత్ ఎలక్ట్రిక్ వాహనాలదే

దేశంలోనే అతి పెద్ద పబ్లిక్ ఈవీ చార్జింగ్ కేంద్రం ప్రారంభించిన జయేశ్‌రంజన్



ఎయిర్‌పోర్టు సమీపంలో అతిపెద్ద ఈవీ చార్జింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

శంషాబాద్: చార్జింగ్ కేంద్రాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో భవిష్యత్‌లో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతారని ఐటీ,పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. స్వీడన్‌కు చెందిన గ్లీడా సంస్థ శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో శ్రీశైలం హైవేలో ఒకేసారి 102 వాహనాలు చార్జింగ్ చేసుకునేలా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ గ్లీడా వంటి సంస్థ దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఈవీ చార్జింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ 2018 కేవలం ఒక చార్జింగ్ పాయింట్‌తో ప్రయాణం ప్రారంభించి ప్రస్తుతం నగరంలో మొత్తం 89 కేంద్రాలను విస్తృతపర్చిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవదేష్ అన్నారు.

25 మంది విద్యార్థులకు అంటకత్తెర!

- ఖమ్మం జిల్లా పేరువంచ జెడ్పీహెచ్‌ఎస్‌లో టీచర్ నిర్వాకం
- ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు



దిగుమర్తి శిరీష



కల్లూరురూరల్: విద్యార్థుల జుట్టు పెరిగిందని.. పాఠం చెబుతుండగా తరచు ఎగుర వేస్తూ..సవరించుకుంటున్నారని ఓ ఉపాధ్యాయురాలు ఇష్టానుసారం జుట్టు కత్తిరించేసింది. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పాఠశాల ఇంగ్లిష్ టీచర్ దిగుమర్తి శిరీష పలువురు విద్యార్థులకు జుట్టు పెరిగిందని...కటింగ్ చేయించుకోవాలని శుక్రవారం సూచించింది. అయితే, ఆదివారం కటింగ్ చేయించుకోవచ్చనే భావనతో విద్యా ర్థులు శనివారం అలాగే పాఠశాలకు వచ్చారు. దీంతో ఆగ్రహించిన టీచర్ 6, 7, 8, 9, 10వ తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులను దశలవారీగా స్కూల్ ఆవరణలోకి తీసుకొచ్చి కత్తెరతో ఇష్టమున్నట్టు కత్తిరించింది.

తల్లిదండ్రుల ఆందోళన

ఈ ఘటనతో ఆవేదన చెందిన విద్యార్థులు ఇళ్లకు వెళ్లి విషయం తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కొందరు విద్యార్థులు పెరిగిన జుట్టుతో వెనక్కి ఊపుకుంటూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని అందుకే తాను కత్తెరతో జుట్టును అక్కడక్కడ కత్తిరించిన విషయం వాస్తవమేనని ఉపాధ్యాయు రాలు శిరీష చెప్పారు. ఈ ఘటనపై వివరాలు సేకరించిన అనంతరం ఉపాధ్యాయురాలు శిరీషను సస్పెండ్ చేస్తూ డీఈఓ సోమశేఖరశర్మ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీజీఈఏ అధ్యక్షుడిగా సూర్యనారాయణ తొలగింపు

- నూతన అధ్యక్షుడిగా శ్రీకాంత్ రాజు
- సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు ప్రకటన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి కేఆర్ సూర్యనారాయణను తొలగించినట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్‌రావు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడుగా డి. శ్రీకాంత్ రాజు (ఐసీడీఎస్ శాఖ)ను ఎన్నుకుంటూ కార్యవర్గం తీర్మానించిందని చెప్పారు. సూర్యనారాయణ అరాచకాలు, స్వార్థ ప్రయోజనాలు, కుట్రలు భరించలేకే పదవి నుంచి తొలగించినట్టు తెలిపారు. ఆయన అండతో సంఘం సొమ్మును సొంత అకౌంట్‌లో జమ చేసుకున్న ఆర్గనైజింగ్ సెక్రటరీ గుళ్ళ నాగసాయిని కూడా పదవి నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం సూర్యనారాయణ గొంతెమ్మ కోర్కెలను తీర్చకపోవడంతో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయొద్దంటూ ప్రచారం చేశారన్నారు. ఉద్యోగుల సమస్యల పేరుతో గవర్నర్ వద్దకు పంపి తమను బలిచేశారని తెలిపారు. చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణను ఉద్యోగ ద్రోహులుగా చిత్రీకరించారని, ఇప్పుడు తన ప్రచారం వల్లే చంద్రబాబు సీఎం అయ్యారని, ప్రభుత్వానికి దగ్గరయ్యానని ఉద్యోగులకు నమ్మబలుకుతున్నారని చెప్పారు. ఆయన్ని ఉద్యోగులు, ప్రజలు నమ్మొద్దని కోరారు. వాణిజ్య పన్నుల శాఖలో ప్రభుత్వానికి రావాల్సిన సొమ్మును సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న కేసులో సూర్యనారాయణ అరెస్టయ్యారని, ఆయన్ని నమ్ముకున్న మరో నలుగురు ఉద్యోగులు ఆ కేసులో జైలు శిక్ష అనుభవించి, సస్పెన్షన్‌లో ఉన్నారని తెలిపారు.



‘ఆయన నాకు అనుగ్రహించిన దానియంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున వాటిని లేపుటయే నన్ను పంపినవాని చిత్తమైయున్నది.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** బ.అష్టమి రా.10.47 వరకు, తదుపరి నవమి; **నక్షత్రం:** అశ్విని ప.3.54 వరకు, తదుపరి భరణి; **వర్జ్యం:** ప.12.09 నుండి 1.39 వరకు, తదుపరి రా.12.57 నుండి 2.27 వరకు; **దుర్ముహూర్తం:** సా.4.48 నుండి 5.39 వరకు; **అమృత ఘడియలు:** ఉ.9.11 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

యోగి ఆదిత్యనాథ్
(ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

గెలుపు.. భుజం మీద చెయ్యి వేస్తుంది.

ఓటమి.. భుజం మీది ఆ చేతిని తీయించేస్తుంది. భుజానికి, చేయికి మధ్య ఉండేవి గెలుపు ఓటములే కాని... అది ఎవరి భుజం, ఎవరి చెయ్యి అన్నది కాదు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యూపీలో 62 సీట్లు వచ్చినప్పుడు, ఆ తర్వాత మోదీజీ ఒకట్రెండుసార్లు నా భుజం మీద చెయ్యి వేసి నాతో కలిసి కొంత దూరం నడిచారు. 2024 ఎన్నికల్లో ఆ 62 సీట్లు 33 కు తగ్గిపోయినప్పుడు... "మీరుండీ ఓడిపోయాం యోగీ..." అన్నట్లుగా నా వైపు చూశారు. చూశారే గానీ నా భుజంపైన చెయ్యి వేయలేదు! ఓటమిలోనే కదా, నిజంగా ఎవరైనా ఎవరి భుజం మీదైనా చెయ్యి వేయవలసింది!

"ఏంటి ఆలోచిస్తున్నారు యోగీజీ?" అన్నారెవరో నా భుజం మీద చేయి వేసి! ఆ చెయ్యి మోదీజీది అవకూడదా అని ఆశగా తల తిప్పి చూశాను. చెయ్యి మోదీజీది కాదు. నీతి ఆయోగ్ మీటింగ్‌కి వచ్చిన ఏక్‌నాథ్ షిందేది.



"మీరా!" అని నవ్వాను.

"అవును నేనే. మీరు ఎవరని అనుకున్నారు?" అని నవ్వారాయన.

"ఎవరనీ అనుకోలేదు. ఎవరై ఉంటారా అనుకున్నాను" అన్నాను.

"నేను రెండుసార్లు మిమ్మల్ని పిలిచాను. ఏదో ఆలోచనలో ఉన్నారు. అందుకే భుజం మీద చెయ్యి వేయగలిగాను... " అన్నారు షిందే.

"ఓ అదా... ఆలోచన కాదు. మీటింగ్‌కి వచ్చిన సీఎంలు ఎవరెవరా అని చూస్తున్నాను" అని అబద్ధం చెప్పాను.

షిందే నవ్వారు. "రానివాళ్లు ఎవరెవరా అని కదా చూడాలి యోగీజీ! మన వాళ్లంతా దాదాపుగా వచ్చినట్లే. వాళ్ల వైపు పంజాబ్ నుంచి భగవంత్ రాలేదు. తెలంగాణ నుంచి రేవంత్ రాలేదు. కర్ణాటక నుంచి సిద్దరామయ్య రాలేదు. జార్ఖండ్ నుంచి సొరేన్ రాలేదు. హిమాచల్ నుంచి సుఖ్వందర్ రాలేదు. తమిళనాడు నుంచి స్టాలిన్ రాలేదు. కేరళ నుంచి విజయన్ రాలేదు" అన్నారు.

"మమతాజీ వచ్చినట్లున్నారు కదా..." అన్నాను, మమత ఉన్న వైపు చూస్తూ.

"అవును వచ్చారు. తక్కినవాళ్లంతా తమ స్టేట్‌కు బడ్జెట్‌లో ఏమీ ఇవ్వలేదన్న నిరసనతో మీటింగ్ రావటం మానేస్తే, మమత ఒక్కరూ తన స్టేట్‌కు బడ్జెట్‌లో ఏమీ ఎందుకు ఇవ్వలేదో డైరెక్టుగా మోదీతోనే తేల్చుకోటానికి మీటింగ్ వచ్చారు..." అన్నారు షిందే నవ్వుతూ.

"అవునా!" అన్నాను.

మళ్లీ నా భుజం మీద చెయ్యి పడింది! ఇప్పుడైనా మోదీజీ అయుండకూడదా అని చూశాను. మోదీజీ కాదు. విష్ణుదేవ్ సాయ్. ఛత్తీస్‌గఢ్ సీఎం. ఆయన రెండో చెయ్యి షిందే భుజం మీద ఉంది.

"ఏంటి.. నాథులిద్దరూ సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నారు?" అన్నారు విష్ణుదేవ్ నవ్వుతూ. నాథులిద్దరూ అంటే ఏక్‌నాథ్, ఆదిత్యనాథ్ అని కావచ్చు.

ఇద్దరం నవ్వాం.

"మోదీజీని కలిశారా?" అని అడిగారు విష్ణుదేవ్.

"ఇంకా రానిదే!" అన్నారు షిందే.

"ఆయన వస్తారా! మనమే కదా ఆయన దగ్గరకు వెళ్లాలి..." అన్నారు విష్ణుదేవ్.

దూరాన్నుంచి – మోదీజీ ఎవరితోనో నవ్వుతూ మాట్లాడుతుండటం గమనించాను. నేను గమనించానని గమనించి వెంటనే ముఖం తిప్పేసుకున్నారు ఆయన!

ఓటమి మనిషిని ఇంతగా కానివాడిని చేస్తుందా? "డైరెక్టుగా మోదీతోనే తేల్చుకోటానికి మీటింగ్‌కి వచ్చారు..." అని మమత గురించి షిందే చెప్పటం గుర్తొచ్చి వెంటనే మోదీజీ దగ్గరకు వెళ్లిపోయాను.

"నమస్తే మోదీజీ..." అన్నాను.

అప్పుడు కూడా ఆయన నా భుజంపై చేయి వెయ్యలేదు. అసలు నా వైపే చూడలేదు.

"ఈ ఏడాది యూపీలో పది చోట్ల ఉప ఎన్నికలు ఉన్నాయి కదా..." అని ఎవరితోనో అన్నట్లుగా నాతో అని, పక్కన ఇంకెవరినో పలకరిస్తూ ముందుకు వెళ్లిపోయారు!!

బాధ్యత లేని ‘బోగస్’ గెలుపు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

కష్టపడి సంపాదించిన వాడికే డబ్బు విలువ తెలుస్తుందంటారు. విలువ తెలుసు కనుక దానిపట్ల బాధ్యత కూడా పెరుగుతుంది. దొంగ సొత్తుకూ, అక్రమ సంపాదనకూ ఈ సూత్రం వర్తించదు. డబ్బు సంపాదనే కాదు, విజయ సాధన కూడా ఇంతే. అది ఎన్నికల విజయమైనా మరే రకమైన విజయమైనా సరే. పోరాడి గెలిచిన వాడికి తనకు దక్కిన విజయం పట్ల గౌరవం ఉంటుంది. విజయ హేతువుల పట్ల వినమ్రత ఉంటుంది. బాధ్యత ఉంటుంది.

అన్ని రంగాల్లోనూ దొడ్డిదారి విజయాలు కూడా ఉంటాయి. ఎన్నికల్లో కూడా ఉంటాయి. పరోక్ష ఎన్నికల్లో ఇటువంటి దొడ్డిదారి విజయాల వికటాట్టహాసం మనకు తెలియనిది కాదు. కానీ ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల తీర్పును ‘దొంగిలించడమ’నే సరికొత్త సాంకేతిక ప్రక్రియ రంగప్రవేశం చేసింది. ఈ పరిణామం పట్ల మనదేశంలోని మేధావుల్లో, ప్రజాస్వామ్య వాదుల్లో, అభ్యుదయ శక్తుల్లో ఆందోళన మొదలైంది. ఇటువంటి ఆందోళనే మహారాష్ట్రలోని కొంతమందిని ఒక దగ్గరకు చేర్చింది. వోట్ ఫర్ డెమోక్రసీ (వీఎఫ్‌డీ) అనే వేదిక తయారైంది.

వీఎఫ్‌డీ అనే వేదికపైకి కొందరు వ్యక్తులతోపాటు కొన్ని సంస్థలు కూడా చేరుకున్నాయి. దేశంలో జరిగిన మొన్నటి సాధారణ ఎన్నికల ఫలితాలు చాలామందిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ వేదిక కూడా మినహాయింపు కాదు. కానీ వీఎఫ్‌డీ మాత్రం ఆశ్చర్యంలోనే మునకేసి ఉండకుండా ఒక ముందడుగు వేసింది. ఎన్నికల ప్రక్రియను ఆసాంతం అధ్యయనం చేసి ఒక 225 పేజీల నివేదికను ఈమధ్యనే ఆ సంస్థ విడుదల చేసింది. ఈ నివేదికలో పొందుపరిచిన పలు అంశాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మన ప్రజాస్వామ్య ప్రక్రియ పవిత్రతను సహేతుకంగా శంకిస్తున్నాయి.

ఈవీఎమ్‌ల పనితీరుపైనా, పారదర్శకతపైనా అనుమానాలు, అభ్యంతరాలు పాతవే. వీడీఎఫ్ కేవలం సందేహాలకు మాత్రమే పరిమితం కాకుండా పోలింగ్ సందర్భంగా, కౌంటింగ్ సందర్భంగా జరిగిన అవకతవకలను ఎత్తిచూపింది. ఎన్నికల ప్రక్రియకు ముందు ఎన్నికల సంఘంలో జరిగిన అసాధారణ మార్పులను ఎండగట్టింది. ప్రక్రియ ముగిసేవరకూ ఎన్నికల సంఘం అవలంబించిన ఏకపక్ష ధోరణిని నిర్ధారించింది. ఫలితాల ప్రకటనలోని అసమంజసత్వాన్ని వెలికి తీసింది.

సాధారణంగా పోలింగ్ ముగిసిన అనంతరం సాయంత్రం ఏడు లేదా ఎనినిమిది గంటలకల్లా పోలింగ్ శాతాలను ఎన్నికల సంఘం ప్రకటించడం రివాజు. ఎక్కడైనా కొన్ని బూత్‌లలో పోలింగ్ ఆలస్యంగా జరిగితే అవి కూడా కలుపుకొని రాత్రి ఆలస్యంగా గానీ, అరుదుగా మరుసటిరోజు గానీ తుది పోలింగ్ శాతాన్ని ఈసీ ప్రకటిస్తూ వస్తున్నది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం గతంలో ఎన్నడూ కూడా ఒక శాతాన్ని మించిన అనుభవాలు లేవు. ఈసారి మాత్రం ఏడు దశల పోలింగ్‌లోనూ అసాధారణ పెరుగుదల నమోదైంది. కనిష్ఠంగా 3.2 శాతం నుంచి గరిష్ఠంగా 6.32 శాతం వరకు పెరుగుదల ఈ ఏడు దశల్లో కనిపించింది.

గరిష్ఠంగా నాలుగో దశ పోలింగ్‌లో 6.32 శాతం పెరుగుదల నమోదైంది. ఈ దశలోనే పోలింగ్ జరుపుకున్న ఆంధ్రప్రదేశ్‌లో 12.54 శాతం, ఒడిశాలో 12.48 శాతం పెరుగుదల కనిపించడంపై వీఎఫ్‌డీ విస్మయం వ్యక్తం చేసింది. మన చెవుల్లో పెద్దపెద్ద తామర పువ్వులుంటే తప్ప ఈసీ చేసిన ఈ దారుణమైన ఓటింగ్ పెంపును నమ్మడం కష్టం. పోలింగ్ ముగిసిన నాలుగు రోజుల తర్వాత, తుది పోలింగ్ శాతాన్ని ప్రకటించడం మరింత విభ్రాంతిని కలిగించే విషయం. ఇంత అసాధారణ స్థాయిలో పోలింగ్ శాతాల పెరుగుదలపై వచ్చిన సందేహాలకు ఇప్పటివరకు ఎన్నికల సంఘం సరైన వివరణ ఇవ్వలేదనే సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి.

ఈవీఎమ్‌ల ట్యాంపరింగ్ జరిగితేనో, లేక పోలింగ్ జరిగిన ఈవీఎమ్‌ల బదులు కౌంటింగ్‌లో కొత్త మిషన్లు వచ్చి చేరితేనో తప్ప ఈ అసాధారణ పెరుగుదల సాధ్యంకాదని వీఎఫ్‌డీ అభిప్రాయపడింది. కనుక ఈ పెరిగిన ఓట్లను బోగస్ ఓట్లుగా అది పరిగణించింది. ఈవీఎమ్‌లలో ఏదో ఇంద్రజాలం జరిగిందన దానికి మరో దృష్టాంతాన్ని కూడా వీఎఫ్‌డీ నిర్ధారించింది. తుది ప్రకటన చేసిన పోలైన ఓట్లకూ, కౌంట్ చేసిన ఓట్లకూ మధ్య భారీ వ్యత్యాసాలు కనిపించాయి. కొన్నిచోట్ల కౌంట్ చేసిన ఓట్లు పెరిగాయి. మరికొన్ని చోట్ల తగ్గాయి. ఇదెలా సాధ్యమవుతుంది? ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 3,500 నుంచి 6,500 వరకు ఓట్లు కౌంటింగ్ సమయానికల్లా తగ్గిపోయాయి. ఇటువంటి నియోజకవర్గాలు దేశవ్యాప్తంగా 174 ఉన్నాయని వీఎఫ్‌డీ తెలియజేసింది.

వీఎఫ్‌డీ సంస్థ బోగస్‌గా పరిగణించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో ఎన్డీఏ గెలిచిన సీట్లను వాస్తవానికి ప్రతిపక్షాలు గెలవాల్సిన సీట్లుగా వర్గీకరించారు. రాష్ట్రాలవారీగా పెరిగిన బోగస్ ఓట్ల మొత్తాన్ని ఆ రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాలకు సమానంగా విభజించిన అనంతరం ఆ సంఖ్య కంటే తక్కువ తేడాతో ఓడిపోయిన సమీప ప్రత్యర్థిని అసలైన విజేతగా వీఎఫ్‌డీ లెక్క కట్టింది. ఈ లెక్కన 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి ఓడిపోవాల్సింది.
వీఎఫ్‌డీ గణిత సమీకరణం ప్రకారం ఒడిశాలో బీజేడీ, ఆంధ్రలో వైసీపీ అధికారంలోకి వచ్చి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం పోలైన ఓట్లలో 49 లక్షల పైచిలుకు ఓట్లను బోగస్‌గా ఆ సంస్థ పరిగణించింది. ఆ ఓట్లను మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల మధ్య సమంగా పంచితే ఇరవై ఎనిమిదవేలవుతుంది. అంతకంటే తక్కువ తేడాతో వైసీపీ ఓడిపోయిన నియోజకవర్గాల సంఖ్య 77. గెలిచిన 11 వీటికి జత చేస్తే మొత్తం 88. అంటే సింపుల్ మెజారిటీ.

వీఎఫ్‌డీ సంస్థ బోగస్‌గా పరిగణించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో ఎన్డీఏ గెలిచిన సీట్లను వాస్తవానికి ప్రతిపక్షాలు గెలవాల్సిన సీట్లుగా వర్గీకరించారు. రాష్ట్రాలవారీగా పెరిగిన బోగస్ ఓట్ల మొత్తాన్ని ఆ రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాలకు సమానంగా విభజించిన అనంతరం ఆ సంఖ్య కంటే తక్కువ తేడాతో ఓడిపోయిన సమీప ప్రత్యర్థిని అసలైన విజేతగా వీఎఫ్‌డీ లెక్కకట్టింది. ఈ లెక్కన 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి ఓడిపోవాల్సింది.

వీఎఫ్‌డీ గణిత సమీకరణం ప్రకారం ఒడిశాలో బీజేడీ, ఆంధ్రలో వైసీపీ అధికారంలోకి వచ్చి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం పోలైన ఓట్లలో 49 లక్షల పైచిలుకు ఓట్లను బోగస్‌గా ఆ సంస్థ పరిగణించింది. ఆ ఓట్లను మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల మధ్య సమంగా పంచితే ఇరవై ఎనిమిదవేలవుతుంది. అంతకంటే తక్కువ తేడాతో వైసీపీ ఓడిపోయిన నియోజకవర్గాల సంఖ్య 77. గెలిచిన 11 వీటికి జత చేస్తే మొత్తం 88. అంటే సింపుల్ మెజారిటీ.

వీఎఫ్‌డీ సంస్థ ఆషామాషీగా బోగస్ ఓట్ల సంఖ్యను నిర్ధారించలేదు. అనుమానించడానికి హేతుబద్ధమైన అనేక ఉదంతాలను అది ఉదహరించింది. షెడ్యూల్ ప్రకటనకు కొద్దిరోజుల ముందే అరుణ్ గోయల్ అనే కమిషనర్ ఎందుకు తప్పుకున్నారని ప్రశ్నించింది. షెడ్యూల్ ప్రకటనకు ఒకరోజు ముందు కమిషనర్లుగా ఇద్దరు అధికారులు చేరారు. వీరిలో ఒక అధికారి పూర్వాశ్రమంలో అమిత్‌షా దగ్గర అధికారిగా పని చేశారనీ, మరొక అధికారి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి వద్ద పనిచేశారని ఆ సంస్థ వెల్లడించింది.

పోలింగ్ ముగిసిన వెంటనే పార్టీ ఏజెంట్లకు ఇవ్వాల్సిన 17–సి ఫామ్‌లను ఎంతమంది ఏజెంట్లకు ఇచ్చారో తెలపగలరా అని ఆ సంస్థ సవాల్ చేసింది. ఈవీఎమ్‌ల వారీగా ఫామ్ 17–సీలలో నమోదు చేసిన ఓటింగ్ వివరాలు కౌంటింగ్‌లో లెక్కించిన ఓట్లతో సరిపోల్చడానికి ఒక స్వతంత్ర అధ్యయనం జరగవలసిన అవసరం ఉన్నదని వీఎఫ్‌డీ అభిప్రాయపడింది.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు ఈ బోగస్ ఓట్ల బాగోతం ఒక భాగం మాత్రమే. తొలి అంకం వేరే ఉన్నది. కూటమి నేతలు – యెల్లో మీడియా సంయుక్తంగా సాగించిన విష ప్రచారం, కూటమి ఇచ్చిన మోసపూరితమైన హామీలు ఈ భాగం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఏపీలో కూటమి చేసింది దుష్ప్రచారమేనని మొన్నటి యూనియన్ బడ్జెట్‌తో తేలిపోయింది. ఏపీలో ప్రారంభించిన ఈ సంస్కరణ దేశమంతటా జరగాలని కేంద్రం కోరుతున్నది. అందుకోసం రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించింది.

జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, రాష్ట్రం దివాళా తీసిందని, శ్రీలంకలా మారిందని రాసిన రాతలకూ, కూసిన కూతలకూ అంతే లేదు. మొన్న యూనియన్ బడ్జెట్‌కు ముందురోజు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే జగన్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణను కొనియాడటంతో యెల్లో కూటమి ముఖాన కళ్లాపి చల్లినట్టయింది. రాష్ట్రానికి 14 లక్షల కోట్ల అప్పు ఉన్నదని ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో 10 లక్షల కోట్లని గవర్నర్ చేత చెప్పించారు. ఈ కుప్పిగంతులనూ, శ్వేతపత్రాల తప్పుడు తంతులనూ చీల్చి చెండాడుతూ వైసీపీ అధ్యక్షుడు ప్రెస్‌మీట్ పెడితే సమాధానం చెప్పడానికి ఇప్పటిదాకా ఏ యెల్లో మేధావీ ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇసుక మీద నసిగిన వాగుడెంత?... రాజేసిన రాద్ధాంతమెంత? అప్పుడే మరిచిపోతామా? ఇసుక ధరలు అప్పటికంటే ఇప్పుడే ఎక్కువయ్యాయని ఊరూవాడా గగ్గోలు పెడుతున్నది. ఈ పబ్లిక్ టాక్‌ను అడ్రస్ చేయడానికి ఒక్క సర్కారీ సిపాయి కూడా ఇంతవరకు సాహసించలేదు. లిక్కర్ పాలసీ మీద వెళ్లగక్కిన ప్రచారం సంగతి సరేసరి. ఇప్పటివరకైతే అదే పాలసీ కొనసాగుతున్నది. దీన్నే కొనసాగిస్తారో, లేదంటే బెత్తెడు దూరానికో బెల్టు షాపు సుగంధాలు వెదజల్లిన తమ పాతకాలపు పాత పాలసీకి వెళ్తారో వేచి చూడాలి.

జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, రాష్ట్రం దివాళా తీసిందని, శ్రీలంకలా మారిందని రాసిన రాతలకూ, కూసిన కూతలకూ అంతే లేదు. మొన్న యూనియన్ బడ్జెట్‌కు ముందురోజు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే జగన్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణను కొనియాడటంతో యెల్లో కూటమి ముఖాన కళ్లాపి చల్లినట్టయింది. రాష్ట్రానికి 14 లక్షల కోట్ల అప్పు ఉన్నదని ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో 10 లక్షల కోట్లని గవర్నర్ చేత చెప్పించారు. ఈ కుప్పిగంతులనూ, శ్వేతపత్రాల తప్పుడు తంతులనూ చీల్చి చెండాడుతూ వైసీపీ అధ్యక్షుడు ప్రెస్‌మీట్ పెడితే సమాధానం చెప్పడానికి ఏ యెల్లో మేధావీ ముందుకు రాకపోవడం గమనార్హం.
ఇసుక మీద నసిగిన వాగుడెంత?... రాజేసిన రాద్ధాంతమెంత? అప్పుడే మరిచిపోతామా? ఇసుక ధరలు అప్పటికంటే ఇప్పుడే ఎక్కువయ్యాయని ఊరూవాడా గగ్గోలు పెడుతున్నది. ఈ పబ్లిక్ టాక్‌ను అడ్రస్ చేయడానికి ఒక్క సర్కారీ సిపాయి కూడా ఇంతవరకు సాహసించలేదు. లిక్కర్ పాలసీ మీద వెళ్లగక్కిన ప్రచారం సంగతి సరేసరి. ఇప్పటివరకైతే అదే పాలసీ కొనసాగుతున్నది. దీన్నే కొనసాగిస్తారో, లేదంటే బెత్తెడు దూరానికో బెల్టు షాపు సుగంధాలు వెదజల్లిన తమ పాతకాలపు పాత పాలసీకి వెళ్తారో వేచి చూడాలి.

విషప్రచారాల ప్రస్తావనలోకి వెళ్తే దానికి అంతూదరీ ఉండదు. ఇక మోసపూరిత హామీల సంగతి మరో మహేంద్రజాల అధ్యాయం. ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు సూపర్ సిక్స్ పేరుతో ఒక షట్సూత్ర వాగ్దాన మాలను ఓటర్ల మెడలో వేశారు. యువకులందరికీ నెలకు 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. బడికెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి 15 వేల రూపాయలిస్తామన్నారు. ప్రతి రైతుకూ ఏటా 20 వేల ఆర్థిక సాయమన్నారు. 19 నుంచి 59 సంవత్సరాల మధ్యనున్న ప్రతి మహిళకు నెలకు 1500 అందజేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితమన్నారు. ప్రతి మహిళకూ ఉచిత బస్సు ప్రయాణమని నమ్మబలికారు.

ఇప్పటివరకు ఇందులో ఒక్కటి కూడా ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియదు. ఇది షట్సూత్ర హామీ కాదు షడయంత్ర ప్రయోగమని తేలడానికి ఎంతోకాలం పట్టలేదు. సాక్షాత్తూ శాసనసభలోనే స్వయంగా ముఖ్యమంత్రే ‘సూపర్ సిక్స్’ తూచ్ అని ప్రకటించారు. పైగా ఇది సాధ్యంకాదనే విషయాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలని కూడా ఎమ్మెల్యేలను కోరారు. విష ప్రచారంతో, తప్పుడు హామీలతో ఓట్లడగడం కూడా ఓట్లను దొంగిలించడం కిందే లెక్క. వంచన కిందే లెక్క. రెండు రకాలుగా చోరీ చేసిన ఓట్లతోనే గద్దెనెక్కారు కనుక వారికి ప్రజల పట్ల బాధ్యత లేదనే విషయాన్ని వారే నిరూపించుకుంటున్నారు.

బాధ్యతల నుంచి తప్పుకోవడానికీ, హామీల అమలు కోసం జనం వీధుల్లోకి రాకుండా ఉండటానికే రెడ్‌బుక్ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. శాసనసభలో విపక్ష నేతపై సభానాయకుడు వాడుతున్న భాష, వేస్తున్న నిందలు చాలా దిగజారిన స్థాయిలో ఉంటున్నాయి. హామీలు అమలుచేయపోతే ఎక్కడ తిరుగుబాటు వస్తుందోనన్న భయం ఆయన్ను వెంటాడుతున్నట్టు కనిపిస్తున్నది. ‘ఒక్క వేలు చూపి ఒరులను నిందించ వెక్కిరించు నిన్ను మూడు వేళ్లు’ అనే తెలుగు నానుడిని ఆయన గుర్తు చేసుకుంటే మేలు.

చంద్రబాబుకు కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామగారు ఎన్టీ రామారావు ఆయన గురించి ఏమన్నారో గుర్తు చేసుకుందామా? ‘‘చంద్రబాబు దుర్మార్గుడు... మేకవన్నె పులి, గాడ్సేనే మించినవాడు, అభినవ ఔరంగజేబు, అతడో మిడత. మూర్తీభవించిన పదవీకాంక్షాపరుడు, ప్రజాస్వామ్య హంతకుడు, కుట్రకు కొలువైనవాడు, గూడుపుఠాణీకే గురువు, మోసానికి మూలస్తంభం, గుండెల్లో చిచ్చుపెట్టినవాడు, గొడ్డుకన్నా హీనం, చీమల పుట్టలో పాములా చేరినవాడు... తమ్ముళ్లారా! చెల్లెళ్లారా! ఇదిగో మీ అన్నగా చెబుతున్నాను.’’ ఇవన్నీ ఎన్టీఆర్ డైలాగులే. ఆన్ రికార్డ్!

vardhelli1959@gmail.com

పీడిత ప్రజల విముక్తి కోసం...

కమ్యూనిస్టు విప్లవోద్యమ అగ్రనాయకుల్లో ఒకరైన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి రహస్యజీవితం గడుపుతూ 1976 జూలై 28న అనారోగ్యంతో అమరులయ్యారు. భారత విప్లవ రాజకీయ రంగంలో 35 ఏళ్లకు పైగా వెలుగొంది ‘టీఎన్’గా సుపరిచితులై పీడిత ప్రజల హృదయాలలో ఆయన శాశ్వత స్థానం సంపాదించారు.

కా॥ తరిమెల నాగిరెడ్డి 1917 ఫిబ్రవరి 11న అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో పుట్టారు. తాను భూస్వామ్య కుటుంబంలో జన్మించినా దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ దోపిడీ వ్యవస్థను భూస్థాపితం చేయటానికి, దోపిడీ పీడనలులేని సమ సమాజస్థాపనకు తన సర్వస్వాన్ని అర్పించి దేశ వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందారు.

విద్యార్థి దశలోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. బెనారసు విశ్వ విద్యాలయం విద్యార్థి సంఘానికి అధ్యక్షునిగా 1939లో ఎన్నికైన తొలి ఆంధ్రుడు ఈయనే. బెనారసు విశ్వవిద్యాలయంలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. లా చదువుకు స్వస్తిచెప్పి ఎం.ఏ. పట్టాతో విశ్వవిద్యాలయాన్ని వదలగానే యువకులను ఉద్యమాల్లోకి సమీకరించే కృషిని ప్రారంభించారు. కార్మికులు, రైతాంగం కొరకు ఉద్యమించారు. 1940లో ‘యుద్ధం దాని ఆర్థిక ప్రభావం’ అన్న చిన్న పుస్తకాన్ని ప్రచురించి నందుకు 23 ఏండ్ల యువకునిగా ఉన్నప్పుడే బ్రిటిష్ ప్రభుత్వం విధించిన ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షను అనుభవించారు.

తన కంచుకంఠంతో పండిత పామరులను ఉర్రూతలూగించి కమ్యూనిస్టు విప్లవ రాజకీయాలను దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటులో ఆయన ఉపన్యాసాలను అధికార, ప్రతిపక్ష సభ్యులు ఆసక్తితో, శ్రద్ధతో వినేవారు.



నేడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతి

భారత విప్లవోద్యమ రంగంలో కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)తో కలిసి మన దేశ పీడిత ప్రజల విముక్తికి అవసరమైన సరైన విప్లవపంథాను రూపకల్పన చేయడంలో, ఈ విప్లవ పంథాను దేశమంతటా ప్రచారంచేసి వ్యాపింపచేయటంలో టీఎన్ చారిత్రాత్మకమైన పాత్ర నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆయన పాలకుల తీవ్రనిర్బంధానికి గురయ్యారు. అరెస్టులు, జైలు శిక్షలు, అజ్ఞాతవాసాలకు వెరువలేదు. ఆయన పైనా, మరో 60మందిపైనా పెట్టిన కుట్రకేసు విచారణ సందర్భంగా జైలులో ఉన్నప్పుడు (1970–72) ఆయన భారత ఆర్థిక వ్యవస్థపై ‘తాకట్టులో భారత దేశం’ అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. దానిని కోర్టులో ఒక ప్రకటన రూపంలో చదివారు. సరైన మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషణతో ఆ పుస్తకంలో ఆయన చేసిన నిర్ధారణలు నేటికీ అక్షరసత్యాలే. అవి కమ్యూనిస్టు విప్లవకారులకు, ప్రజాతంత్రశక్తులకూ భావి కార్యాచరణకు మార్గదర్శక సూత్రాలుగా పనిచేస్తాయి.

1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తన బావ సంజీవరెడ్డిని ఓడించి అనంతపురం శాసనసభ్యునిగా తొలిసారిగా ఎన్నికయ్యారు. 35 ఏళ్ళ వయస్సులోనే మద్రాసు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగా తన రాజకీయ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారు. 1969 మార్చిలో తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామాచేసి అసెంబ్లీలో సంచలనాత్మకమైన ఉపన్యాసాన్ని ఇచ్చారు. పాలకవర్గాలు దేశాన్ని విదేశీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడ్తూ వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విధానాలను, భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను అనుసరిస్తున్నారని అన్నారు. దేశాభివృద్ధికంటే రక్షణ చర్యలకే ప్రాధాన్యతనిస్తూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని నివారించే చర్యలను అసెంబ్లీ, పార్లమెంటు చేపట్టకుండా ఈ సంక్షోభ తీవ్రతను మరింతగా పెంచే ప్రజావ్యతిరేక విధానాలను అవి అవలంబిస్తున్నాయని చెప్తూ ‘‘జనాల్ని కదిలిస్తే తప్ప పాలకుల దోపిడీ, దౌర్జన్యాలు అంతం’’ కావని వ్యాఖ్యానించారు.

1975లో డీవీతో కలిసి యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) ను స్థాపించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తన జీవితకాలమంతటా అత్యున్నత విప్లవ ప్రమాణాలను పాటించారు. ఆయన స్మృతి నిరంతరం ప్రజలను విప్లవ కర్తవ్యోన్ముఖులను చేస్తూనే వుంటుంది.

సి. భాస్కర్ । యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)

ధర్మం దేవుని రూపం!

పూర్వం ఒక ముని ఉండేవారు. ఆయన అన్నింటినీ త్యజించిన వారు. తాను పరమజ్ఞాని అని అనుకునేవారు. ఒంటి పూటే భోజనం. అదీనూ చప్పిడి ఆహారమే. అబద్ధాలంటే అస్సలు గిట్టదు. అంతే కాదు, అబద్ధం చెప్పే వారింట అన్నం మెతుకు ముట్టరు. ఒకరోజు ఆయన ఒక ఊరుకు వెళ్ళారు. ఆ ఊళ్ళో నిజాయితీపరుడెవరని వాకబు చేశారు. అప్పుడు కొందరు ఓ బంగళా చూపిస్తూ... ఆ ఇంటి యజమాని ఎంతో నిజాయితీపరుడనీ, ధనవంతుడనీ, ఆయనకు నలుగురు పిల్లలనీ వివరాలు చెప్పారు. ముని ఆ ఇంటికి వెళ్లారు. యజమాని సాష్టాంగ నమస్కారం చేసి ఆతిథ్యం స్వీకరించవలసిందిగా కోరాడు. ఆయన అణకువ, మాటల తీరు నచ్చిన ముని ఆతిథ్యం స్వీకరించడానికి ఒప్పుకున్నారు. అయితే అతడి నిజాయితీని పరీక్షించాలనుకున్నారు. ‘నీ దగ్గర ఎంత డబ్బుంద’ని అడిగారు. అందుకు యజమాని తన దగ్గర ఇరవై రెండు వేల వరహాలు ఉన్నాయన్నాడు. పిల్లలు ఎంత మంది అన్న ప్రశ్నకు ఒక్కడే కొడుకన్నాడు. వయస్సు ఎంత అన్న ప్రశ్నకు ‘నాలుగు సంవత్సరాల అయిదు నెలల ఏడు రోజుల పదకొండు గంటల’న్నాడు. అతని మాటలన్నీ విన్న మునికి కోపం వచ్చింది. ‘నువ్వు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు. కనుక నీ ఇంట ఆతిథ్యం స్వీకరిస్తే నా దీక్ష భగ్నమవుతంద’న్నారు. ఆ గృహస్థు ‘స్వామీ నాకు అబద్ధం చెప్పడం రాదు, నేను చెప్పినవన్నీ ముమ్మాటికీ నిజం’ అంటూ తన జమాపద్దుల పుస్తకాన్ని చూపించాడు. ఆ పుస్తకం ప్రకారం ఆయన వద్ద మిగిలి ఉన్నవి లక్ష వరహాలు. అది చూసిన ముని, ‘మరి నువ్వు ఇరవై రెండు వేల వరహాలు ఉన్నాయన్నావుగా, అంటే నువ్వు చెప్పింది అబద్ధమేగా’అని ప్రశ్నించారు. అప్పుడు గృహస్థు ‘స్వామీ, లక్ష వరహాలు ఉన్నా నేను ధర్మం చేసినవి ఇరవై రెండు వేలే. అది భగవంతునికి నేను అర్పించిన నైవేద్యం. అదే నా నిజమైన డబ్బు’ అన్నాడు.

అందుకు ముని ఆశ్చర్యంతో ‘నీకు నలుగురు పిల్లలని విన్నానే ’అన్నారు. ‘నాకు నలుగురు కొడుకులు. కానీ వారిలో ఒక్కడే నేనేం చెప్పినా స్పందిస్తాడు. కనుక ఆ ఒక్కడే నా కొడుకు. మిగిలిన ముగ్గురూ ఈ భూమికి భారమే’ అన్నాడు. మరి వయస్సు సంగతేమిటీ అని అడిగారు ముని. ‘స్వామీ, నేను ఒక రోజుకి గంటన్నర మాత్రమే దైవప్రార్థన చేస్తున్నాను. మిగిలిన సమయమంతా ఈ శరీరం కోసం శ్రమిస్తున్నాను. అంటే భగవంతుడికి వెచ్చిస్తున్న సమయమే నా వయస్సు’ అన్నాడు. అతని ప్రతి సమాధానంలోనూ దైవ స్ఫూరక నిజాయితీ ద్యోతకమవ్వడంతో సంతృప్తి చెందిన ముని ఆ ఇంట ఆతిథ్యం స్వీకరించారు. గృహస్థు మాటల అంతరార్థాన్ని గ్రహించలేని తాను జ్ఞానిని ఎలా అవుతాననే ఎరుక ఆయనలో అంకురించింది.

– యామిజాల జగదీశ్

సోషల్ మీడియా, మార్కెట్ మేనియా



ప్రపంచ వ్యాప్తంగా 500 కోట్ల మంది ఖాతాదారులు

భారత్‌లో 42 కోట్లకుపైగా వినియోగదారులు

- రోజుకు ఒక్కొక్కరు రెండున్నర గంటల పాటు కాలక్షేపం
- మొదటి రెండు స్థానాల్లో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్
- ప్రకటనల మార్కెట్ విలువ రూ.10 వేల కోట్లు
- ఫోర్బ్స్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రస్తుత స్మార్ట్ ఫోన్ల యుగంలో ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది. ఇక భారత్‌లో అయితే సోషల్ మీడియా మేనియా అన్ని దేశాలకన్నా ముందుంది. ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగంలో భారత్ మొదటిస్థానంలో ఉండగా.. రానున్న రోజుల్లో ఇది మరింత ఉధృతమవుతుందని ఫోర్బ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో సెల్ ఫోన్ వినియోగదారులు రోజుకు సగటున రెండున్నర గంటల పాటు సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. ఇక పెద్ద పెద్ద వ్యాపార సంస్థల నుంచి చిన్న స్థాయి సంస్థల వరకూ ప్రకటనల ద్వారా తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి సోషల్ మీడియానే ఆశ్రయిస్తున్నారు.



ఇన్‌ఫ్లుయన్సర్స్ హవా..

ఈ సోషల్ మీడియా యుగంలో ఇన్‌ఫ్లుయన్సర్స్ హవా కొనసాగుతోంది. కనీసం 10లక్షల మంది ఫాలోయర్లు ఉండే ఇన్‌ఫ్లుయర్స్‌లకు డిమాండ్ భారీగా ఉంటోంది. వారికి భారీ పారితోషికాన్ని చెల్లించేందుకు పారిశ్రామిక సంస్థలు, రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉంటున్నాయి. యూట్యూబ్‌లో 10 లక్షల వ్యూస్ వచ్చే వీడియోకు రూ. 3 లక్షలు చొప్పున చెల్లిస్తున్నారు.

విస్తృతమవుతున్న ప్రకటనల మార్కెట్

- 2024 మార్చి నాటికి సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనల మార్కెట్: రూ. 10 వేల కోట్లు.
- 2027 నాటికి సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనల మార్కెట్ (అంచనా): రూ. 14 వేల కోట్లు.
- ఏదో ఒక బ్రాండు, బ్రాండ్ అంబాసిడర్‌ను అనుసరిస్తున్న సోషల్ మీడియా ఖాతాదారులు: 90 శాతం
- ప్రకటనను చూసిన వెంటనే కొనుగోలు చేస్తున్న వారు: 11 శాతం
- ప్రకటనలు చూసి అవే ఉత్పత్తులను బయట స్టోర్స్‌లో కొనుగోలు చేస్తున్న వారు: 21 శాతం
- దేశంలో సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనలపై ఆధారపడుతున్న పెద్ద, మధ్య తరహా వ్యాపార సంస్థలు: 77 శాతం
- సోషల్ మీడియాలో చూసిన వాటిలో కనీసం ఏదో ఒక ఉత్పత్తిని కొనుగోలు చేస్తున్న ఖాతాదారులు: 76 శాతం
- ప్రకటన చూశాక ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నవారు: 44 శాతం

ఫోర్బ్స్ నివేదికలో ప్రధాన అంశాలు ఇవీ..

- ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 500 కోట్ల మంది సోషల్ మీడియా ఖాతాదారులు ఉన్నారు. 2027 నాటికి ఈ సంఖ్య 585 కోట్లకు చేరుతుందని అంచనా.
- సోషల్ మీడియా ఖాతాదారుల్లో అత్యధికంగా భారత్‌లో 42 కోట్ల మంది ఉన్నారు. దేశ జనాభాలో ఇది 40 శాతం సోషల్ మీడియా ఖాతాదారులు కావడం గమనార్హం. ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నవారిలో 67 శాతం మంది సగటున కనీసం ఒక సోషల్ మీడియా మాధ్యమాన్ని వాడుతున్నారు.
- భారత్‌లో రోజుకు సగటున 150 నిమిషాల పాటు అంటే రెండున్నర గంటల పాటు సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తున్నారు. ఈ ప్రకారం 73 ఏళ్లు జీవించే పౌరుడు తన జీవితకాలంలో 5.7 ఏళ్ల పాటు సోషల్ మీడియాలో కాలక్షేపం చేసినట్టు అవుతుందని ఫోర్బ్స్ సంస్థ అంచనా వేసింది.
- దేశంలోని ఖాతాదారుల్లో 78 శాతం మంది తమ మొబైల్ ఫోన్ ద్వారానే సోషల్ మీడియాను వీక్షిస్తున్నారు.
- భారత్‌లో సోషల్ మీడియా వేదికల్లో మొదటి స్థానంలో ఫేస్‌బుక్, రెండో స్థానంలో ఇన్‌స్టాగ్రామ్ ఉన్నాయి. 18 ఏళ్లు దాటిన సోషల్ మీడియా ఖాతాదారుల్లో 74 శాతం మంది ఫేస్‌బుక్, 71 శాతం మంది ఇన్‌స్టాగ్రామ్ మాధ్యమాన్ని అనుసరిస్తున్నారు. కాగా 49 శాతం మంది ఎక్స్‌ను ఫాలో అవుతున్నారు. ఫేస్‌బుక్ మరికొన్నేళ్లపాటు తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందని అంచనా వేశారు.



ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుడిని దర్శించుకున్నారు. బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. - ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/అమరావతి

ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వర శర్మ కన్నుమూత



మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వర శర్మ (80) శనివారం తెల్లవారుజామున విజయవాడ అయోధ్యనగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయన సంస్కృతాంధ్ర సాహిత్యం, సంగీత జ్యోతిష్యాది శాస్త్రాల్లో నిష్ణాతులు. తన ప్రవచనాలతో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ఈయనకు భార్య, నలుగురు పిల్లలు. కుమారుడు అమెరికాలో ఉంటున్నారు. ఆయన వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కామేశ్వర శర్మ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శనివారం శర్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

విద్యా సంక్షేమ పథకాలకు పేర్లు మార్పు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అమలు చేసిన విద్యా సంక్షేమ పథకాలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేర్లు మార్చింది. ఈ మేరకు శనివారం విద్యా శాఖ మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. జగనన్న అమ్మఒడిని తల్లికి వందనంగా, జగనన్న విద్యా కానుకకి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా, జగనన్న గోరుముద్దకి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా, మనబడి నాడు-నేడుకి మనబడి-మన భవిష్యత్తుగా, స్వేచ్ఛకి బాలికా రక్షగా, జగనన్న ఆణిముత్యాలుకి అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారంగా పేర్లు మార్చారు.

క్లుప్తంగా...

సౌకర్యవంతం, స్నేహపూర్వకంగా సేవలు

టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి



తిరుమల: తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. శ్రీవారి ఆలయంలో శనివారం టీటీడీ ఏఈవోగా ఆయన బాధ్యతలు స్వీకరించి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితుల ఆశీర్వాదం పొందారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ అందిస్తోన్న సేవలను మరింత సౌకర్యవంతంగా, స్నేహపూర్వకంగా అందిస్తామని చెప్పారు. టీటీడీలోని అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయ సేకరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అంతకుముందు ఆయన తిరుమల క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీ భూ వరాహస్వామిని దర్శించుకున్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.25 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు గల్లా గుంజయ్య, ప్రమీలారాణి దంపతులు శనివారం రూ.25 లక్షల విరాళాన్ని అందజేశారు. దాతల పేరిట ఈ మొత్తాన్ని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అన్నదానం విభాగం బ్యాంక్ ఖాతాలో ఆన్‌లైన్‌లో శనివారం జమ చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు. దీనిపై వచ్చే వడ్డీతో భక్తులకు రోజూ అన్నదానం చేస్తామన్నారు.

కూర్మావతార విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు సిటీ: నెల్లూరుజిల్లా వేదగిరిపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో నరసింహకొండపై ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన కూర్మావతార విగ్రహాన్ని అసాంఘిక శక్తులు శుక్రవారం రాత్రి పగులగొట్టారు. ఘటనా స్థలాన్ని బీజేపీ రూరల్ అధ్యక్షుడు సురేష్‌తో కలిసి బీజేపీ నేత మిడతల రమేష్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారులు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. నరసింహ కొండపై ఇటీవల అసాంఘిక శక్తుల ఆగడాలు మితిమీరాయన్నారు. కూర్మావతార విగ్రహం ధ్వంసంపై సమగ్ర విచారణ జరిపి దోషులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గోగుల శ్రీనివాస్, చిత్తాపూర్ కామేశ్వరరావు రాజారెడ్డి పాల్గొన్నారు.

నింగిలోకి బెలూన్ శాటిలైట్

ఎంబీయూలో ప్రయోగం

- లాంచ్ చేసిన మోహన్‌బాబు, ఇస్రో శాస్త్రవేత్తలు
- వాతావరణంపై పలు పరిశోధనలు



బెలూన్ శాటిలైట్‌ను శాస్త్రవేత్తలతో కలిసి లాంచ్ చేస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): వాతావరణంలోని మార్పులు, పీడనతో పాటు మరికొన్ని విశేషాలను తెలుసుకునేందుకు మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) విద్యార్థులు, ఎస్ఏఆర్ఎల్, ఐఐఎస్‌టీ సహకారంతో రూపొందించిన బెలూన్ శాటిలైట్ శనివారం నింగిలోకి ఎగిరింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాన్సలర్ మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణులతో పాటు ఇస్రో చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వీర ముత్తువేల్, డాక్టర్ కల్పన కాళహస్తి, ఓషన్ శాట్-3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ తెన్మొయి శెల్వి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణతో పాటు ఎస్ఏఆర్ఎల్, ఐఐఎస్‌టీ శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఉదయం 11.15 గంటలకు విద్యార్థులు రూపొందించిన ఎంబీయూ శాట్-1ను మోహన్‌బాబుతో పాటు శాస్త్రవేత్తలు లాంచ్ చేశారు. ఎస్ఏఆర్ఎల్‌తో భాగస్వామ్యం ద్వారా రూ.1.5 లక్షల తక్కువ ఖర్చుతో విజయవంతంగా నిర్వహించిన ఈ బెలూన్ శాటిలైట్ ఇతర విశ్వవిద్యాలయాలకు ప్రామాణికంగా మారుతుందని విద్యార్థులు చెప్పారు. సుమారు 5 కేజీల బరువుతో 35 కి.మీ. ఎత్తులో 200 కిలోమీటర్ల వరకూ ఈ శాటిలైట్ ప్రయాణిస్తుందని చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా ఒక యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన శాటిలైట్ విజయవంతం కావడం సంతోషకరమని యూనివర్సిటీ చాన్సలర్ మోహన్‌బాబు చెప్పారు.

ఇస్రో పరిశోధనల్లో భాగస్వాములు కావాలి : డాక్టర్ వీరముత్తువేల్

మోహన్‌బాబు యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్తులో ఇస్రో నిర్వహించే పరిశోధనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వీర ముత్తువేల్ అన్నారు. ప్రయోగం మొదటి దశలోనే విజయవంతం కావడంపై ఆయన విద్యార్థులను అభినందించారు.



నింగిలోకి బెలూన్ శాటిలైట్

తుప్పల్లో పసికందు మృతదేహం



విశాఖ నగరం మధురవాడ సమీపంలోని మారికవలస శివారు తుప్పల్లో ఓ నెలలు నిండని పసికందు మృతదేహం.. చూపరులను కదిలించి వేసింది. శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో స్థానికులు గమనించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పీఎంపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కొద్ది సేపటి తర్వాత పోలీస్ క్లూస్ టీం సిబ్బంది, వైద్య సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఏ ఆస్పత్రిలోనైనా పసిబిడ్డ మిస్ అయిందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు. - మధురవాడ (విశాఖ)

ఏటీఎంల డబ్బుతో పరారైన యువకుడి అరెస్ట్

- గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు
- రూ.2.20 కోట్లు స్వాధీనం



వివరాలు తెలుపుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏటీఎంలలో నింపాల్సిన నగదుతో పరారైన యువకుడిని తూర్పు గోదావరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.2,20,50,000 స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం చుట్టుపక్కల హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలలో నిత్యం నగదు నింపేందుకు హిటాచీ సంస్థతో ఒప్పందం ఉంది. ఆ సంస్థకు సంబంధించిన వ్యాన్ ద్వారా సెక్యూరిటీ సిబ్బందితో కలసి, ఐదుగురు ఉద్యోగులు ప్రతి రోజూ దానవాయిపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ మెయిన్ బ్రాంచి నుంచి నగదు తీసుకుని వెళ్లి ఏటీఎంలలో నింపుతారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచరమెట్ట గ్రామానికి చెందిన వాసంశెట్టి అశోక్‌కుమార్ హిటాచీ సంస్థలో పనిచేస్తున్నారు. ఆయన శుక్రవారం ఉదయం దానవాయిపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోకి వెళ్లి రూ.2,20,50,000 తీసుకున్నాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ఆ సొమ్మును బ్యాంకు ఆవరణలోనే సర్దుతున్నట్లుగా నటించి.. కారులో నగదుతో ఉడాయించాడు. అతడు పరారైన విషయాన్ని కొంతసేపటి తర్వాత గుర్తించిన ఏటీఎం నిర్వాహక సిబ్బంది అశోక్‌కుమార్‌కు ఫోన్ చేశారు. అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసును వేగంగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జిల్లాలోని రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామం వద్ద ఏపీ 40 ఏటీ 5120 స్విఫ్ట్ డిజైర్ కారులో పరారవుతున్న అశోక్‌కుమార్‌ను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చక్రద్వారబంధం ప్రాంతంలో అద్దెకు తీసుకున్న అపార్ట్‌మెంట్‌లో రూ.2,20,50,000 స్వాధీనం చేసుకున్నారు.

తల్లి చెంతకు పిల్లలు



కిడ్నాప్‌నకు గురైన పిల్లల్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): పెందుర్తిలో పిల్లలు కిడ్నాప్ అయిన కేసు సుఖాంతమైంది. కిడ్నాపర్‌ను ఉత్తరప్రదేశ్ మీర్‌పూర్‌లో అరెస్టు చేసిన పోలీసులు ఇద్దరు పిల్లలను తల్లి వద్దకు చేర్చారు. ఆ వివరాలను ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి విలేకరులకు వివరించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కాలికట్ ప్రాంతానికి చెందిన మినతి ప్రధాన్ పెందుర్తి సమీపంలోని నరవలో ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటూ షీలానగర్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తోంది. గతంలో కొన్నాళ్లు మినతి విజయవాడలో ఉంది. అక్కడ వాసుదేవ్ జెల్లితో పరిచయం ఏర్పడింది. ఇటీవల వాసుదేవ్ జెల్లి పెందుర్తి వచ్చి మినతిని కలిసి ఆమె చెల్లెల్ని ఇచ్చి వివాహం చేయాలని కోరాడు. ఇందుకు ఆమె నిరాకరించింది. దీంతో ఆమె పిల్లలైన 10 ఏళ్ల బాలిక, 8 ఏళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి ఈనెల 18న ఉత్తరప్రదేశ్‌కు తీసుకెళ్లిపోయాడు. అయితే వాసుదేవ్‌పై మినతి కాలికట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును పెందుర్తి పోలీసులకు బదిలీ చేశారు. ఇక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. టెక్నాలజీ సాయంతో వాసుదేవ్ ఉత్తరప్రదేశ్‌లోని మీర్‌పూర్ ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకొని పెందుర్తి ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ అక్కడకు వెళ్లింది. డీసీపీ జోన్-2 తుహిన్ సిన్హా రెండు రాష్ట్రాల పోలీస్ అధికారులతో మాట్లాడి నిందితుడిని పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశారు. మీర్‌పూర్‌లో వాసుదేవ్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. అక్కడి కోర్టులో ప్రవేశ పెట్టి శనివారం విశాఖ తీసుకొచ్చారు. పిల్లలను తల్లికి అప్పగించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ సింహాచలం, పెందుర్తి సీఐలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

'కొణతాల' వారి కబ్జా కథ..

అనకాపల్లిలో కనకమహాలక్ష్మి ఆలయ భూముల దురాక్రమణకు మళ్లీ యత్నం

జేసీబీతో చదునుకు యత్నించిన జనసేన ఎమ్మెల్యే కొణతాల కుటుంబీకులు



ఆలయ భూమిని చదును చేస్తున్న జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వర్గీయులు

సాక్షి, అనకాపల్లి: దాదాపు రెండు నెలలుగా రాష్ట్రంలో చెలరేగిపోతున్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతల బరితెగింపునకు ఈ ఘటన మరో ఉదాహరణ. ఎంతో ఉన్నతాశయంతో ఆరేడు దశాబ్దాల క్రితం దేవదాయ శాఖకు రాసిచ్చిన భూములపై కూటమి గద్దలు ఎప్పట్నుంచో కన్నేశాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చీరాగానే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడీ కబ్జా బాగోతాన్ని నడిపిస్తోంది అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కుటుంబీకులు. ఈ భూదాహం కథాకమామిషు ఏమిటంటే..

అనకాపల్లి పట్టణంలోని సర్వే నెంబరు 66లో 29.71 ఎకరాల భూమి (పూల్‌బాగ్ భూములు)ని చెముడు ఎస్టేట్ మహారాణి వైరిచర్ల చంద్రముఖి పట్టా మహాదేవి దేవదాయ శాఖకు 1957 జూలై 20న రిజిస్ట్రేషన్ చేసి మరీ అప్పగించారు. తన తదనంతరం దేవదాయ శాఖకు భూమిని అప్పగించాలని.. అప్పటివరకు ట్రస్టీలుగా తన పెద్ద అల్లుడు రాజాబీర్ ఉదిత్ ప్రతాప్ శంకర్ డియో, డాక్టర్ పేర్రాజు, న్యాయవాది రామచంద్రరావులను నియమించారు. ఆమె మరణానంతరం భూములను తమకు అప్పగించాలని ట్రస్టీని దేవదాయ శాఖాధికారులు 1963లో కోరారు. దీనిపై ట్రస్టీ కోర్టును ఆశ్రయించింది. 1996లో దేవదాయ శాఖకే అనుకూలంగా కోర్టు తీర్పువచ్చింది. ఆ తర్వాత చోటుచేసుకున్న వివిధ పరిణామాల తర్వాత దేవదాయ శాఖాధికారులు భూములను స్వాధీనం చేసుకుని భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటుచేశారు. వాటి రక్షణకు సెక్యూరిటీని కూడా నియమించారు.

దేవస్థానం బోర్డులు పీకేసి..

నిజానికి.. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కుటుంబ సభ్యులు అనకాపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామాలయానికి చెందిన ఈ భూములను హస్తగతం చేసుకోవడానికి ఎప్పటినుంచో కన్నేశారు. అందులో భాగంగా.. కోర్టు ఇంటెరిం ఆర్డర్ పేరిట 29.71 ఎకరాల ఈ భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవడానికి అక్కడున్న దేవస్థానం బోర్డుల్ని 2022 నవంబర్ 27నే పీకేశారు. వాటి స్థానంలో ఆ భూములు తమవేనని, న్యాయస్థానం తీర్పు ఇచ్చిందంటూ కొణతాల రామకృష్ణ సోదరుడి మావయ్య అయిన బీవీఏఎస్ నాయుడు పేరిట బోర్డులు వెలిశాయి. దీంతో వీరిపై అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి దేవదాయ శాఖ ఏసీపీ శిరీష ఫిర్యాదు చేయగా బోర్డులు పీకేసిన ఆరుగురిపై సీఐ దాడి మోహన్ కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో.. శనివారం ఆ భూమిని మళ్లీ ఆక్రమించేందుకు కొణతాల రామకృష్ణ సోదరుడు రఘుబాబు భార్య రజనీ, ఆయన బావమరిది బొడ్డేటి శ్రీనివాసరావు అనుచరులు సిద్ధమయ్యారు. జేసీబీతో ఆ భూములను చదును చేసేందుకు యత్నించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ఏఈవో రాంబాబు, దేవదాయ ఏఈ కె.సూర్యనారాయణమూర్తి, సిబ్బంది, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ నాయకులు శ్రీరామ్, శ్రీనివాస్ అడ్డుకున్నారు. దీంతో వారు వెనుదిరిగారు. పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర వహించారు.

కోర్టులో కేసు నడుస్తుండగానే మళ్లీ కోర్టుకు

ఈ వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే.. ఆ భూమిలో కొణతాల రామకృష్ణ, ఆయన సోదరులు రైతులతో సాగు చేయించడం ప్రారంభించారు. తద్వారా మొత్తం 30 మంది రైతుల నుంచి రూ.10వేల చొప్పున కౌలు వసూలుచేస్తున్నారు. అంతేకాక.. ఇవి తమ భూములేనంటూ వివిధ ఆక్రమణదారుల పేరుతో మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో.. హఠాత్తుగా శనివారం మరోసారి దేవదాయ శాఖ బోర్డుల్ని తొలగించి వాటి స్థానంలో బీవీఏఎస్ నాయుడు పేరిట బోర్డులు పెట్టారు. దీంతో ఆలయ బోర్డు చైర్మన్‌తో పాటు బోర్డు సభ్యులు నాయుడు పేరిట ఉన్న బోర్డులు తొలగించారు. నాయుడుతో పాటు మరికొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.


శనివారం ఢిల్లీలో నీతి ఆయోగ్ 9వ భేటీలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ.

'వికసిత భారత్' సాకారంలో...
రాష్ట్రాలదే కీలక పాత్ర: మోదీ

న్యూఢిల్లీ: 2047 కల్లా వికసిత భారత్ కలను సాకారం చేసుకోవడంలో రాష్ట్రాలది ప్రధాన పాత్ర అని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ''పేదరిక నిర్మూలనే మన లక్ష్యం కావాలి. గ్రామం మొదలుకుని రాష్ట్రస్థాయి దాకా ఆ దిశగా కార్యాచరణ ఉండాలి. ఇందుకు ప్రతి జిల్లా, రాష్ట్రం 2047కు విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకోవాలి. జిల్లా, బ్లాక్, గ్రామ స్థాయి దాకా వికసిత్ భారత్ ఆకాంక్ష చేరాలి'' అని సూచించారు. నీతి ఆయోగ్ పాలక మండలి 9వ భేటీ శనివారం జరిగింది. కేంద్ర మంత్రులతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్లు తదితరులు పాల్గొన్నారు. భేటీకి సారథ్యం వహించిన మోదీ మాట్లాడుతూ దేశాభివృద్ధే లక్ష్యంగా పాలనలో కేంద్ర, రాష్ట్రాలు కలిసి సాగాలని అభిలషించారు. ''ఇది సాంకేతిక మార్పుల దశాబ్ది. ఎదిగేందుకు అపారమైన అవకాశాలున్నాయి. వాటిని రాష్ట్రాలు అందిపుచ్చుకోవాలి. పెట్టుబడులను ఆకర్షించాలంటే శాంతిభద్రతలు, సుపరిపాలన, మౌలిక సదుపాయాలు చాలా కీలకం. జల వనరుల సమర్థ వినియోగానికి రివర్ గ్రిడ్లు ఏర్పాటు చేసుకోవాలి'' అని సూచించారు. ముఖ్యమంత్రులు తమ అవసరాలు, ప్రాథమ్యాలను వివరించారు. పేదరిక నిర్మూలన (జీరో పావర్టీ) లక్ష్యాలను సాధించిన గ్రామాలను పేదరికరహిత గ్రామాలుగా ప్రకటిస్తామని నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మీడియాకు వెల్లడించారు. భేటీలో చర్చించిన విషయాలపై 45 రోజుల్లో 'విజన్ ఇండియా 2047' డాక్యుమెంట్‌ను సిద్ధం చేస్తామని తెలిపారు.

ఘోరంగా అవమానించారు

మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారు: మమత



- నీతి ఆయోగ్ భేటీ నుంచి వాకౌట్
- పని చేసేది మేం, పెత్తనం మీదా?
- కేంద్రంపై బెంగాల్ సీఎం మండిపాటు
- నీతి ఆయోగ్ భేటీలకు రాబోనని ప్రకటన
- ఖండించిన కేంద్రం.. విపక్షాల సంఘీభావం
- హెడ్‌లైన్లలో నిలిచేందుకే వాకౌట్: బీజేపీ
- నితీశ్ గైర్హాజరు, సర్వత్రా అనుమానాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా/పట్నా: నీతి ఆయోగ్ సమావేశం రాజకీయ దుమారానికి కారణంగా మారింది. శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన ఈ భేటీలో తనకు ఘోర అవమానం జరిగిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మండిపడ్డారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ భేటీ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఢిల్లీలో, ఆ తర్వాత కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. ఇతర సీఎంలకు 10 నుంచి 20 నిమిషాలు సమయమిచ్చి తనకు మాత్రం 5 నిమిషాలకే మైక్ కట్ చేశారని ఆరోపించారు. ''కేంద్రంపై పెద్దగా ఆశలు లేకపోయినా సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయాలనే సదుద్దేశంతో భేటీకి వచ్చా. విపక్ష పాలిత రాష్ట్రాల నుంచి హాజరైన ఏకైక సీఎంను నేనే. ఆంధ్రప్రదేశ్ సీఎంకు 20 నిమిషాలిచ్చారు. గోవా, అసోం, ఛత్తీస్‌గఢ్ తదితర సీఎంలకు కూడా 10 నుంచి 12 నిమిషాల దాకా ఇచ్చారు. నన్ను మాత్రం ఐదు నిమిషాల కంటే మాట్లాడనివ్వలేదు. పైగా ఆ ఐదు నిమిషాల్లోనూ పదేపదే బెల్లు కొడుతూ దారుణంగా అవమానించారు. భేటీని పర్యవేక్షించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పదేపదే బెల్లు కొట్టారు. పక్కనే కూర్చున్న మోదీ, కేంద్ర హోం మంత్రి సూచన మేరకే ఆయనలా చేశారు. దీనికి నిరసనగా వాకౌట్ చేశా'' అని వివరించారు. ఇకపై నీతి ఆయోగ్ భేటీలకు ఎప్పటికీ హాజరు కాబోనని ప్రకటించారు.

మైక్ కట్ చేయలేదు: నిర్మల

మమత ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. ఆమెకు కేటాయించిన సమయం మేరకు పూర్తిగా మాట్లాడారని పేర్కొంది. ''నిజానికి అక్షరక్రమంలో మమత లంచ్ అనంతరం మాట్లాడాల్సింది. కానీ ఆమె అర్జెంటుగా కోల్‌కతా తిరిగి వెళ్లాల్సి ఉందన్న బెంగాల్ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు అంతకుముందే ఏడో వక్తగా అవకాశమిచ్చాం. మమతకు కేటాయించిన సమయం పూర్తయిందని కేవలం అందరి ముందూ ఉన్న స్క్రీన్లపై కన్పించింది. అంతే తప్ప టైం అయిపోయిందంటూ ఎవరూ బెల్ కూడా మోగించలేదు'' అని వివరణ ఇచ్చింది. మమత పూర్తి సమయం మేరకు మాట్లాడారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ''మధ్యలో మైక్ కట్ చేయడం నిజం కాదు. ఎవరెంతసేపు మాట్లాడుతున్నదీ మా ముందున్న స్క్రీన్లపై కనిపిస్తూనే ఉంది. కొందరు సీఎంలు కేటాయించిన సమయం కన్నా ఎక్కువగా మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు అదనపు సమయం కేటాయించాం. అంతే తప్ప ఎవరికీ, ముఖ్యంగా బెంగాల్ సీఎంకు మైకు కట్ చేయలేదు'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కేంద్రానిది రాజకీయ వివక్ష

విపక్ష పాలిత రాష్ట్రాల పట్ల కేంద్రం దారుణమైన రాజకీయ వివక్ష కనబరుస్తోందని మమత ఆరోపించారు. ''ఈ వివక్ష కేంద్ర బడ్జెట్‌లో కూడా కొట్టొచ్చినట్టు కన్పించింది. ఈ వైనాన్ని భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలోనే లేవనెత్తా. వారికి కొన్ని రాష్ట్రాల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉంటే ఉండొచ్చు. వాటికి ఎక్కువ నిధులు కేటాయించడంపైనా నాకు అభ్యంతరం లేదు. కానీ బెంగాల్ తదితర రాష్ట్రాలపై మాత్రం ఎందుకిలా వివక్ష చూపుతున్నారని ప్రశ్నించా. దీనిపై సమీక్ష జరగాలని డిమాండ్ చేశా. అన్ని రాష్ట్రాల తరఫునా భేటీలో మాట్లాడా'' అని తెలిపారు. ''నీతి ఆయోగ్‌కు ఎలాంటి ఆర్థిక అధికారాలూ లేవు. దానికి అధికారాలన్నా ఇవ్వాలి. లేదంటే ప్రణాళిక సంఘాన్నే పునరుద్ధరించాలి'' అని డిమాండ్ చేశారు. ''ఉపాధి హామీ వంటి పలు కీలక కేంద్ర పథకాల అమలును బెంగాల్లో మూడేళ్లుగా నిలిపేయడాన్ని భేటీలో ప్రస్తావించా. స్వపక్షం, విపక్షాల మధ్య కేంద్రం ఇలా వివక్ష చూపుతుంటే దేశం ఎలా నడుస్తుంది? అధికారంలో ఉన్నప్పుడు అందరి మేలూ పట్టించుకోవాలి'' అన్నారు.

అధికార, విపక్షాల పరస్పర విమర్శలు

కాంగ్రెస్‌తో పాటు పలు విపక్షాలు మమతకు సంఘీభావం ప్రకటించాయి. విపక్ష నేత అ న్న ఒకే ఒక్క కారణంతో ఏకంగా ముఖ్యమంత్రినే ఇంతగా అవమానించడం దారుణమని మండిపడ్డాయి. దీన్ని ఎంతమాత్రమూ అంగీకరించలేమని కాంగ్రెస్ పేర్కొంది. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు స్టాలిన్ (తమిళనాడు) సహా విపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలు **అన్నారు. ఈ ఆరోపణలను బీజేపీ తోసి**పుచ్చింది. కేవలం మీడియాలో పతాక శీర్షికల్లో నిలిచేందుకే ముందుగా నిర్ణయించుకుని మరీ మమత ఇలా వాకౌట్ చేశారని కేంద్ర మంత్రులు అర్జున్‌రాం మేఘ్వాల్, ప్రహ్లాద్ జోషీ తదితరులు విమర్శించారు. బెంగాల్ పీసీసీ చీఫ్ అధీర్ రంజన్ చౌదరి మాత్రం మమత కావాలనే డ్రామా చేశారంటూ కొట్టిపారేయడం విశేషం.

"సహకారాత్మక సమాఖ్య వ్యవస్థ అంటే ఇదేనా? సీఎంతో ప్రవర్తించే తీరిదేనా? మన ప్రజాస్వామ్యంలో విపక్షాలు కూడా అంతర్గత భాగమని కేంద్రంలోని బీజేపీ సర్కారు అర్థం చేసుకోవాలి. శత్రువుల్లా చూడటం ఇకనైనా మానుకుంటే మంచిది"
- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

"మన దేశంలో పతాక శీర్షికలకు ఎక్కడం చాలా తేలిక. ఏకైక నీతి ఆయోగ్ భేటీలో పాల్గొన్న ఏకైక విపక్ష సీఎం నేనే అని ముందుగా చెప్పాలి. బయటికొచ్చి, 'నా మైక్ కట్ చేశారు. అందుకే బాయ్‌కాట్ చేశా' అని చెప్పాలి. ఇక రోజంతా టీవీలు దీన్నే చూపిస్తాయి. పని చేయాల్సిన, చర్చించాల్సిన అవసరం లేదు. ఇదీ దీదీ తీరు!"
- బీజేపీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్



నితీశ్ అసంతృప్తి?

10 మంది సీఎంల గైర్హాజరు

నీతిఆయోగ్ భేటీకి విపక్ష ఇండియా కూటమి సీఎంలతో పాటు పాలక ఎన్డీఏ సంకీర్ణంలో కీలక భాగస్వామి అయిన బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా డుమ్మా కొట్టడం విశేషం. ఆయన బదులు ఉప ముఖ్యమంత్రులు సమర్థ్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హా పాల్గొన్నారు. ఆయన కోరుతున్నట్టుగా బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం ఇటీవలే స్పష్టం చేయడం తెలిసిందే. దీనిపై అసంతృప్తితోనే భేటీకి నితీశ్ దూరంగా ఉన్నట్టు భావిస్తున్నారు. అయితే ఆయన గైర్హాజరుకు పెద్ద ప్రాధాన్యమేమీ లేదని జేడీ(యూ) పేర్కొంది. గతంలో కూడా నితీశ్ పలుమార్లు నీతిఆయోగ్ భేటీకి గైర్హాజరయ్యారని గుర్తు చేసింది. కేంద్ర బడ్జెట్లో విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపారని ఆరోపిస్తూ తెలంగాణ, కర్నాటక తమిళనాడు, కేరళ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, జార్ఖండ్, పాండిచ్చేరి సీఎంలు కూడా భేటీకి దూరంగా ఉన్నారు. ''10 రాష్ట్రాల సీఎంలు భేటీకి రాలేదు. అది ఆయా రాష్ట్రాలకే నష్టం'' అని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం అన్నారు. ''మమత సమయం పూర్తవగానే రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మైక్‌పై తట్టారు. వెంటనే ఆమె మాట్లాడటం ఆపేసి వాకౌట్ చేశారు'' అని ఆయన వివరించారు. బిహార్ అసెంబ్లీ సమావేశాల కారణంగా నితీశ్ రాలేకపోయారన్నారు.

డెమొక్రటిక్ అభ్యర్థిగా కమల

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ

- అభ్యర్థిత్వాన్ని నిర్ధారించే పత్రాలపై సంతకాలు
- వచ్చే నెల 1న హారిస్‌ను తమ నామినీగా ఎన్నుకోనున్న డెమొక్రటిక్ ప్రతినిధులు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పోటీ చేయబోతున్నట్లు దాదాపు తేలిపోయింది. డెమొక్రటిక్ పార్టీ నుంచి తన అభ్యర్థిత్వాన్ని నిర్ధారించే అధికారిక పత్రాలపై ఆమె సంతకాలు చేశారు. తమ అభ్యర్థిగా కమలా హారిస్ పేరును డెమొక్రటిక్ పార్టీ తరఫున అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటివరకు పార్టీలో కమలా హారిస్ మినహా ఇతరులెవరూ అభ్యర్థిత్వం కోసం పోటీపడలేదు. డెమొక్రటిక్ నేషనల్ కమిటీ నిబంధనల ప్రకారం ఆగస్టు 1న పార్టీ ప్రతినిధులు వర్చువల్ సమావేశంలో తమ నామినీని ఎన్నుకోవాల్సి ఉంటుంది. పార్టీలో ఇతరులు పోటీ పడకపోతే కమలా హారిస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం లాంఛనమే. అలాగే ఆగస్టు 7లోగా ఆమె తమ ఉపాధ్యక్ష అభ్యర్థిని(రన్నింగ్ మేట్) ఎంపిక చేసుకోవాల్సి ఉంది. షికాగోలో ఆగస్టు 19 నుంచి 22 వరకు డెమొక్రటిక్ జాతీయ సదస్సు జరుగుతుంది.

నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై విజయం తనదేనని కమలా హారిస్ మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసం పొందడానికి, ప్రతి ఓటునూ సంపాదించడానికి కష్టపడి పని చేస్తానని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రచారం సాగిస్తానని, వారి మద్దతుతో రాబోయే ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధిస్తానని పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్లు జో బైడెన్ గత ఆదివారం ప్రకటించిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్ తెరపైకి వచ్చింది. ఆమె ప్రచారం కూడా ప్రారంభించారు. ఇప్పటికే 40కిపైగా రాష్ట్రాల డెమొక్రటిక్ ప్రతినిధులు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచారు.

ట్రంప్‌కు సమఉజ్జీగా...

న్యూయార్క్ టైమ్స్ పోల్ వెల్లడి

జో బైడెన్ నిష్క్రమణలో అర్ధాంతరంగా అమెరికా అధ్యక్ష రేసులోకి వచ్చినప్పటికీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అనూహ్యంగా పుంజుకుంటున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో సమానంగా కమల ప్రజామోదాన్ని పొందుతున్నారని న్యూయార్క్ టైమ్స్- సియానా కాలేజ్ తాజా పోల్ పేర్కొంది. సర్వేలో పాల్గొన్న అమెరికా ఓటర్లలో 48 శాతం మంది ట్రంప్ వైపు మొగ్గగా, 47 శాతం మంది కమలా హారిస్‌కు మద్దతు తెలిపారు. ఇదే న్యూయార్క్ టైమ్స్ పత్రిక జూలై మొదటివారంలో నిర్వహించిన సర్వేలో బైడెన్‌పై ట్రంప్ ఏకంగా ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు. దీన్ని హారిస్ ఒక పాయింటుకు తగ్గించడం గమనార్హం. రిజిస్టర్డ్ ఓటర్లలో ట్రంప్‌కు 48 శాతం, హారిస్‌కు 46 శాతం మద్దతు లభించింది.

సొంత పార్టీల్లో సమాన మద్దతు

రిపబ్లికన్లలో ట్రంప్‌ను 93 శాతం మంది బలపరుస్తుండగా, కమలా హారిస్‌కు సైతం డెమొక్రాట్లలో 93 శాతం మద్దతు లభించడం విశేషం. శ్వేతజాతియేతర, యువ ఓటర్లలో బైడెన్‌కు పెద్దగా ఆదరణ ఉండేది కాదు. ఇప్పుడు హారిస్‌కు ఈ వర్గాల మద్దతు లభిస్తోందని సర్వే తెలిపింది. లాటిన్ అమెరికా మూలాలున్న ఓటర్లు, 30 ఏళ్ల లోపు ఓటర్లలో హారిస్‌కు 60 శాతం మద్దతు లభించింది.

సరిహద్దుల్లో పాక్ దుశ్చర్య..
తిప్పికొట్టిన బలగాలు

- ఒక పాకిస్తానీ హతం.. మరో ఇద్దరు పరారీ
- ఒక జవాను మృతి, కెప్టెన్ సహా నలుగురికి గాయాలు

న్యూఢిల్లీ/శ్రీశ్రీనగర్: సరిహద్దుల్లో పాకిస్తాన్ బోర్డర్ యాక్షన్ టీం(బ్యాట్) దాడికి చేసిన ప్రయత్నాన్ని భారత బలగాలు తిప్పికొట్టాయి. దాదాపు నాలుగు గంటలపాటు సాగిన ఎదురుకాల్పుల్లో ఒక పాకిస్తానీ యుడు హతం కాగా, మరో ఇద్దరు పీఓకేలోకి పరారయ్యారు. ఈ ఘటనలో ఒక జవాను నేలకొరగ్గా ఆర్మీ కెప్టెన్ సహా నలుగురు గాయపడ్డారు. శనివారం ఉదయం ప్రతికూల వాతావరణాన్ని అనువుగా మలుచుకుని బ్యాట్ సభ్యులు కుప్వారా జిల్లాలోని కామకారి సెక్టార్‌లో ఎల్‌వోసీని దాటి భారత భూభాగంలోకి ప్రవేశించారు. త్రెహిగామ్ సెక్టార్‌లోని కుంకడి ఫార్వర్డ్ పోస్ట్‌పైకి గ్రెనేడ్ విసిరి, కాల్పులకు తెగబడ్డారు. ఆర్మీ బలగాలు దీటుగా స్పందించాయి. రెండు పక్షాల మధ్య దాదాపు నాలుగు గంటలపాటు కాల్పులు కొనసాగాయి. బ్యాట్‌లోని ఒక పాకిస్తానీ హతం కాగా, మరో ఇద్దరు పీవోకేలోకి పలాయనం చిత్తగించారు. ఆర్మీ కెప్టెన్ సహా తీవ్రంగా గాయపడిన ఐదుగురిని వెంటనే శ్రీనగర్‌లో ఆర్మీ బేస్ ఆస్పత్రికి తరలించారు. రైఫిల్ మ్యాన్ మోహిత్ రాథోడ్ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బ్యాట్‌లో సాధారణంగా సుశిక్షితులైన పాక్ ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్‌తోపాటు ఉగ్రవాదులు సభ్యులుగా ఉంటారు. అమానవీయ చర్యలకు పాల్పడుతూ నియంత్రణ రేఖ వెంబడి ప్రశాంతతకు భంగం కలిగించడమే వీరి పని. కాగా, జమ్మూ ప్రాంతంలో ఉగ్ర ఘటనలు పెరిగిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది.

మోదీ కొత్త ప్రభుత్వంలో 14 ఉగ్రదాడులు: ప్రియాంక

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకల దాడులు పెరిగిపోవడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన దాడిలో ఒక జవాను ప్రాణాలు కోల్పోవడం, మరో నలుగురు గాయపడటంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టాక 49 రోజుల్లో కశ్మీర్‌లో జరిగిన 14 ఉగ్రదాడుల్లో 15 సైనికులు అమరుల య్యా రన్నారు. ఉగ్రవాదం పీచమణిచేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.

స్కూలుపై ఇజ్రాయెల్ దాడి..
చిన్నారులు సహా 30 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాపై శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో 30 మంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆయుధ డిపో నడుస్తున్నాయనే అనుమానంతో డెయిర్ అల్ బలాహ్‌లో పాలస్తీనియన్లు తలదాచుకున్న బాలికల పాఠశాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడికి పాల్పడింది. దాంతో పాఠశాల తరగతి గదులన్నీ శిథిలాల దిబ్బగా మారాయి. ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు సహా 30 మంది మృతి చెందగా 100 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. జువైదా పట్టణం సహా సెంట్రల్ గాజాలోని పలు ప్రాంతాలపై శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో నలుగురు చిన్నారులు సహా మరో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది అక్టోబర్ 7న మొదలైన ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా 39,200 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య విభాగం అంటోంది.

వారి కలలు కల్లలేనా!?

- అమెరికాలో 2.50 లక్షల మంది డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ ఆందోళన
- వీరిలో సింహభాగం భారతీయులే..
- వీసా హోదా మార్చుకోకపోతే స్వదేశాలకే..



- ఇండియాలో జన్మించిన ప్రణీత 8 ఏళ్ల వయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చింది. క్లౌడ్ ఇంజనీరింగ్ చదివింది. శాశ్వత నివాస హోదా లేకపోవడంతో 15 ఏళ్లకుపైగా డిపెండెంట్‌గా నివసిస్తోంది. అమెరికాలో ఉండాలంటే తరచుగా వీసాలు మార్చుకోవాల్సి వస్తోంది.
- జెఫ్రీనా 2005లో ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి హెచ్4(డిపెండెంట్) వీసాపై అమెరికా వెళ్లింది. 2010లో ఆమె కుటుంబం గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంది. అదెప్పుడొస్తుందో తెలియదు. జెఫ్రీనాకు 21 ఏళ్లు దాటడంతో ఇండియాకు వెళ్లిపోవాలి.
- రోషన్ పదేళ్ల వయసులో తల్లి, సోదరుడితో కలిసి హెచ్4 వీసాపై అమెరికా వచ్చాడు. 16 ఏళ్లు అక్కడే చదువుకున్నాడు. సెమీకండక్టర్ల తయారీ కంపెనీలో చేరాడు. అమెరికాను తన సొంత దేశంగానే ఇన్నాళ్లూ భావించాడు. కానీ, అక్కడి ప్రభుత్వం అతన్ని గత నెలల్లో ఇండియాకు బలవంతంగా తిరిగి పంపించివేసింది.

ప్రణీత, జెఫ్రీన్, రోషన్ లాంటి పరిస్థితిని అమెరికాలో 2.50 లక్షల మంది ఎదుర్కొంటున్నారు. వీరిలో చాలామంది భారతీయు లే. వీరంతా చిన్నవయసులో తమ కుటుంబ సభ్యులతో కలిసి చట్టబద్ధంగానే అమెరికాకు చేరుకున్నారు. కానీ, అమెరికాలోనే శాశ్వతంగా ఉండే అవకాశం మాత్రం లేదు. వీసాలను మార్చుకోకపోతే 21 ఏళ్లు దాటగానే స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి. వీరిని డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ అని పిలుస్తున్నారు. ఇలాంటి వారికి అమెరికాలో ఉండేందుకు, ఉద్యోగాలు చేసుకొనేందుకు వీలు కల్పించాలని అధికార డెమొక్రటిక్ పార్టీ భావిస్తుండగా, ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ మాత్రం అంగీకరించడం లేదు. బయటకు పంపించాల్సిందేనని పట్టుబడుతోంది. సెనేట్‌లో రెండు సార్లు వ్యతిరేకంగా ఓటు వేసింది.

ఎందుకీ సమస్య?

లాంగ్ టర్మ్ వీసా కలిగి ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి డిపెండెంట్‌గా అమెరికాకు వచ్చినవారు 21 ఏళ్ల వయసు వచ్చేదాకా అమెరికాలో ఉండేందుకు వీలుంది. ఆ తర్వాత వీసా మార్చుకోకపోతే బయటకు వెళ్లిపోవాల్సిందే. తల్లిదండ్రులకు/కుటుంబ సభ్యులకు గ్రీన్‌కార్డు(శాశ్వత నివాస హోదా) లభిస్తే ఎలాంటి ఇబ్బంది లేదు. డిపెండెంట్లు కూడా అమెరికాలో నివసించేందుకు అవకాశం ఉంది. కానీ, గ్రీన్‌కార్డు లభించడానికి ఇప్పుడు 15 ఏళ్లకు పైగా సమయం పడుతోంది. ఈలోగా డిపెండెంట్లకు 21 ఏళ్ల వయసు దాటేస్తోంది. దాంతో వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తోంది.

ప్రతిభావంతులను వదులుకుంటారా?

డిపెండెంట్లను బయటకు పంపించడాన్ని డెమొక్రటిక్ పార్టీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చట్టాన్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. అమెరికాలో జన్మించకపోయినా ఇక్కడే పెరిగి, పెద్ద చదువులు చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు కూడా చేస్తున్న ప్రతిభావంతులను వదులుకోవడం తెలివైన పని కాదని అంటున్నారు. దేశ అభివృద్ధికి వారి సేవలు అవసరమని చెబుతున్నారు. ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను మరో దేశం కోసం ధారపోయడం ఏమిటని వాదిస్తున్నారు. డాక్యుమెంటెడ్ డ్రీమర్స్‌కు అమెరికాలో నివసించే, ఉద్యోగాలు చేసుకొనేందుకు వీలు కల్పించే బైపార్టిషన్ అమెరికాస్ చిల్డ్రన్స్ యాక్ట్ పెండింగ్‌లో ఉంది. ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చేలోగా తమకు చట్టబద్ధమైన నివాస హోదా కల్పించాలని డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ కోరుతున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

దేశంలో సాధారణ స్థితికి వరిసాగు



సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా విస్తరించిన రుతుపవనాలు, జోరుగా కురుస్తున్న వర్షాలతో వరి సాగు విస్తీర్ణం సాధారణ స్థాయికి చేరుకుంటోందని కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. గతేడాది ఇదే సమయానికి వరి 23.7 మిలియన్ హెక్టార్లలో సాగవగా, ఈ ఏడాది జూలై 27 నాటికి 21.5 మిలియన్ హెక్టార్లలో సాగైందని పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే కాస్త తక్కువే అయినప్పటికీ ఐదేళ్ల సగటుతో పోలిస్తే 2.2 శాతం మేర అధికమేనని తెలిపింది. ఈ ఏడాది మొత్తంగా 40.15 మిలియన్ హెక్టార్లలో వరి సాగు కానుందని అంచనా వేసింది. ఇక వేరుశెనగ, సోయాబీన్, పొద్దు తిరుగుడు వంటి నూనెగింజల సాగు గత ఏడాది కంటే 3.8 శాతం ఎక్కువగా, 17.16 మిలియన్ హెక్టార్లలో సాగయ్యాయని వివరించింది. పప్పుధాన్యాల సాగు సైతం 14 శాతం మేర పెరిగి, 10.2 మిలియన్ హెక్టార్లలో సాగైందని వెల్లడించింది.

నాసా ప్రయోగానికి 'గగన్‌యాన్' వ్యోమగామి

ఐఎస్ఎస్‌కు పంపించనున్న నాసా



న్యూఢిల్లీ: భారత్, అమెరికా ఉమ్మడిగా అంతరిక్ష ప్రయోగాలు చేపట్టే దిశగా ముందడుగు పడింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రయోగంలో పాలుపంచుకొనేందుకు 'గగనయాన్' మిషన్ వ్యోమగామి ఒకరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లనున్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గగన్‌యాన్ ప్రయోగం కోసం నలుగురు వ్యోమగాములు శిక్షణ పొందుతున్న సంగతి తెలిసిందే. వీరిలో ఒకరిని ఐఎస్ఎస్‌కు పంపిచనున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలియజేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది అమెరికాలో పర్యటించారు. ఉమ్మడి అంతరిక్ష ప్రయోగాలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చర్చించారు. ఉమ్మడి స్పేస్ మిషన్లలో భాగంగా 2024లో భారత వ్యోమగామిని ఐఎస్ఎస్‌కు పంపిస్తామని బైడెన్ ఈ సందర్భంగా ప్రకటించారు. మరోవైపు గగన్‌యాన్ మిషన్ కోసం భారత వైమానిక దళం నుంచి ఎంపిక చేసిన నలుగురు వ్యోమగాములకు ప్రస్తుతం బెంగళూరులోని ఇస్రో ఆస్ట్రోనాట్స్ ట్రైనింగ్ కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు.

వచ్చే నెల మోదీ ఉక్రెయిన్ పర్యటన!



న్యూఢిల్లీ: భారత్–ఉక్రెయిన్ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకొనే దిశగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రపంచ దేశాలు కృషి చేస్తున్న నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 23, 24 తేదీల్లో ఉక్రెయిన్‌లో పర్యటించే అవకాశాలున్నాయని దౌత్య వర్గాలు శనివారం వెల్లడించాయి. ప్రతిఏటా ఆగస్టు 24న ఉక్రెయిన్ జాతీయ దినోత్సవం నిర్వహిస్తారు. అదే రోజు మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించి, అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ పర్యటన తర్వాత మోదీ పోలండ్‌కు వెళ్తారని సమాచారం. ఇదే జరిగితే నాలుగు దశాబ్దాల తర్వాత పోలండ్‌లో పర్యటించిన మొదటి భారత ప్రధానిగా మోదీ రికార్డు సృష్టిస్తారు. అయితే, మోదీ ఉక్రెయిన్ పర్యటనపై భారత ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు.

బహిష్కరణకు గురైన వ్యక్తి హోంమంత్రా?

అమిత్ షాపై మండిపడ్డ శరద్‌పవార్



సాక్షి, న్యూఢిల్లీ: 'అవినీతికి కింగ్ పిన్'అంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనపై చేసిన వ్యాఖ్యలపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ తీవ్రంగా మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు అమిత్ షాను గుజరాత్ నుంచి బహిష్కరించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ..అటువంటి వ్యక్తి ఇప్పుడు దేశానికి ముఖ్యమైన హోం శాఖకు మంత్రి అయ్యారంటూ విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఎటు వెళ్తున్నామో ప్రజలు ఆలోచించాలన్నారు. అమిత్ షా దేశాన్ని తప్పుడు మార్గంలో తీసుకెళ్తున్నారని ఆరోపించారు. 2010లో సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో అమిత్ షా రెండేళ్లపాటు గుజరాత్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అయితే, 2014లో ఈ కేసు నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డారు. ఇటీవల పుణేలో జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్ షా.. ప్రతిపక్షాలు తమపై అవినీతి ఆరోపణలు చేస్తున్నాయని, అయితే దేశ రాజకీయాల్లో అతిపెద్ద అవినీతి రారాజు శరద్ పవార్ అంటూ వ్యాఖ్యానించడం తెల్సిందే.

గొప్ప కార్యాలు సాధించేందుకే పుట్టారు!

కేజ్రీవాల్‌పై సునీతా కేజ్రీవాల్



యమునానగర్: అరవింద్ కేజ్రీవాల్‌కు భగవంతుడి అనుగ్రహం ఉందని, గొప్ప కార్యాలను సాధించేందుకే ఆయన పుట్టారని భార్య సునీత కేజ్రీవాల్ అన్నారు. '1968 ఆగస్టు 16న అరవింద్ కేజ్రీవాల్ పుట్టారు. ఆ రోజు కృష్ణ జన్మాష్టమి. ఇది యాధృచ్ఛికం కాదు. ఆయన ద్వారా దేవుడు ఏదో చేయించాలని అనుకుంటున్నాడని భావిస్తున్నా' అని ఆమె పేర్కొన్నారు. మూడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా ఇవ్వొద్దని హరియాణ ప్రజలను కోరారు. శనివారం సునీత హరియాణాలో సదౌరాలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. పాఠశాలలు, ఆసుపత్రుల స్థితిగతులను మార్చడం, మొహల్లా క్లినిక్‌లు, ఉచిత విద్యుత్.. ఇవి ఆప్‌తోనే సాధ్యమన్నారు. హరియాణా పుత్రుడు కేజ్రీవాల్‌తోనే ఇవి సాధ్యమని చెప్పారు. తప్పుడు కేసులో తన భర్తను బీజేపీ జైలుకు పంపిందని ఆరోపించారు. 'మోదీ.. కేజ్రీవాల్‌ను కాదు హరియాణా పుత్రుడిని జైల్లో పెట్టారు. నేను మీ కోడలిని. ఈ అవమానాన్ని మీరు సహిస్తారా? నిశ్శబ్దంగా ఉంటారా? కేజ్రీవాల్ ఒక సింహం. ఆయన మోదీ ముందు మోకరిల్లరు' అని సునీత అన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- లోయలోకి దూసుకెళ్లిన టాటా సుమో
- ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. టాటా సుమో వాహనం లోయలోకి దూసుకెళ్లడంతో ఐదుగురు బాలలు సహా ఒకే కుటుంబానికి చెందిన 8 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు ఉన్నారు. కిష్టవర్ నుంచి తిరిగి వస్తుండగా డాక్సుమ్ ఏరియాలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసు అధికారులు చెప్పారు. వేగంగా దూసుకొచ్చిన టాటా సుమో అదుపు తప్పి లోయలో పడిపోయిందని, 8 మంది అక్కడికక్కడే మృతిచెందారని తెలిపారు. ఈ ఘటనలో వాహనం పూర్తిగా ధ్వంసమైందని అన్నారు.

కోచింగ్ సెంటర్‌లోకి వరదనీరు..
ఇద్దరు విద్యార్థులు మృతి, ఒకరు గల్లంతు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఓ భవనం బేస్‌మెంట్‌లో నిర్వహిస్తున్న యూపీఎస్సీ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ఇద్దరు విద్యార్థులు చనిపోగా మరొకరు గల్లంతయ్యారు. సెంట్రల్ ఢిల్లీ ప్రాంతంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో, ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని ఓ భవనం బేస్‌మెంట్‌లో నడుస్తున్న రావ్ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరద ప్రవేశించింది. దీంతో కొందరు విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. వరదతో బేస్‌మెంట్ పూర్తిగా నిండిపోయినట్లు సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని నీటిని బయటకు తోడారు. సహాయక చర్యల్లో ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభించాయి. గల్లంతైన మరో విద్యార్థి జాడ కోసం గాలిస్తున్నామని అధికారులు తెలిపారు.

పార్కుల్లో గ్రంథాలయాలు

సాక్షి, చెన్నై : చెన్నై కార్పొరేషన్ పరిధిలోని పార్కులలో చిన్న పాటి గ్రంథాలయాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. వివరాలు.. చెన్నై కార్పొరేషన్ నేతృత్వంలో అనేక పార్కులు ఉన్నా, 40 పార్కులు అత్యంత సుందరంగా కనిపిస్తుంటాయి. ఇక్కడికి వాకింగ్‌కు, పిల్లలతో కలిసి సాయంత్రం వేళ వచ్చే స్థానికులు ఎక్కువే. పిల్లలు, పెద్దలలో పఠనాశక్తిని పెంచేందుకు వీలుగా గ్రంథాలయాలను పార్కులలో ఏర్పాటు చేసి అన్ని రకాల పుస్తకాలను కొలువు దీర్చేందుకు నిర్ణయించారు. కొన్ని చోట్ల ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు, మరికొన్ని చోట్ల సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు గ్రంథాలయాలు పనిచేసే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నూరు వాగులో వ్యర్థాలను తొలగించాలి

– గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం

కొరుక్కుపేట: ఎన్నూర్ మార్ష్‌ల్యాండ్‌లో పడేసే వ్యర్థాలను వెంటనే తొలగించాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు.. చెన్నై పక్కనే ఉన్న ఎన్నూర్ మడ అడవులుగా పిలిచే చిత్తడి ప్రాంతం ఉంది. ఇక్కడ అత్తిపట్టు ప్రాంతంలోని మున్సిపాలిటీలో చెత్తను, వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దక్షిణ భారత శాఖలో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటోందని స్థానిక ఫిర్యాదు చేశారు. వ్యర్థాలను అక్కడ వేయడాన్ని నివారించాలి. అలాగే డంప్ చేసిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం వ్యర్థాలను వేయడం వెంటనే నిలిపివేయాలని, రెండు వారాల్లోగా వేసిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించింది. అలాగే తమిళనాడు మెరైన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, తిరువళ్లూరు జిల్లా యంత్రాంగం కూడా దీనిపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది.

12 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం

అన్నానగర్: కడలూరు జిల్లా బన్రుట్టి సమీపంలోని కుంబకోణం- చెన్నై జాతీయ రహదారిపై పుంగునం ప్రాంతంలో బన్రుట్టి ట్రాఫిక్ డివిజన్ పోలీసులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పోలీసులు ప్రయాణిస్తున్న కారును నిలిపి సోదా చేయగా, కారు వెనుక 2 పెద్ద బ్యాగులు ఉన్నాయి. వాటిలో 12 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ రూ.8 కోట్లు ఉంటుందని తెలిపారు. విచారణలో కోయంబత్తూరుకు చెందిన శ్రీధర్, కార్తికేయన్, కృష్ణన్, జాన్ అనే నగల వ్యాపారులని తేలింది. వారి వద్ద ఉన్న పత్రాలపై అనుమానం రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

32 పరోటాలు తింటే డబ్బు ఇవ్వక్కర్లేదు!



వైరల్ అవుతున్న బ్యానర్

అన్నానగర్: వెనిల్లా కబడ్డీ కుళు సినిమా తరహాలో పరోటాలు తినే కాంపిటీషన్ అంటూ ఏర్పాటు చేసిన బ్యానర్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. అలాగే 'మీరు కావాలంటే పందేనికి వస్తారా' అంటూ ఈ విషయం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. నేటి ప్రపంచంలో వ్యాపార పోటీ ఎక్కువగా ఉంది. దీంతో ప్రతి ఒక్కరూ తమ వ్యాపారాభివృద్ధి కోసం కొత్త వ్యూహాలను ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తూత్తుకుడి జిల్లా మింజ్ఞానపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రారంభించిన ఓ పరాటా దుకాణదారుడు ఏర్పాటు చేసిన ఓ ప్రకటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓ బ్యానర్‌లో 32 పరోటా తింటే డబ్బు ఇవ్వకండి. డోర్ డెలివరీ కూడా ఉందంటూ ప్రచురించారు. ప్రస్తుతం ఈ బ్యానర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


కార్తీపై ఈవీకేఎస్ ఫైర్

సాక్షి, చెన్నై: కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంపై ఆపార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ కార్యక్రమంలో కార్తీ చిదంబరం మాట్లాడుతూ, కూటమి బలం, ఒంటరి బలం అంటూ చేసిన వ్యాఖ్యలు డీఎంకే వర్గాలను ఆలోచనలో పడేశాయి. ఒంటరి నినాదంతో కార్తీతోపాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై వ్యాఖ్యలు ఉండడం చర్చకు దారి తీశాయి. తమ కూటమిలో ఉంటూ కాంగ్రెస్ సమావేశాల్లో ఆ పార్టీ నేతలు చేస్తూ వస్తున్న వ్యాఖ్యలను డీఎంకే నిశితంగా పరిశీలిస్తూ వస్తోంది. ఈ పరిస్థితుల్లో కార్తీ చిదంబరం వ్యాఖ్యలను ఈవీకేఎస్ ఖండించారు. శనివారం ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికలకు ముందుగా కార్తీ చిదంబరం ఈ ఒంటరి వ్యాఖ్యలు చేసి ఉంటే బాగుండేదన్నారు. కూటమి బలంలో ఎన్నికలలో గెలిచి, ఇప్పుడు ఒంటరి అంటూ పార్లమెంట్‌లోకి వెళ్లకూర్చోవడం మంచి పద్ధతేనా? అని ప్రశ్నించారు. కూటమిలో చిచ్చుపెట్టే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని నాయకులు మానుకుంటే మంచిదని హితవు పలికారు. కార్తీ చిదంబరం ఒంటరిగా పోటీ చేసి ఉంటే డిపాజిట్ కూడా వచ్చి ఉండేది కాదన్నారు.

వారం రోజుల్లో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

కొరుక్కుపేట: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు వారంలోగా 2 జతల యూనిఫాం అందజేస్తామని మంత్రి గీతాజీవన్ తెలిపారు. తూత్తుకుడి శామ్యూల్‌పురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో సాంఘిక సంక్షేమ శాఖ తరఫున పాఠశాల విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం అందజేసే కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లక్ష్మీపతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గీత విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదేశాల మేరకు తూత్తుకుడి జిల్లాలో 79,654 మంది పాఠశాల మధ్యాహ్న భోజన విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం అందజేయనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా కుట్టు సహకార సంఘంలోని మహిళలు నేరుగా పాఠశాలలకు వెళ్లి యూనిఫా కుడుతున్నట్లు పేర్కొన్నారు.

కదంతొక్కిన డీఎంకే సేనలు



సీఎం స్టాలిన్ వీడియో ప్రసంగం

కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే వర్గాలు శనివారం కదం తొక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రం తీరును ఖండిస్తూ నిరసనలను హోరెత్తించాయి. అన్ని జిల్లాలు, నగరాలు, పట్టణ కేంద్రాలలో పెద్ద ఎత్తున ఆందోళనలతో కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ, విమర్శలు, ఆరోపణలతో నినాదాలు చేశాయి. ఇక నీతి ఆయోగ్ సమావేశంలో తాను చేయాల్సిన ప్రసంగాన్ని ప్రజాక్షేత్రంలో చేస్తున్నట్లు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.



నిరసనలో ప్రసంగిస్తున్న ఎంపీ కనిమొళి



తూత్తుకుడి: నిరసనకు భారీగా తరలివచ్చిన డీఎంకే కార్యకర్తలు

- కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై నిరసనల హోరు
- రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు
- కేంద్రప్రభుత్వం తీరుపై స్టాలిన్ ఫైర్
- ప్రజలకు వీడియో సందేశం

సాక్షి, చెన్నై: ఆర్థిక బడ్జెట్‌లో తమిళనాడుకు కేంద్రం మొండి చేయి చూపించిన విషయం తెలిసిందే. కొత్త పథకాలు లేక పోగా, పాత పథకాలకు, ప్రాజెక్టులకు కనీస స్థాయిలోనూ నిధులు ఇవ్వక పోవడం, వరద సాయం ప్రకటించకపోవడం డీఎంకే పాలకులలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. తమిళనాడుపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ఈనేపథ్యంలో శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే బడ్జెట్‌లో తమిళనాడుకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, కేంద్రం తీరును ఎండగట్టే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు నిలుపు నిచ్చారు.

ప్రజల కోసం సీఎం వీడియో సందేశం

రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే వర్గాల నిరసన నేపథ్యంలో సీఎం స్టాలిన్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తమిళనాడును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని పేర్కొంటూ, ఆ వీడియోలో కేంద్రంపై స్టాలిన్ విరుచుకుపడ్డారు. నీతి ఆయోగ్ సమావేశంలో తాను పాల్గొనాల్సి ఉందని, అయితే కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతుండడంతో అక్కడి వెళ్లకుండా, ప్రజాక్షేత్రంలో మీ ముందు మాట్లాడుతున్నానని వివరించారు. గత మూడేళ్లుగా ద్రావిడ మోడల్ ప్రభుత్వం పాలన, సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులను గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, ప్రతి కుటుంబానికి, ప్రతి పౌరుడికీ నేరుగా దరి చేర్చడమే లక్ష్యంగా ముందుకెళ్తూ వస్తున్నామని, ఇందుకు ప్రజలు లోక్‌సభ ఎన్నికలలో క్లీన్‌స్వీప్‌తో ఘన విజయం అందించారని వ్యాఖ్యానించారు. ఓటు వేసిన, వేయని వారికి కూడా ద్రావిడ మోడల్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని, అయితే వారికి ఓటు వేయలేనదనే ఆగ్రహంతో తమిళనాడు ప్రజలకు కేంద్రంలోని మోదీ సర్కారు తీవ్రమైన ద్రోహాన్ని తలపెట్టిందని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం బీజేపీని ఎన్నికల్లో విస్మరించారని గుర్తుచేస్తూ, ఆ రాష్ట్రాలకుసైతం బడ్జెట్‌లో మొండిచేయి చూపించారని మండిపడ్డారు. రాష్ట్రాలపై, ప్రజలపై ప్రతీకారంతో కేంద్రం రగిలి పోతున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తమిళనాడుపై నిరంతరం దాడులు చేస్తోందని.. ఇకపై ఈ దాడులను సహించబోమని హెచ్చరించారు. తమ కూటమిలోని రాష్ట్రాలకు మాత్రమే నిధుల వరద పారించడం బట్టి చూస్తే, కేవలం తన పదవిని కాపాడుకునే ప్రయత్నాలలో మోదీ నిమగ్నమయ్యారని ఎద్దేవా చేశారు. కేంద్రంపై తమిళనాడు పెంచే స్వరం దేశ ప్రజల గొంతుగా మారబోతోందని, తప్పు మీద తప్పు చేస్తున్న కేంద్రానికి త్వరలో వైఫల్యం తప్పదని హెచ్చరించారు. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ గళాన్ని నొక్కే విధంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

నిరసనల హోరు

డీఎంకే అధిష్టానం పిలుపుతో పార్టీ వర్గాలు శనివారం ఉదయాన్నే నిరసనలను హోరెత్తించాయి. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రుల నేతృత్వంలో జిల్లా, నగర, పట్టణ , మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమిళనాడుపై కేంద్రం చూపుతున్న సవతి తల్లి ప్రేమను, జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించే విధంగా ప్రదర్శనలు చేపట్టారు. చెన్నైలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఎంపీలు దయానిధి మారన్, కళానిధి వీరా స్వామి నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. సైదాపేటలో ఎంపీ తమిళచ్చి తంగపాండియన్ నేతృత్వంలో, తాంబరంలో ఎంపీ టీఆర్‌బాలు నేతృత్వంలో నిరసనలు హోరెత్తాయి. ఎంపీలందరూ తాము ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రాలలో జరిగిన నిరసనలకు నేతృత్వం వహించారు. తూత్తుకుడిలో జరిగిన నిరసనలో కేంద్రంపై ఎంపీ కనిమొళి విరుచుకు పడ్డారు. ఆర్థిక బడ్జెట్ ప్రసంగం సమయంలో తాము పార్లమెంట్‌లో ఉన్నామా లేదా బిహార్, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీల్లో ఉన్నామా? అన్నటుగా పరిస్థితులు కనిపించాయని ధ్వజమెత్తారు. తేనిలో ఎంపీ తంగత మిళ్ సెల్వన్ నేతృత్వంలో నిధులే కాదు, మదురైలో ఎయిమ్స్ కనిపించడం లేదని వ్యంగ్యాస్త్రాలను సంధిస్తూ భారీ నిరసన కార్యక్రమం జరిగింది. డీఎంకే ఎంపీల నియోజకవర్గాలలో నిరనలు పెద్దఎత్తున జరిగాయి. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలో సైతం అనేక చోట్ల నిరసన కార్యక్రమాలు జరిగాయి. తమిళనాడుకు తీవ్ర ద్రోహం, అన్యాయం జరుగుతోందని కేంద్రంపై కాంగ్రెస్ నాయకులు దుమ్మెత్తి పోశారు.



చెన్నైలో నిరసన (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న ఎంపీ తమిళచ్చి తంగపాండియన్

కలాంకు ఘన నివాళి

సాక్షి, చెన్నై: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతి శనివారం నిరాడంబరంగా సాగింది. పేయ్ కరంబులోని కలాం సమాధి వద్ద ఆయన కుటుంబీకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రామనాథపురం జిల్లా అధికారులు నివాళులర్పించారు. వివరాలు.. భారతరత్నగా, మాజీ రాష్ట్రపతిగా, మిస్సైల్ మ్యాన్‌గా, నిరంతరం ఉపాధ్యాయుడిగా ప్రతి యువత, పట్టభద్రుడి మదిలో శాశ్వతంగా గూడు కట్టుకున్న ఏపీజే అబ్దుల్ కలాం 2015 జూలై 27న శాశ్వత నిద్రలోకి వెళ్లిన విషయం తెలిసిందే. భౌతికంగా ఆయన అందర్నీ వీడినా, ఆయన జ్ఞాపకాలు, సందేశాలు చిరస్మరణీయం. తాను పుట్టిన గడ్డ రామేశ్వరంలోని పేయ్ కరంబులో శాశ్వత నిద్రలో ఆ మహనీయుడు ఉన్నారు. శనివారం కలాం 9వ వర్ధంతి కావడంతో ఆ మహనీయుడిని స్మరించుకునే విధంగా సమాధి వద్ద నిరాడంబరంగా కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే కలాం కుటుంబీకులతో పాటు మత పెద్దలు సమాధి వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థన, పాత్యహా నిర్వహించారు. ఆ పరిసరాలలోని విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులు సైతం తరలి వచ్చి అంజలి ఘటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రామనాథపురం జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. స్థానికంగా ఉన్న ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పలువురు పుష్పాంజలి ఘటించారు. స్థానిక యువత, విద్యార్థిలోకం, పర్యటకులు, స్థానిక ప్రజలు సమాధి వద్దకు తరలి వచ్చి కలాం సేవలను గుర్తు చేసుకున్నారు. స్మారక మండపం, ఎగ్జిబిషన్, విజ్ఞాన కేంద్రం పరిసరాలను వీక్షించారు. అలాగే పలుచోట్ల కలాం విగ్రహాలకు, చిత్ర పటాలకు ప్రజాప్రతినిధులు, అభిమానులు నివాళుర్పించారు.



కలాం సమాధి వద్ద కుటుంబ సభ్యుల నివాళులు

'నీతి ఆయోగ్'కు రంగన్న డుమ్మా

– పుదుచ్చేరిలో ఆసక్తికర చర్చ

సాక్షి, చెన్నై: ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సీఎం రంగస్వామి డుమ్మాకొట్టడం చర్చకు దారి తీసింది. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు చేస్తూ వస్తున్న కుట్రలు, వ్యూహాలకు నిరసనగానే ఆయన దూరంగా ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోఉన్న విషయం తెలిసిందే. సీఎంగా ఎన్ఆర్ కాంగ్రెస్ నేత రంగస్వామి వ్యవహరిస్తుండగా, పలు కీలక మంత్రి పదవులకు బీజేపీకి చెందిన వారు ఉన్నారు. అయితే బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు, వీరికి మద్దతుగా ఉన్న స్వతంత్ర ఎమ్మెల్యేలు ప్రస్తుతం రంగస్వామిపై తిరుగుబాటు ధోరణితో ముందుకెళ్తున్నారు. రంగస్వామి సర్కారుకు ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలన్న నినాదాన్ని అందుకున్నారు. తమను పట్టించుకోక పోవడం, తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వక పోవడం వంటి అంశాలను అస్త్రంగా చేసుకుని ఈ తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఢిల్లీ వరకు వెళ్లారు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగినా ఇంకా సమసినట్టు లేదు.



సీఎం రంగస్వామి

అసంతృప్తే కారణమా?

బడ్జెట్‌లో తమిళనాడుతో పాటు పొరుగున ఉన్న పుదుచ్చేరి మీద కూడా సవతి తల్లి ప్రేమనే కేంద్ర పాలకులు చూపించారు. తమ మద్దతుతో కూడిన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పుదుచ్చేరిని పట్టించుకోలేదు. దీంతో సీఎం రంగస్వామి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు ఎన్ఆర్ కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటూ వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో శనివారం జరిగిన నీతి ఆయోగ్ భేటీకి రంగన్న దూరంగా ఉండడం పుదుచ్చేరి రాజకీయాలను రసవత్తరం చేశాయి. తన సర్కారుకు ఓ వైపు బీజేపీ ఎమ్మెల్యేలు ఇబ్బందులు పెడుతున్నా, ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా కేంద్రం మెతక వైఖరి అనుసరిస్తుండడంతోనే ఢిల్లీకి రంగస్వామి వెళ్లలేదన్న చర్చ జోరందుకుంది. అదే సమయంలో మరో రెండు మూడు రోజుల్లో బడ్జెట్ సమావేశాలు పుదుచ్చేరిలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ కసరత్తుల్లో ఉండడంతోనే ఢిల్లీకి రంగన్న వెళ్లలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీలో బడ్జెట్ దాఖలు తదుపరి తమకు కావాల్సిన నిధుల కోసం ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాను కలవబోతున్నట్టుగా పేర్కొంటుండడం గమనార్హం. అయితే, బడ్జెట్‌కు నిరసనగా తమిళనాడుతోపాటు బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు నీతి ఆయోగ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో రంగన్న డుమ్మాకొట్టడం ఆసక్తికరంగా మారింది.

నిండు కుండలుగా.. జలాశయాలు

- మేట్టూరులో 100 అడుగులకు చేరిన నీటిమట్టం
- 51 అడుగులు దాటిన కేఆర్‌పీ
- వంద అడుగుల వైపుగా భవానీ సాగర్

సాక్షి, చెన్నై: డెల్టా అన్నదాతలు ఈ ఏడాది సంబా వరి సాగుపై దృష్టి పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కురువై సాగు గగనమైనా, ప్రస్తుతం జలాశయాలు నిండుకుండలుగా మారడంతో అన్నదాతల ఆనందానికి అవధులు లేవు. డెల్టా అన్నదాతల వర ప్రదాయిణి మేట్టూరు జలాశయం నీటిమట్టం 100 అడుగులను దాటింది. కేఆర్‌పీ రిజర్వాయర్ నీటి మట్టం 51 అడుగులు చేరడంతో మిగులు నీటిని విడుదల చేస్తున్నారు. భవానీ సాగర్ జలాశయం వంద అడుగులకు సమీపిస్తోంది. వివరాలు.. గత ఏడాది నైరుతి రుతు పవనాలు ముఖం చాటేయడంతో డెల్టా అన్నదాతలు ఈ ఏడాది కష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిన విషయం తెలిసిందే. ప్రధానంగా డెల్టా వరప్రదాయిణి మేట్టూరు జలాశయం అడుగంటింది. ఈ నెల మొదటి వారంలో ఈ జలాశయం నీటి మట్టం 40 అడుగుల లోపే ఉండేది. ఉన్న కొద్దిపాటి నీటిని తాగు నీటి అవసరాలకు ఉపయోగిస్తూ వచ్చారు. నీరు లేకపోవడంతో నిర్ణీత జూన్ 12వ తేదీ ఈ జలాశయం గేటు తెరచుకోలేదు. దీంతో డెల్టా అన్నదాతలు కురువై సాగుబడి చేయలేని పరిస్థితి ఏర్పడింది. సంబా వరి సాగుకైనా నీళ్లు దక్కేనా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి సమయంలో నైరుతి రుతు పవనాలు కేరళ, కర్ణాటకలో విస్తారంగా వర్షాలను తీసుకొచ్చాయి. దీంతో కావేరిలో నీటి ఉధృతి పెరిగింది.

డెల్టా రైతుల్లో ఆనందం

ఈనెల మొదటి వారం చివరి నుంచి క్రమంగా కావేరి నదిలోకి నీటి రాక పెరుగుతూ, తగ్గుతూ వచ్చింది. దీంతో మేట్టూరు జలాశయంలో నీటి మట్ట శరవేగంగా పెరుగుతూ వచ్చింది. 15 రోజులలో డ్యాం నీటిమట్టం ఏకంగా 100 అడుగులను దాటింది. శనివారం సాయంత్రానికి 101 అడుగులకు నీటి మట్టం చేరింది. 120 అడుగులతో కూడిన ఈ డ్యాం మరో నాలుగైదు రోజులలో పూర్తిగా నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు కారణం ప్రస్తుతం కావేరి నది ఉగ్రరూపం దాల్చిడమే. ఈ నదిలో సెకనుకు లక్షా 30 వేల క్యూ సెక్కుల నీరు ప్రవహిస్తోంది. దీంతో ధర్మపురి, సేలం జిల్లాలోని కావేరి నదీ పరివాహక ప్రదేశాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. హొగ్నెకల్ వైపుగా ఎవరూ వెళ్లకుండా అన్ని మార్గాలను మూసివేశారు. డ్యాం నీటి మట్టం 100 అడుగులు దాటడంతో మేట్టూరు గేట్ల వద్ద రైతులు కావేరి తల్లికి పూజలు చేశారు. పువ్వులను చల్లి ఆహ్వానించారు. ఈసారి మేట్టూరు నీటితో డెల్టాలో సుమారు 5 లక్షల ఎకరాలలో సంబా వరి సాగు దిశగా రైతులు సన్నద్ధమవుతున్నారు.



కేఆర్‌పీ రిజర్వాయర్



మేట్టూరు డ్యాం వద్ద రైతులు పూజలు

నిండిన కేఆర్‌పీ

ధర్మపురికి పొరుగున ఉన్న కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలో కేఆర్‌పీ రిజర్వాయర్ ఉన్న విషయం తెలిసిందే. 52 అడుగుల నీటి మట్టం కల్గిన ఈ డ్యాం తెన్ పెన్నై నదీ తీరంలో నిర్మించారు. తమిళనాడు – కర్ణాటక సరిహద్దుల్లో కురుస్తున్న వర్షాలతో కాట్టారు నది పరవళ్లు తొక్కుతూ, తెన్ పెన్నైలో కలస్తోంది. దీంతో కేఆర్‌పీ జలాశయంలో నీటి మట్టం శరవేగంగా పెరిగింది. శనివారం 51 అడుగులకు నీటిమట్టం చేయడంతో మిగులు నీటిని విడుదల చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రిజర్వాయర్ నుంచి నీటి విడుదలతో తెన్ పెన్నై నది పరవళ్లు తొక్కుతోంది. కృష్ణగిరి, ధర్మపురి, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు జిల్లా మీదుగా ఈ నది ప్రవహించి సముద్రంలో కలుస్తోంది. నీటి విడుదలతో ఆ తీర వాసుల్ని ఆయా జిల్లాల అధికారులు అప్రమత్తం చేశారు.

భవానీ పరవళ్లు

నీలగిరులలో కురుస్తున్న వర్షాలకు కోయంబత్తూరులోని 100 అడుగుల పిల్లూరు డ్యాం నిండిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి ఉబరి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీరు ఈ రోడ్ భవానీ సాగర్ డ్యాంలోకి వచ్చి చేరుతోంది. మేట్టూరు తదుపరి అతిపెద్ద డ్యాంగా 105 అడుగులతో ఉన్న భవానీ సాగర్ ప్రస్తుతం నిండుకుండా కనిపిస్తోంది. ప్రస్తుతం నీటిమట్టం 90 అడుగులను దాటింది. 20 టీఎంసీల నీళ్లు నిల్వ ఉంది. ఇందులోకి సెకనుకు సమారు 15 వేల క్యూ సెక్కుల నీరు వస్తుండడంతో మరికొద్ది రోజులలో 100 అడుగులను దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ డ్యాం నీటి ఆధారంగా ఈరోడ్, తిరుప్పూర్, కరూర్ జిల్లాలో 2.50 లక్షల ఎకరాలలో సాగుబడికి రైతు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో పశ్చిమ కనులమ వెంబడి ఉన్న తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్యాకుమారిలోని రిజర్వాయర్లు, జలాశయాలు ఇప్పటికే నిండు కుండలుగా మారడంతో అక్కడి నదులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి.



కావేరి పరవళ్లు

రూ. 10,712 కోట్లతో పరందూరుకు 'మెట్రో'

సాక్షి, చెన్నై: పూందమల్లి నుంచి పరందూరుకు మెట్రో రైలు పనుల నివేదిక సిద్ధం అయింది. రూ. 10,712 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించారు. వివరాలు.. చెన్నైలో ప్రస్తుతం పేజ్ -1 పనులు ముగియడంతో రెండు మార్గాల్లో మెట్రో రైలు సేవలకు అమిత స్పందన వస్తున్న విషయం తెలిసిందే. ఫేజ్-2లో మరో మూడు మార్గాల్లో పనులకు కార్యాచరణ సిద్ధం చేశారు. రూ. 63,246 కోట్లతో 118.9 కి.మీ దూరం ఫేజ్- 2 మెట్రో పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయితే ఇందుకు కేంద్రం నిధులను కేటాయించక పోవడం వివాదానికి దారి తీసింది. నిధుల కొరత నేపథ్యంలో మెట్రోను ప్రైవేటు గుప్పెట్లోకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు అనే చర్చ ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో చెన్నై మీనంబాక్కం విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా పరందూరులో మరో విమానాశ్రయం నిర్మాణంపై కేంద్రం దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. పనిలో పనిగా చెన్నై నుంచి 60 కి.మీ దూరంలోని పరందూరుకు సైతం మెట్రో రైలు సేవలను విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం పూందమల్లి వరకు జరుగుతున్న మెట్రో సేవను పరందూరు వరకు విస్తరించేందుకు నిర్ణయించారు. ఈ పనులకు రూ. 10712 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. 43.66 కి.మీ దూరం వంతెన మార్గంలో పనులు చేపట్టనున్నారు. ఈ మార్గంలో 19 రైల్వే స్టేషన్లు, మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు, మాల్స్ తదితర నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సమగ్ర నివేదికలో పొందు పరిచారు. చెన్నై నగరంలో ఒక కి.మీ లేదా 1.5 కి.మీ దూరానికి ఓ మెట్రో రైల్వే స్టేషన్లు ఉన్నాయి. అయితే పూందమల్లి - పరందూరు మార్గంలో కొన్ని చోట్ల రెండు, మరికొన్ని చోట్ల మూడు కి.మీ దూరానికి ఓ రైల్వే స్టేషన్ ఏర్పాటు కానుంది. రైలు అతివేగంగా విమానాశ్రయం వైపుగా దూసుకెళ్లే విధంగా వేగాన్ని పెంచి రైల్వే స్టేషన్ల ఏర్పాటు కార్యాచరణ సిద్ధం చేసి ఉన్నారు.

క్లుప్తంగా

రూ.15 లక్షల మోసం

• యువకుడి అరెస్టు

అన్నానగర్: చెన్నై తిరువిక నగర్ తదుపరి వెట్రి నగర్ ప్రాంతానికి చెందిన విమల (42)వ్యాపారవేత్త. తన సోదరుడితో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో ఎగుమతి, దిగుమతి కంపెనీని నడుపుతోంది. ఈ కంపెనీలో పని చేస్తున్న నెల్లూరుకు చెందిన శ్రీకాంత్ (35) కుటుంబ పరిస్థితిని సాకుగా చూపి విమల నుంచి రూ.7 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. తర్వాత తిరిగి ఇవ్వలేదు. అలాగే విమలకు సొంతమైన ట్రైలర్ లారీలను అద్దెకు పంపడం ద్వారా రూ. 8 లక్షలు వరకు మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరువిక నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నెల్లూరులో ఉన్న శ్రీకాంత్‌ను శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసి చెన్నైకి తీసుకువచ్చి, జైలుకు తరలించారు.

10వ తరగతిలో 3 సార్లు ఫెయిల్

• విద్యార్థిని ఆత్మహత్య...

అన్నానగర్: నీలగిరి జిల్లా కున్నూర్‌కు చెందిన ఉమా మహేశ్వరి (56)కి భర్త చనిపోయాడు. పిల్లలు కూడా లేరు. దీంతో తన బంధువైన 17 ఏళ్ల బాలికను ఉమా మహేశ్వరి వద్ద ఉంటూ చదివిస్తోంది. 10వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థిని 3 సార్లు పరీక్ష రాసినా పాస్ కాలేదు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 24న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని మంటలు అంటించుకుంది. ఇరుగుపొరుగు వారు ఆమెని రక్షించి కోయంబత్తూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం బాలిక మృతి చెందింది. వెల్లింగ్టన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళి చిటీలో నష్టం

• మహిళ ఆత్మహుతి

అన్నానగర్: తిరుమంగళం సమీపంలో శుక్రవారం రాత్రి దీపావళి చీటీలో నష్టం రావడంతో ఓ మహిళ నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. చెన్నైలోని తిరుమంగళం ప్రాంతంలో ఓ మహిళ తలపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని కేకలు వేస్తూ కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు తిరుమంగళం ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సబిల్లా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం మహిళను కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 80 శాతం కాలిన గాయాలతో అక్కడ చికిత్స పొందుతున్న మహిళ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. విచారణలో ఆమె శ్యామల అని తెలిసింది. దీపావళి చీటీలో నష్టం రావడంతో చీటి వేసిన వారికి డబ్బులు ఇవ్వలేక బలవన్మరణానికి పాల్పడినట్లు వెల్లడైంది.

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తథ్యం


నర్సింగ్ విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న భాగ్యరాజ్


పాల్గొన్న విద్యార్థినులు

వేలూరు: పట్టుదలతో ప్రయత్నం చేస్తే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని సీనియర్ నటుడు, డైరెక్టర్ భాగ్యరాజ్ తెలిపారు. వేలూరు సమీపంలోని శ్రీపురం శక్తిఅమ్మ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ నారాయణి నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం, స్నాతికోత్సవ కార్యక్రమం నారాయణి నర్సింగ్ కళాశాల అండ్ ఆసుపత్రి డైరెక్టర్ బాలాజీ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బీఎస్సీ, డిప్లమా, ఎమ్మెస్సీ వంటి డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి ప్రసంగించారు. ప్రస్తుతం డిగ్రీలు సాధించిన విద్యార్థులు వైద్య విభాగంలో పరిశోధనలు చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు. నూతన పరిశోధనలు చేయడం ద్వారా రానున్న తరాల్లో కూడా వచ్చే వ్యాధులకు అవసరమైన మందులను కనుగొనవచ్చాన్నారు. బంగారుగుడి పీఠాధిపతి శక్తిఅమ్మ నిరుపేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఆసుపత్రిని ప్రారంభించి అనంతరం నర్సింగ్ కళాశాలను ప్రారంభించారని ఆయన ప్రయత్నాన్ని విద్యార్థులు నెరవేర్చాలన్నారు. నిరుపేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే నర్సింగ్ విభాగాన్ని ఎంచుకొని ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. డాక్టర్ల కన్నా అధికంగా నర్సులే రోగుల వద్ద ఉంటారని వారి సమస్యలు నర్సులకే ముందుగా తెలుస్తుందన్నారు. ఆ సమయంలో వారి వద్ద ప్రేమగా మాట్లాడం వల్ల సగం రోగం నయమవుతుందన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పథకాలతో పాటు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభ, నారాయణి ఆసుపత్రి మెడికల్ సూపరిడెంట్ తమిల్ అరసి, ట్రస్టీ కలైఅరసన్, ఇతర దేశాలకు చెందిన శక్తిఅమ్మ భక్తులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: మైలాడుదురైలో ఎనిమిదవ తరగతి విద్యార్థిని శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పాఠశాల యాజమాన్యంపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మైలాడుదురై సమీపంలోని సిద్ధర్కాడు భారతి నగర్‌కు చెందిన రామచంద్రన్, రాజలక్ష్మి దంపతుల కుమార్తె రోషిణి రాజాంబాల్(13). మైలాడుదురై సమీపంలోని ప్రైవేట్ సీబీఎస్ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగించుకుని ఇంటికి వచ్చింది. ఇంట్లో తల్లిదండ్రులు ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటి తర్వాత ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కుమార్తె శవంగా వేటాడడంతో మైలాడుదురై పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థిని రోషిణి రాజాంబాల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మైలాడుదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాఠశాలలో నిర్వహించిన ఓ పరీక్షలో రోషిణి రాజాంబాల్ కాపీయింగ్‌కు పాల్పడడంతో ఉపాధ్యాయులు తరగతి బయట నిలబెట్టంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు మైలాడుదురై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5 లక్షల పూల మొక్కల పెంపకమే లక్ష్యం


పూల మొక్కలు నాటుతున్న కలెక్టర్ లక్ష్మీభవ్య తన్నీరు

కొరుక్కుపేట: నీలగిరిలో ప్రధాన పర్యాటక కేంద్రమైన ప్రభుత్వ బొటానికల్ గార్డెన్ (జీబిజీ)లో 5 లక్షల పూల మొక్కలను నాటే కార్యక్రమాన్ని నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తన్నీరు శుక్రవారం ప్రారంభించారు. తదుపరి శరత్ రుతువులో పర్యాటక సీజన్ కోసం రంగు రంగుల మొక్కలను పర్యాటకులు ఆస్వాదించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇంకా మ్యారిగోల్డ్, ఫ్రెంచ్ మ్యారిగోల్డ్, ఆస్టర్, వెర్బెనా, లుపిన్, కాస్మోస్, స్వీట్ విలియం, అజెరాటం, క్రిసాన్తిమం, క్యాలెండులాతో సహా దాదాపు 60 రకాల పూల మొక్కలకు చెందిన పూల మొక్కలు నాటే పనులు మరో రెండు వారాల పాటు కొనసాగుతాయన్నారు. అలాగే ప్రభుత్వ బొటానికల్ గార్డెన్ లోని ఫ్లవర్ షో గ్యాలరీలో ప్రదర్శించడానికి 15,000 పూల కుండలు సిద్ధంగా ఉంచామని, 3 లక్షల మందికి పైగా పర్యాటకులు సందర్శిస్తారని భావిస్తున్నట్లు వెల్లడించారు.

ఒప్పందం


క్రీడాకారులకు ఉచిత వైద్యచికిత్సలు అందించేలా అభినవ్ బింద్రా ఫౌండేషన్, ఎస్ఓఏఆర్ ట్రస్టు, రేలా ఆస్పత్రులు చేతులు కలిపాయి. ఇందుకు సంబంధించిన శనివారం రెలా చైర్మన్ మహ్మద్ రేలా నేతృత్వంలో ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా క్రీడాకారులు, నిర్వాహకులు బ్రోచర్‌ను ప్రదర్శించారు. - సాక్షి, చెన్నై

పొరపాటున చెత్తలో పడేసిన 6 సవర్ల నగలు

• టన్ను చెత్తలో 9 గంటల పాటు వెతుకులాట
• ఎట్టకేలకు నగలను గుర్తించిన పారిశుద్ధ్య కార్మికులు

అన్నానగర్: కోయంబత్తూరు సమీపంలోని పూదూర్‌కు చెందిన శివగామి (47) తన వద్ద ఉన్న 6 సవర్ల బంగారు నగలను కవరులో ఉంచారు. కొద్దిరోజుల క్రితం పొరపాటున చెత్తబుట్టలో పడేశారు. దాన్ని పారిశుద్ధ్య సిబ్బందికి ఇచ్చాడు. ఆ తర్వాత ఇంట్లో వెతికినా నగలు కనిపించలేదు. తర్వాత ఆ నగలను చెత్తబుట్టలో వేశానని భావించి వెంటనే ఆ ప్రాంత కౌన్సిలర్ ఉదయ కుమార్‌కు, పారిశుద్ధ్య కార్యనిర్వహణాధికారి మణికంఠన్, స్వచ్ఛ కార్యకర్తలు రాణి, సత్య, సావిత్రికు సమాచారం అందించారు. దీంతో టన్ను చెత్తను కింద పడేసి నగలను వెతికారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5.30 గంటల వరకు వెతికారు. సుమారు 9.30 గంటల ప్రాంతంలో నగలు ఉన్న కవరును గుర్తించారు. తర్వాత వారు దానిని శివగామికి అప్పగించారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులను పలువురు అభినందించారు.

రైలులో చిక్కుకొని ఎస్ఐ మృతి

తిరువొత్తియూరు: అరకోణం రైల్వేస్టేషన్లో రైలులో చిక్కుకుని స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ మృతి చెందారు. వివరాలు.. రాణిపేట జిల్లా అరకోణం రైల్వే స్టేషన్ 2వ ప్లాట్ ఫారం వద్ద శుక్రవారం రాత్రి ఒకరు రైలులో చిక్కుకొని మృతి చెందినట్లుగా రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతని మృతదేహాన్ని బయటకు తీసి శవ పరీక్ష కోసం అరకోణం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీని గురించి పోలీసులు శనివారం ఉదయం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతి చెందిన వారు అరక్కోణం గాంధీ నగర్‌కు చెందిన రాఘవన్ (52) అని, తిరువళ్లూరు జిల్లా సెవ్వాపేట పోలీస్ స్టేషన్లో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బదిలీపై అరక్కోణం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక ఎస్ఎస్ఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. ఇతను పట్టాలు దాటుతున్న సమయంలో రైలులో చిక్కుకొని మృతి చెందారా లేదా రైలు ముందు పరిగెత్తి ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాఘవన్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘన సత్కారం


గతంలో ఒలింపిక్స్ విజేతలుగా పతకాలు సాధించిన వాసు దేవన్ భాస్కరన్, మునీర్ సైట్, చార్లెస్ కార్నెలియస్, విక్టర్ జాన్ ఫిలిప్స్, కృష్ణమూర్తి పెరుమాళ్‌లను షరాన్ ప్లే సంస్థ సత్కరించింది. శనివారం జరిగిన వేడుకలో వీరికి ఐయామ్ స్ట్రాంగెస్ట్ పేరిట అవార్డులను, ప్రోత్సాహక చెక్కులను మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్, షరాన్ ప్లే వ్యవస్థాపకుడు విష్ణు, చెన్నైలోని స్పెయిన్ కాన్సులేట్ హెడ్ కృష్ణమూర్తి విజయన్ తదితరులు ప్రదానం చేశారు. - సాక్షి, చెన్నై

దెడ్‌పూల్ అండ్ వోల్వరెన్ చిత్రంలో ఓ దృశ్యం



కలెక్షన్లు కొల్లగొడుతున్న డెడ్‌పూల్ అండ్ వోల్వరెన్

తమిళసినిమా: హాలీవుడ్ చిత్రాలకు ఎప్పుడూ విశేష ఆదరణ ఉంటుందన్న విషయాన్ని డెడ్‌పూల్ అండ్ వోల్వరెన్ చిత్రం మరోసారి నిరూపించింది. మార్వెల్ స్టూడియోస్ సంస్థ నుంచి వచ్చిన తాజా యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రం ఇది. ఆంగ్లం, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో ఈనెల 26వ తేదీన తెరపైకి వచ్చిన ఈ చిత్రం అనూహ్య వసూళ్లను సాధిస్తూ సూపర్ హిట్ టాక్‌ను తెచ్చుకుంది. రూ. 1,674 కోట్ల భారీ బడ్జెట్‌లో రూపొందిన ఈ చిత్రం తొలిరోజు నుంచే సూపర్ హిట్ టాక్‌ను తెచ్చుకోవడం సంతోషంగా ఉందని చిత్ర నిర్వాహకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. హ్యూ జాక్‌మెన్ చాలా గ్యాప్ తరువాత నటించిన చిత్రం ఇది. లోగన్ మరణించడంతో అతని మరో వేరియంట్‌ను కనిపెట్టి తన ప్రపంచాన్ని కాపాడటానికి డెడ్‌పూల్ చేసే ప్రయత్నమే ఈ చిత్ర కథ. చిత్రంలో యాక్షన్ సన్నివేశాలతో పాటు, కామెడీ, సెటైరికల్ డైలాగ్స్ విపరీతంగా అలరిస్తున్నాయన్నది ప్రేక్షకుల మాట. ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కోలీవుడ్ టాక్స్

కొట్టుకాళి విడుదల తేదీ ఖరారు


కొట్టుకాళి చిత్రంలో నటి అన్నా బెన్

తమిళసినిమా: హాస్య నటుడిగా రాణించిన సూరి విడుదలై చిత్రంలో కథాయకుడిగా పరిచయం అయ్యి తొలి విజయం సాధించారు. ఆ తరువాత నటించిన గార్డియన్ చిత్రం హీరోగా ఆయన స్థాయిని మరింత పెంచింది. కాగా తాజాగా సూరి కథానాయకుడిగా నటించిన చిత్రం కొట్టుకాళి. నటి అన్నా బెన్ నాయకిగా నటించిన ఈ చిత్రానికి కూళంగల్ చిత్రం ఫేమ్ పీఎస్ వినోద్ దర్శకత్వం వహించారు. కూళంగల్ చిత్రం మాదిరిగానే ఇది కూడా పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడి ప్రశంసలను, అవార్డులను గెలుచుకోవడం విశేషం. అయితే కొట్టుకాళి చిత్రం నేపథ్యం వేరేగా ఉంటుందని, ఇది కూడా గ్రామీణ ప్రజల జీవన విధానాన్ని సహజంగా ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. మరో విశేషం ఏమిటంటే ఇందులో పాటలు గానీ, సంగీతం గానీ ఉండదన్నారు. చిత్రంలో పాత్రలకు తగ్గట్టుగానే నటీనటులను ఎంపిక చేసినట్లు చెప్పారు. నటుడు సూరి పాత్ర కూడా ఆయన గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. కథ, కథనాలు ఆసక్తిగా ఉంటాయన్నారు. కూళంగల్ చిత్రాన్ని ఓటీటీలో విడుదల చేయగా కొట్టుకాళి చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడం సంతోషంగా ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ చిత్ర టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందనను తెచ్చుకుంది. కాగా నటుడు శివకార్తికేయన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. కథానాయకుడిగా వరుస విజయాలతో జోష్‌లో ఉన్న ఈయన ఎస్‌కే.ప్రొడక్షన్స్ పేరుతో చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించిన మంచి కథా చిత్రాలను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అలా తాజాగా చేసిన చిత్రం కొట్టుకాళి . కాగా ఈ చిత్రాన్ని ఆగస్టు 23న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

యాంకర్‌గా ప్రయాణం ప్రారంభించి..!


నటి నయనతార

తమిళసినిమా: బుల్లితెర అంటే కొందరికి ఇప్పటికీ చిన్న చూపే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే కళాకారులుగా సాధించాలనుకునే వారికి ఆరంభంలోనూ, అంతిమంలోనూ చాలా మందికి జీవితాన్నిచ్చేది బుల్లితెరనే అన్నది వాస్తవం. ఇప్పుడు ప్రముఖ హీరోయిన్లుగా రాణిస్తున్న వారిలో చాలా మంది బుల్లితెర నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. ఈ వరుసలో ఇప్పుడు లేడీ సూపర్‌స్టార్‌గా రాణిస్తున్న నయనతార కూడా ఉన్నారన్నది చాలా మందికి తెలియకపోవచ్చు. నయనతార అసలు పేరు డయానా మరియం కురియన్. మధ్యతగతి కుటుంబానికి చెందిన ఈ కేరళకుట్టికి చిన్నతనం నుంచి సినిమాలంటే చాలా ఆసక్తి అట. దీంతో ఆమె బంధువు ఒకరు సినీ రంగంలో పని చేస్తుండడంతో ఆయన ద్వారా తన పొటోలను కొందరు సినీ దర్శక, నిర్మాతలకు చేరాయి. అయితే నటినవ్వాలనే తన కోరికను నెరవేర్చుకోవడానికి బుల్లితెరను మార్గంగా చేసుకున్నారు. అలా టీవీ యాంకర్‌గా తన పయనాన్ని ప్రారంభించి సినిమా వాళ్ల దృష్టిలో పడ్డారు. అలా 2005లో తమిళంలో అయ్యా అనే చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యారు. తొలి చిత్రంలోనే సుప్రీమ్ స్టార్ శరత్‌కుమార్‌కు జంటగా నటించి విజయాన్ని అందుకున్న నయనతార రెండో చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు జంటగా నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకున్నారు. ఆ తరువాత వరుసగా అవకాశాలు తలపుతట్టడంతో కథానాయకిగా 20 ఏళ్ల పాటు లేడీసూపర్‌స్టార్‌గా వెలిగిపోతున్నారు. ఇటీవల ఒక భేటీలో నయనతార పేర్కొంటూ తన జీవిత చక్రం సినీ రంగప్రవేశం చేసిన తరువాత తలకిందులైందన్నారు. ఏదో ఒక రోజు తాను ఈ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకుంటానని కలలో కూడా ఊహించలేదన్నారు. అదే విధంగా తన జీవిత లక్ష్యం గురించి చెబుతూ బీకామ్ పట్టభద్రురాలైన తాను చార్టెడ్ అకౌంటెంట్(సీఏ) అవ్వాలని ఆశ పడ్డానన్నారు. తాను నటి కాకుంటే కచ్చితంగా సీఏ అయ్యి ఉండేదానినని తన బంధువులతో చెబుతుండేదానినని అన్నారు. అయితే నయనతార సీఏ కావాలన్న కోరిక నెరవేరకున్నా ఇప్పుడు లేడీ సూపర్‌స్టార్‌గా రాణిస్తున్నారు. కృషితో నాస్తి దుర్భిక్షం అనడానికి ఇంత కంటే నిదర్శనం ఏముంటుంది.

నిర్మాతల మండలిలో ఐక్యత లేదు


ఎమక్కు తొళిల్ రొమాన్స్ చిత్ర ఆడియోను ఆవిష్కరించిన ఆర్‌కే.సెల్వమణితో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: తమిళ్ సినీ నిర్మాతల మండలి, యాక్టివ్ నిర్మాతల మండలి కార్య వర్గాల్లో ఐక్యత లేదని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి పేర్కొన్నారు. నటుడు అశోక్ సెల్వన్, అవంతిక మిశ్రా జంటగా నటించిన చిత్రం ఎమక్కు తొళిల్ రొమాన్స్. నటి ఊర్వశి, అళగప్పన్ పెరుమాళ్, ఎంఎస్ భాస్కర్, భగవతి పెరుమాళ్, భడవా గోపి తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని బాలాజీ కేశవన్ దర్శకత్వంలో టి.క్రియేషన్స్ పతాకంపై ఎం.తిరుమలై నిర్మించారు. నివాస్ కె.ప్రసన్న సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఉదయం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించారు. కాగా ఈ వేదికపై చిత్ర నిర్మాత ఎం.తిరుమలై, నటుడు అశోక్ సెల్వన్‌పై పలు ఆరోపణలు చేశారు. ఈయన పారితోషికాన్ని పూర్తిగా చెల్లించినా, చిత్రానికి సహకరించలేదని విమర్శించారు. నిర్మాతల డబ్బుతో ఎదిగిన అశోక్ సెల్వన్ నిర్మాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. తన చిత్రం ప్రమోషన్‌కు రాకపోవడం ఎంతవరకు సమంజసమో నిర్మాతల సంఘం కార్యవర్గం ఆలోచించాలన్నారు. నిర్మాతలు లేకుంటే నటీనటులు ఎక్కడ అని? నిర్మాత ఎం.తిరుమలై ప్రశ్నించారు. కాగా ఈ వేడుకలో పాల్గొన్న ఫెఫ్సీ అధ్యక్షుడు, దర్శకుడు ఆర్‌కే సెల్వమణి మాట్లాడుతూ ఈ చిత్రం విషయంలో నిర్మాత ఎం.తిరుమలైకి, నటుడు అశోక్ సెల్వన్‌కు మధ్య ఏమి జరిగిందో తనకు తెలియదు గాని, చిన్న చిత్రాల నిర్మాతలు మాత్రం చాలా నష్టపోతున్నారన్నారు. చిత్రాలు హిట్ అయితే ఎక్కువగా లబ్ధి పొందేది హీరో, హీరోయిన్లేనని, ఆ తరువాత క్యాబ్ నిర్వాహకులు, సాంకేతిక వర్గం లాభపడతారని, నిర్మాతకు మాత్రం ప్రయోజనమే ఉండడం లేదన్నారు. ఈ విషయంలో నిర్మాతల మండలి కార్యవర్గంలో ఐక్యత లేదనే చెబుతానన్నారు. అదే ఉంటే ఇలాంటి ఘటనలు తలెత్తవన్నారు. నిర్వాహకులందరూ కలిసి నిర్మాతలకు లాభం కలిగేలా ఒక పరిష్కారాన్ని చేయాలన్నారు. అందుకు ఫెఫ్సీ నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆర్‌కే సెల్వమణి పేర్కొన్నారు. నిర్మాత ఎం.తిరుమలై నిర్మించిన ఎమక్కు తొళిల్ రొమాన్స్ చిత్రం ట్రైలర్, పాటలు చూస్తుంటే వినోదకరమైన ప్రేమ కథా చిత్రంగా ఉంటుందని తెలుస్తోందన్నారు. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానన్నారు.


నటి కీర్తీసురేశ్

నటుడు విజయ్ చెప్పినట్లు..!

తమిళసినిమా: ప్రస్తుతం పాన్ ఇండియా కథానాయకిగా మారిన నటి కీర్తీసురేశ్. ఎలాంటి పాత్రలోనైనా అవలీలగా నటించి మెప్పింగల నటి ఈ బ్యూటీ. అపజయాలు విజయాలకు సోపానం అంటారు. అది కీర్తిసురేశ్‌కు చాలా బాగా వర్తిస్తుంది. ఈమె తల్లి మేనక అప్పట్లో కథానాయకిగా మంచి పేరు తెచ్చుకున్నారు. తమిళియన్ అయిన ఈమె చిత్రం ఆమెను జాతీయ ఉత్తమ నటి అవార్డును అందించింది. ఇక ఇప్పుడు బాలీవుడ్‌లోనూ రంగ ప్రవేశం చేశారు. దీంతో కీర్తిసురేశ్ స్థాయి పెరగడంతో పాటు, వదంతులు అధికం అవుతున్నాయి. ఈ బ్యూటీ 20 ఏళ్ల వయసున్న ఓ నటుడి ప్రేమలో మునిగి తేలుతున్నట్లు తాజాగా వైరల్ అవుతున్న ప్రచారం. దీనిపై స్పందించిన కీర్తిసురేశ్ నటుడు

మలయాళ సినీ నిర్మాత సురేశ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అలా సినీ కుటుంబం నుంచి వచ్చిన కీర్తిసురేశ్ బాల నటిగానే చిత్ర పరిశ్రమకు పరిచయం అయ్యారు. ఈమె కథానాయకిగా నటించిన తొలి తమిళ చిత్రం ఇదు ఎన్న మాయం. ఈ చిత్రం నిరాశ పరిచింది. ఆ తరువాత నటించిన రజనీ మురుగన్, రెమో వంటి చిత్రాలు హిట్ కావడంతో కీర్తిసురేశ్‌కు తెలుగులోనూ అవకాశాలు రావడం మొదలెట్టాయి. అలా అక్కడ నటించిన మహానటి విజయ్ చెప్పినట్లు వదంతులకు వివరణ ఇస్తే అది నిజం అవుతుందన్నారు. కాబట్టి దాన్ని పక్కన పెట్టేద్దాం అన్నారు. ఇకపోతే నటన గురించి విమర్శలను తాను స్వాగతిస్తానని, ఒక నటిగా అవి తనను మెరుగుపరుస్తానికి ఉపయోగపడతాయని కీర్తిసురేశ్ సమాధానం ఇచ్చారు. ఇకపోతే తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈ భామ నటించిన ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రం రఘుతాత ఆగస్టు 15వ తేదీన తెరపైకి రానుంది.

క్లుప్తంగా

స్వర్ణకారుడు ఆత్మహత్య

తిరువొత్తియూరు: ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకున్న ఓ స్వర్ణకారుడు సైనైడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోయంబత్తూరులో చోటుచేసుకుంది. కోయంబత్తూరులోని కెంపట్టి కాలనీకి చెందిన రాధాకృష్ణన్ (49) నగల పత్రి కార్మికుడు. రాధాకృష్ణన్ గత 20 ఏళ్లుగా ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టి జూదం ఆడుతున్నాడు. ఇందుకు స్నేహితులు, బంధువుల వద్ద అప్పు చేసి రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నాడు. రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక ఇతను గురువారం నగల తయారీ దుకాణంలో హఠాత్తుగా సైనైడ్ మింగేశాడు. ఇది చూసిన తోటి కార్మికులు దిగ్భ్రాంతి చెంది కోయంబత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్ష చేసిన డాక్టర్లు రాధాకృష్ణన్‌మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బావిలో పడి బాలుడు దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై శివారులోని సెమ్మంజేరిలో బాలుడు(9) బావిలో జారిపడి మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై, సెమ్మంజేరి తులుకానత్తమ్మాల్ ఆలయ వీధికి చెందిన లోకనాథన్ కుమారుడు మనోజ్ (9) శుక్రవారం ఇంటికి సమీపంలో ఉన్న ఒక బావిపై నిలబడి ఆడుకుంటున్నాడు. బావి పైన వేసిన మూతలో లోపలకు దిగేందుకు ఒకవైపు ఒక కొద్ది పాటి రంధ్రం ఉంచారు. అందులో నుంచి బాలుడు బావిలో పడ్డాడు. ఇది చూసిన స్నేహితులు అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బావి పైన ఉన్న ఇనుప మూతను తొలగించడానికి వీలు కాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ క్లిస్టర్ జోష్, అగ్నిమాపక సిబ్బంది బావిలోకి పడిపోయిన బాలుడిని బయటకు తీశారు. సమీపంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

భార్యను హత మార్చిన భర్త


అరెస్టయిన ఓంప్రకాష్


సంధ్య(ఫైల్)

వేలూరు: భార్యను హత్య చేసిన ఘటనలో భర్తను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రాణిపేట జిల్లా బానావరం సమీపంలోని పారమేడు గ్రామానికి చెందిన ఓంప్రకాష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి గత రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన సంధ్య(23)తో వివాహం జరిగింది. అయితే కొద్దిరోజులుగా ఓంప్రకాష్‌కు భార్య సంధ్యపై ప్రవర్తన విషయంలో అనుమానం కలిగింది. దీంతో దంపతుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఓంప్రకాష్ ప్రతి రోజూ మద్యం సేవించి భార్యతో ఘర్షణ పడుతున్నాడు. దీంతో సంధ్య భర్త నుంచి విడిపోయి పుట్టింట్లో ఉంటోంది. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వెళ్లిన ఓంప్రకాష్ ఆగ్రహించి సంధ్య పుట్టింటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆగ్రహం చెందిన ఓంప్రకాష్ తన వద్ద ఉన్న కత్తితో భార్య సంధ్యను హత్య చేసి అక్కడ నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బానావరం పోలీసులు పరారీలో ఉన్న ఆటో డ్రైవర్ ఓంప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. సంధ్య మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వాలాజ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రేమను తిరస్కరించిన విద్యార్థినిపై దాడి

తిరువొత్తియూరు: ప్రేమించలేదని కళాశాల విద్యార్థినిపై కత్రితో దాడి చేసిన యువకుడు కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై, కోడంబాక్కం భారతీశ్వర కాలనీ ప్రాంతానికి చెందిన యువతి ఒకరు ప్రైవేటు కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఈమె శుక్రవారం సాయంత్రం అదే ప్రాంతంలో ఉన్న ట్యూషన్ సెంటర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తోంది. ఆ సమయంలో ఆ విద్యార్థినిని వెంబడించిన ఒక యువకుడు విద్యార్థిని అడ్డుకుని తనను ఎందుకు ప్రేమించడం లేదని ఆమెతో గొడవ చేశాడు. దీనికి విద్యార్థిని తిరస్కరించడంతో విద్యార్థినిపై అతను కత్రితో తీవ్రంగా దాడి చేసి అక్కడ నుంచి పారిపోయాడు. గాయమైన విద్యార్థిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొంది, ఆమె ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో యువకుడిపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినీ తండ్రి వడపళని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు తప్పించుకుని పారిపోయిన యువకుడి కోసం గాలిస్తున్నారు.

ధర్మపురిలో పరువు హత్య

సాక్షి, చెన్నై: ఓమలూరులోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్న యువకుడైన ట్రైనీ చెఫ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి హతమార్చారు. ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు కారణంగా తేలడంతో పరువు హత్యగా పోలీసులు భావిస్తున్నారు. వివరాలు.. ధర్మపురి జిల్లా విజెట్టి హళ్లికి చెందిన జావెద్ కుమారుడు, మహ్మద్ యూసఫ్(23) క్యాటరింగ్‌లో డిప్లొమో పూర్తి చేశాడు. సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని ఓ బిర్యానీ రెస్టారెంట్‌లో ట్రైనీ చెఫ్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి రెస్టారెంట్‌లో పని బిజీలో ఉన్న మహ్మద్ యూసఫ్‌పై నలుగురు యువకులు కత్తితో దాడి చేశారు. అక్కడున్న సిబ్బంది తేరుకునేలోపు ఆ వ్యక్తులు ఉడాయించారు. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ హత్యకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు శనివారం వైరల్ అయ్యాయి. సమాచారం అందుకన్న ధర్మపురి ఎస్పీ స్టీఫెన్ జేసుపాదం నేతృత్వంలో బృందం విచారణ చేపట్టింది. మహ్మద్ సేలం ఓమలూరుకు చెందిన యువతిని ప్రేమిస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ యువతిని తనకు ఇచ్చి వివాహం చేయాలని ఆమె కుటుంబాన్ని కొద్ది రోజుల క్రితం మహ్మద్ కోరినట్టు వెలుగు చూసింది. ఆ యువతి కుటుంబం అందుకు నిరాకరించిన నేపథ్యంలో ఈ హత్య జరగడం గమనార్హం. ఆ యువతి వివరాలను సేకరించిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

ఆడికృత్తిక వేడుకలు ప్రారంభం

- తిరుత్తణిలో కావళ్ల సందడి
- కాంతులీనుతున్న ఆధ్యాత్మిక పట్టణం
- నేడు భరణి కృత్తిక


ఆలయ మాడ వీధుల్లో భక్తుల రద్దీ

తిరుత్తణి: సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక తెప్పోత్సవం శనివారం అశ్వినితో ప్రారంభమైంది. ఐదు రోజులు పాటు నిర్వహించే ఈ వేడుకలు సందర్భంగా శనివారం వేకువజామున మూలవర్లకు విశిష్ట అభిషేక ఆరాధన పూజలు చేశారు. బంగారు, వజ్రాభరణాలతో అలంకరించి మహాదీపారాధన చేశారు. ఉదయం నుంచే భక్తులు నెమలి, పన్నీరు కావళ్లతో ఆలయానికి చేరుకున్నారు. దీంతో మురుగన్ ఆలయం హరోంహర నామస్మరణలతో మార్మోగింది. భక్తులు మాడ వీధుల్లో వేచి ఉండి స్వామివారిని దర్శించుకుని, కావడి మండపంలో ఉత్సవర్లకు కావళ్లు చెల్లించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలు ప్రారంభంతో తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట, వేలూరు తదితర జిల్లాల నుంచి 1800 మంది పోలీసులు బందోబస్తు కోసం తిరుత్తణికి చేరుకున్నారు. ఆదివారం ఆడి భరణి కావళ్లు వేలాదిగా రానున్న క్రమంలో ఆలయంతో పాటు పట్టణవ్యాప్తంగా కోలాహలం నెలకొంది. భక్తులకు తాగునీరు, బస కేంద్రాలు సహా కనీస సదుపాయాలను జిల్లా యంత్రాంగం, హిందూ దేవాదాయ శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయి.




విద్యుత్ కాంతులతో కనువిందు చేస్తున్న మురుగన్ ఆలయం, కావళ్లతో భక్తుల సందడి

రాజరాజేశ్వరికి 108 దీపాలతో పూజలు


దీపారాధన పూజల్లో పాల్గొన్న మహిళలు

తిరువళ్లూరు: కాకలూరు హౌసింగ్ బోర్డు కాలనీలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో 108 దీపారాధన పూజలు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని శుక్రవారం 108 మంది మహిళలు దీపారాధన పూజలు చేశారు. అనంతరం చందనకాపు అలంకరణ, పసుపు పూజలు, ఆరాధన నిర్వహించారు. దీపారాధన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కాగా పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలతో పాటు మంగళసూత్రం, పసుపు, కుంకుమ తదితర వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సురేష్, అర్యశ్రీనివాసన్, దశరథన్, వెంకటేష్, అరుల్, ధర్మలింగం, రఘు, బాలసుబ్రమణ్యం, బుజ్జిరాజ్ పాల్గొన్నారు.

రూ.36 లక్షలతో శివవిష్ణు చెరువు ఆధునికీకరణ


ఆధునికీకరించిన శివవిష్ణు చెరువు

కొరుక్కుపేట: అంబత్తూరులోని శివవిష్ణు చెరువును దాదాపు 50 ఏళ్ల తర్వాత గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) రూ.36 లక్షల అంచనా వ్యయంతో సింగార చెన్నై 2.0 ప్రాజెక్టు కింద ఆధునికీకరించింది. దీంతో భూగర్భ జలాలను పెరుగుతాయని, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ముంపును అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. స్థానిక సంస్థ నిర్వహణ లేకపోవడంతో నీటి వనరు చిన్నబోయిందని, పునరుద్ధరణ ప్రాజెక్టు సమయంలో సరిదిద్దలేదని నిర్వాసితులు దృష్టికి తెచ్చారు. 224 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 2.5 మీటర్ల లోతుతో విస్తరించారు. టాయిలెట్, ఫుట్‌పాత్ , గార్డు గది ఇంకా వాటర్ బాడీ చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు అనేక దేశీయ జాతుల మొక్కలు నాటారు.

అసోసియేట్ సబ్ రిజిస్ట్రార్ సహా ఆరుగురిపై కేసు

కొరుక్కుపేట: విల్లుపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం -2లో అవినీతి నిరోధక శాఖ పోలీసులు దాడులు చేసి, అసోసియేట్ సబ్ రిజిస్ట్రార్‌సహా ఆరుగురిపై కేసు నమోదు చేశారు. విల్లుపురంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం ప్రజల నుంచి లంచం తీసుకుంటున్నట్లు ఫిర్యాదు వచ్చింది. దీంతో విల్లుపురం అవినీతి నిరోధక శాఖ పోలీసులు గురువారం రాత్రి ఆకస్మికంగా కార్యాలయంపై దాడులు చేశారు. అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ (పి) పార్కు లోపల అధికారులను సందర్శించి డీడీలు నమోదు చేయడానికి వచ్చిన వ్యక్తులను తనిఖీ చేశారు. రాత్రి 11.45 గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. ఆ సమయంలో దస్తావేజుల్లో ఉంచిన సొమ్ము, బీరువాలోని డబ్బులు, అధికారులు లంచం ఇచ్చేందుకు డీడీలు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన వారి వద్ద ఉంచిన సొమ్మును లెక్కలోకి తీసురాని రూ.42,600, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. విల్లుపురానికి చెందిన కెమెరా ఆపరేటర్ భరణి, అసిస్టెంట్ తిరుమల్, మురుగన్, పెరుమాల్, వలవనూరుకు చెందిన గురునాథన్ అనే ఆరుగురిపై ఏసీబీ పోలీసులు అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చని తెలుస్తోంది.

వేళచ్చేరిలో జోయాలుక్కాస్ షోరూమ్ ప్రారంభం


జోయాలుక్కాస్ కొత్త స్టోర్ ప్రారంభిస్తున్న నటుడు ప్రశాంత్

కొరుక్కుపేట: ప్రముఖ నగల దుకాణం జోయాలుక్కాస్ కొత్తగా వేల‌చ్చేరిలో రెండో షోరూమ్‌ను శనివారం ప్రారంభించారు. ఇందులో జోయాలుక్కాస్ నిర్వాహకుల సమక్షంలో అతిథులుగా ప్రముఖ నటుడు ప్రశాంత్‌తోపాటు నటి మడోనా, ఇంకా వేళచ్చేరి ఎమ్మెల్యే అసన్ మౌలానా తదితరులు పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఇంకా ప్రారంభవేడుకలో అనేక మంది వీఐపీలు, ప్రముఖులు, జోయాలుక్కాస్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ వేలచ్చేరిలో తమ రెండో షోరూమ్‌ని ప్రారంభించడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయం నుంచి సమకాలీన శైలి వరకు, అలాగే అనుగ్రహ టెంపుల్ జ్యుయలరీ, ప్రైడ్ డైమండ్స్, ఎలిగాంజా పోల్కీ డైమండ్స్, యువ ఎప్రీడే జువెలరీ, అపూర్వ యాంటిక్ కలెక్షన్స్ ఆకర్షణగా నిలుస్తాయన్నారు.

కార్గో వ్యాను, కారు ఢీ


– ముగ్గురి మృతి

అన్నానగర్: సత్యమంగళం సమీపంలో శుక్రవారం రాత్రి కార్గో వ్యానును కారు ఢీకొనడంతో కళాశాల విద్యార్థి సహా ముగ్గురు మృతి చెందారు. కర్ణాటక నుంచి టమాట లోడ్‌తో కార్గో వ్యాన్ శుక్రవారం రాత్రి ఈరోడ్ సత్యమంగళం మైసూరు రోడ్డులో పుదవడవల్లి మురుగన్ ఆలయం వద్ద వెళుతుండగా సత్యమంగళం నుంచి బన్నారి వైపు వస్తున్న కారులో ఐదుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. మురుగన్ దేవాలయం మలుపులో కారు అదుపు తప్పి గూడ్స్ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. ఈ ఘటనలో కారులో ఉన్న ముకిల్ నివాష్ (22), రోహిత్ (18), ధర్మేష్ (19) అక్కడికక్కడే మృతి చెందారు. ముకిల్ నివాష్ సోదరుడు ఆది (18), శ్రీనివాసులు (17) తీవ్రంగా గాయపడ్డారు. కాగా ముకిల్ నివాష్ కారు వెనుకే వస్తున్న మరో కారు వీరి కారును ఢీకొంది. సమాచారం అందుకున్న సత్యమంగళం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల సాయంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని రక్షించి, కోయంబత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కార్గో వ్యాన్ డ్రైవర్ సతీష్ కుమార్(37), మరో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి రూ.10.20 లక్షల పరిహారం

కొరుక్కుపేట: ఎస్పీ కారు ఢీకొని మృతి చెందిన యువకుడి కుటుంబానికి రూ.10.20 లక్షల పరిహారం అందజేశారు. పదేళ్ల తర్వాత బాలుడికి న్యాయం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలాన్నాయి. కాంచీపురం జిల్లా కావేరిపాక్కం ప్రాంతానికి చెందిన సురేష్ (25) కావేరీపాక్కంలో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వెనుక వచ్చిన కాంచీపురం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో సురేష్ మృతి చెందాడు. దీని గురించి వాహన డ్రైవర్ కుజండివేలుపై కావేరిపాక్కం పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు సురేష్ కుటుంబం కాంచీపురం జిల్లా కోర్టులో కేసు వేసింది. మోటార్ వెహికల్ యాక్సిడెంట్ యాక్ట్ కింద పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి ఏకాంబరం స్పష్టంగా సాక్ష్యం చెప్పాడు. 20 నుంచి 30 అడుగుల దూరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కారు ఢీకొట్టడాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. నేరం రుజువు కావడంతో మృతుడు సురేష్ కుటుంబానికి రూ.10.20 లక్షల పరిహారం చెల్లించాలని కాంచీపురం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశిస్తూ జస్టిస్ శరవణకుమార్ తీర్పు చెప్పారు.

వెయ్యి కళ్ల అమ్మ



సేలం: ఆడి నెలను పురస్కరించుకుని ఈరోడ్‌లోని వెండిపాళయంలో ఉన్న శ్రీ సమయపురం మారియమ్మన్ ఆలయంలో అమ్మవారికి వెయ్యి వెండి కళ్లతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కూలిన వృక్షం



సేలం: నీలగిరి జిల్లాలో పది రోజులుగా భారీ ఈదురు గాలులతో వర్షం కురుస్తోంది. ఈ స్థితిలో శనివారం ఇక్కడ కేతి పోలీసు స్టేషన్‌పై భారీ వృక్షం కూలింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదని సమాచారం.

మెట్రో రైలులో గంజాయి తాగిన యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై మెట్రో రైలులో గంజాయి తాగుతున్న స్విగ్గి ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ తన ఎక్స్ సైట్‌లో గురువారం మెట్రో రైలులో ఓ యువకుడు గంజాయి తాగుతున్న యువకుడు అని ఫొటోను పోస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో తేనాంపేట మీదుగా వెళుతున్న మెట్రో రైలులో యువకుడు గంజాయి తాగినట్లు తెలిసింది. దీంతో తేనాంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు మెట్రో రైలులోని నిఘా కెమెరా రికార్డులతో విచారణ చేపట్టగా చెన్నై తండయార్‌పేటకు చెందిన మోహన్ కుమారుడు భువనేష్ (24) స్విగ్గి ఫుడ్ డెలివరీ కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడని తెలిసింది. తేనాంపేట పోలీసులు భువనేష్‌ను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరు..

చెన్నై అన్నానగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. తాంబరం అనకాపుత్తూరు శ్మశానం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు శంకర్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆప్రాంతంలో నిఘా పెట్టారు. ఆ సమయంలో గంజాయి విక్రయిస్తున్న చెన్నై అన్నానగర్‌కు చెందిన కళాశాల విద్యార్థి లోకేష్‌ను అరెస్టు చేశారు. అతను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయభాస్కర్‌తో చేరి ఆంధ్రలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. అతని వద్ద నుంచి 1,400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతను కళాశాల విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి జైలులో పెట్టారు.

కుక్కను కొట్టి చంపిన యువకుడు..

తేని జిల్లాలో కుక్కను కొట్టి చంపిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. తేని జిల్లా కూడలూరు సమీపంలో ఉన్న కరుణాయాక్ ముత్తన్పట్టికి చెందిన కిరణ్ (26) కొబ్బరికాయల పీచు వలిచే పని చేస్తూ ఉన్నాడు. గత 6 నెలల కిందట జరిగిన హత్య కేసులో అరెస్టయి, ప్రస్తుతం నిబంధనల మేరకు బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇతను అదే ప్రాంతంలో మోటారు సైకిల్‌లో వెళుతున్న సమయంలో రోడ్డుపై తిరుగుతున్న ఒక కుక్కను నేలకు వేసి కొట్టి చంపాడు. దీన్ని ప్రశ్నించిన ఆ ప్రాంత ప్రజలకు కత్తిని చూపించి తాను ఇప్పటికే హత్య చేసి జైలుకు వెళ్లి వచ్చానని వారికి బెదిరించాడు. దీని గురించి స్థానిక ప్రజలు కూడలూరు నార్త్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి కిరణ్‌ను అరెస్టు చేశారు.

హాస్టల్‌లో ఘర్షణ

– 10 మంది విద్యార్థులకు గాయాలు

తిరువొత్తియూరు: శ్రీపెరంబుదూరు సమీపం చెంగా డు ప్రాంతంలో సముద్ర నౌక యాన ప్రైవేటు శిక్షణ క ళాశాల ఉంది. ఇక్కడ ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాల కు చెందిన విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ ఆరు నెలలకు శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కళాశాల హాస్టల్‌లో 6, 18వ గదులలోనే ఉంటున్న ఉత్తరప్రదేశ్, హర్యాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు మధ్య వాగ్వాదం ఏర్పడింది. రెండు వర్గాల చెందిన 15 మందికి పైగా విద్యార్థులకు తీవ్రంగా ఇనుప రాడ్లు బాటిళ్లు, కర్రలతో దాడి చేసుకున్నారు. ఇందులో ఇద్దరు విద్యార్థులకు తలకు తీవ్ర గాయమైంది. 8 మందికి గాయాలు అయ్యాయి. వీరు తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీపెరంబుదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధుమేహం పరిశోధనల్లో దేశం ముందంజ

- కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్
- అంతర్జాతీయ మధుమేహం నవీకరణపై సదస్సు


డీఎండీఎస్సీ లైఫ్‌టైమ్ కంట్రిబ్యూషన్ అవార్డును ప్రదానం చేస్తున్న డాక్టర్ మోహన్

కొరుక్కుపేట: మధుమేహం పరిశోధనల్లో ప్రపంచంలోనే భారత్ ముందంజలో ఉందని కేంద్ర కేంద్ర శాస్త్ర సాంకేతిక, ప్రభుత్వ సిబ్బంది, ప్రజాసమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి (ఇండిపెండెంట్ చార్జ్) డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ (డీఎండీఎస్సీ) ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డయాబెటిస్ అప్‌డేట్ 11వ ఎడిషన్ సదస్సుకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సదస్సులో భాగంగా డయాబెటాలజీని అభివృద్ధి చేయడం, మధుమేహం సంరక్షణను మెరుగుపరచడంతోపాటు దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌కు డీఎండీఎస్సీ లైఫ్‌టైమ్ కంట్రిబ్యూషన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 160 మందికి పైగా ప్రఖ్యాత వైద్య నిపుణులు విచ్చేశారు. ఈ సదస్సులో హార్వర్డ్ మెడికల్ స్కూల్, ఎన్‌హెచ్‌ఎస్ ఫౌండేషన్ ఆఫ్ బర్మింగ్‌హామ్, నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ – సింగపూర్, ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎక్సెటర్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్, బేకర్ ఇన్‌స్టిట్యూట్ తదితర సంస్థలకు చెందిన పలువురు ప్రముఖ వైద్యులు, శాస్త్రవేత్తలు హాజరై, తమ అనుభవాలను పంచుకున్నారు. డయాబెటిస్ అప్‌డేట్ ఆర్గనైజింగ్ చైర్మన్, డాక్టర్ మోహన్ గ్రూప్ ఆఫ్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ వి.మోహన్ మాట్లాడారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశాన్ని మధుమేహ పరిశోధనలో ప్రపంచ పటంలో ఉంచినందుకు మోహన్స్ డయాబెటిస్ చైర్మన్ డాక్టర్ వి.మోహన్‌ను, మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ బృందాన్ని భారత ప్రభుత్వం తరపున తాను అభినందిస్తున్నానన్నారు. సదస్సులో డాక్టర్ మోహన్ గ్రూప్ ఆఫ్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఎం అంజన, వైస్‌చైర్మన్ డాక్టర్ రంజిత్ ఉన్నికృష్ణన్ పాల్గొన్నారు.

ఆమ్ని ప్రయాణికుడికి రూ. 5లక్షల పరిహారం

సాక్షి, చెన్నై : ఆమ్ని ప్రైవేటు ట్రావెల్స్ సిబ్బంది దురుసుతనం, ఓ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సంస్థల తీరును వినియోగదారుల ఫోరం తీవ్రంగా తప్పుపట్టింది. ప్రయాణికుడికి రూ. 5 లక్షలు పరిహారం చెల్లించాలని శనివారం చెన్నై వినియోగదారుల ఫోరం ఆదేశించింది. అణు పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న షణ్ముగనాథన్ ఇటీవల మదురై నుంచి చెన్నైకు ఆన్‌లైన్‌లో ఓ ట్రావెల్స్ ఏసీ బస్సులో టికెట్ బుక్ చేశారు. ప్రయాణ సమయంలో తన పాటుగా తన బాక్సులో కూరగాయలు తెచ్చుకున్నారు. అయితే ఆ కూరగాయల బాక్సుకు రూ.600 అదనంగా చెల్లించాలని బస్సులోని సిబ్బంది ఆయనపై ఒత్తిడి తెచ్చారు. 15 కిలోల వరకు లగేజీ తీసుకెళ్లేందుకు వీలున్నప్పుడు ఆ బరువు కూడా లేని కూరగాయాలను ఎందుకు అనుమతించరని ఆయన ప్రశ్నించారు. దీంతో మేలూరు సమీపంలో ఆ బస్సు డ్రైవర్‌తో పాటుగా సిబ్బంది ఆయన్ని బలవంతంగా కిందకు దించి, వెళ్లి పోయారు. తనకు ఎదురైన తీవ్ర మనోవేదన, అవమానానికి షణ్ముగనాథన్ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారణ సమయంలో బస్సులో జరిగే వివాదానికి తమకు సంబంధం లేదని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో ప్రముఖంగా ఉన్న వెబ్‌సైట్ స్పష్టం చేసింది. దీనిని వినియోగదారుల ఫోరం అంగీకరించ లేదు. ప్రయాణికుడికి ఎదురయ్యే అన్ని రకాల సమస్యలకు బస్సు యాజమాన్యం, సిబ్బందితో పాటుగా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సంస్థ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రయాణికుడైన షణ్ముగనాథన్‌కు రూ. 5 లక్షలు పరిహారం, రూ. 15 వేలు విచారణ ఖర్చులు చెల్లించాలని ఆదేశిస్తూ ట్రావెల్స్ యాజమాన్యం, బస్సులోని సిబ్బంది, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సంస్థకు జరిమాన విధించారు.

నేను నటిస్తూనే ఉంటా చేతనైతే అడ్డుకోండి

తమిళసినిమా: నటుడు విశాల్ దక్షిణ భారత నటీనటుల సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈయన 2017–2019 ప్రాంతంలో తమిళ్ నిర్మాతల మండలి అధ్యక్షుడిగానూ బాధ్యతలను నిర్వహించారు. ఆ సమయంలో మండలికి చెందిన నిధి రూ.12 కోట్ల వరకూ అవకతవకలు జరిగినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ప్రస్తుత మండలి కార్యవర్గం విశాల్‌ను కోరింది. అయితే ఈ విషయంపై విశాల్ ఎలాంటి బదులు ఇవ్వలేదు. దీంతో ఇకపై నటుడు విశాల్‌తో చిత్రాలు చేసే నిర్మాతలు, సాంకేతిక వర్గం తమిళ్ నిర్మాతల మండలితో చర్చించి ఆ తరువాతనే షూటింగ్ పనులు ప్రారంభించాలని శుక్రవారం ఒక ప్రకటన చేశారు. దీంతో నటుడు విశాల్ తన ఎక్స్ మీడియాలో బదులిస్తూ మీరు కమిటీలో ఉన్న కదిరేశన్‌తో కలిసి ఈ తీర్మానం చేశారని, మీరు ఆరోపిస్తున్న నిధిని విద్య, వైద్య పథకం, నిర్మాతల మండలి సీనియర్, ఆర్థికంగా చితికిపోయిన సభ్యుల సంక్షేమం కార్యకమాలకు ఉపయోగించిన విషయం కదిరేశన్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. విశాల్ నటిస్తూనే ఉంటాడని, చేతనైతే అడ్డుకోండని, సినిమాలు నిర్మించని నిర్మాతలూ ఆరోగ్యకరమైన విషయాల గురించి ఆలోచించండని సవాల్ విసిరారు. కాగా విశాల్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిన నిర్మాతల మండలి కార్యనిర్వాహక వర్గం చర్యలను ఖండిస్తూ విశాల్ కార్యనిర్వాహకుడు హరి కృష్ణన్ న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు.

సమాజానికి తిరిగి కొంత ఇవ్వాల్సిందే


సావనీర్‌ను విడుదల చేస్తున్న నరేంద్ర శ్రీశ్రీమల్

తిరువళ్లూరు: ఉన్నత స్థాయికి చేరుకున్న వారు తాము సంపాదించిన ఆదాయంలో కొంత మొత్తాన్ని సమాజానికి తిరిగి ఇచ్చి, దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని మెడి సేల్స్ గ్రూప్ సంస్థ అధినేత నరేంద్ర శ్రీశ్రీమల్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా కసువ గ్రామంలోని సేవాలయ సంస్థ 36వ వార్షికోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీధరన్ అధ్యక్షత వహించగా ప్రముఖ పారిశ్రామికవేత్త నరేంద్రశ్రీశ్రీమల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సేవాలయ 36వ వార్షికోత్సవ సావనీర్‌ను విడుదల చేశారు. దీంతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులు, సేవాలయ సిబ్బందిని గౌరవించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంది. సేవాలయ వార్షికోత్సవం సందర్భంగా వేర్వేరు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు భువనేశ్వరి మురళీధరన్, అమిత్‌చంద్‌జైన్, అన్నపూర్ణ, కింగ్‌స్టన్, అనుప్రియ పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగాలపై ఆసక్తి చూపాలి



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న రోటరీ సభ్యులు

వేలూరు: నిరుద్యోగ యువతీ యువకులు ప్రైవేటు ఉద్యోగాలపై ఆసక్తి చూపాలని రోటరీ ఇంటర్నేషనల్ వేలూరు జాబ్ మేళా చైర్మన్ బీమారావ్ అన్నారు. వేలూరులోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర పాఠశాల ఆవరణలో ప్రైవేటు కంపెనీలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం చెన్నై, కోవై, తిరిచ్చి వంటి ప్రాంతాల్లో ప్రైవేటు ఉద్యోగాల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం విద్యార్హతకు సంబంధించిన ఉద్యోగాలను నోటీస్ బోర్డులోనే డిస్‌ప్లే చేశామని, అభ్యర్థులు అర్హత ఉన్న ఉద్యోగాలకు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ప్రస్తుతం 40 కంపెనీల నుంచి ప్రతినిధులు వచ్చారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ నిర్మల్ రాఘవన్, సభ్యులు శివకుమార్, రాజన్ బాబు, సురేష్, జోన్ చైర్మన్ ప్రభు, సర్వీస్ డైరెక్టర్ మురగేష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో ధర్నా


ధర్నాకు హాజరైన డీఎంకే శ్రేణులు


అన్నా రోడ్డులో ధర్నా చేస్తున్న డీఎంకే నాయకులు

తిరువళ్లూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ డీఎంకే అధిష్టానం పిలుపు మేరకు తిరువళ్లూరులో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి డీఎంకే జిల్లా కన్వీనర్, ఎమ్మెల్యే చంద్రన్ అధ్యక్షత వహించగా స్థానిక ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్‌ఎస్ భారతి హాజరై ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కనీస నిధులు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎంపీలు గెలిపించలేదన్న అక్కసుతోనే రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదన్న ఆయన, రాష్ట్ర హక్కుల కోసం పార్టీ నేతలు ప్రజలు సమైక్యంగా గళం విప్పాలని పిలుపు నిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ నేతలు తిరుత్తణి భూపతి, కుమరన్, జయకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా

వేలూరు: కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు ఎటువంటి నిధులు కేటాయించలేదని బీజేపీ ప్రభుత్వాన్ని ఖండిస్తూ వేలూరులోని అన్నా రోడ్డులో డీఎంకే పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాకు జిల్లా కార్యదర్శి, అనకట్టు ఎమ్మెల్యే నందకుమార్ అధ్యక్షత వహించగా పార్లమెంట్ సభ్యులు కదీర్ ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీజేపీ కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాత్రమే అధిక నిధులు కేటాయించడం సరికాదన్నారు. ధర్నా లో ఎమ్మెల్యేలు కార్తికేయన్, అములు, జెడ్పీ చైర్మన్ బాబు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, మాజీ ఎంపీ మహ్మద్‌సఫీ పాల్గొన్నా రు. అలాగే రాణిపేటలో జిల్లా కార్యదర్శి ఆర్ గాంధీ అధ్యక్షతన ధర్నా చేశారు. తిరుపత్తూరు, తిరువణ్ణామలై జిల్లాలోను ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.

క్లుప్తంగా...

మానవ అక్రమ రవాణా నిరోధానికి కృషి

ఏపీ సీఐడీ ఎస్పీ సరిత పిలుపు



పోస్టర్ విడుదల చేస్తున్న సీఐడీ ఎస్పీ సరిత

సాక్షి, అమరావతి: మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు(ఏహెచ్‌టీయూ), సీఐడీ మహిళా సంరక్షణ విభాగం ఎస్పీ కేజీవీ సరిత పిలుపునిచ్చారు. ఈ నెల 30వ తేదీ 'ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం'ను పురస్కరించుకుని మంగళగిరిలోని రాష్ట్ర మహిళా సంరక్షణ విభాగంలో శనివారం నిర్వహించిన సమావేశంలో హెల్ప్, విముక్తి సంస్థలు సయుక్తంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. రాష్ట్రంలో హ్యూమన్ ట్రాఫికింగ్ లాంటి క్రూరమైన నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అందుకే ప్రతి జిల్లాలో మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లు ఏర్పాటు చేశామని సరిత వివరించారు.

పైపుల పరిశ్రమలో కార్మికుడి మృతి

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన



మృతుడు ప్రసాద్

శ్రీకాళహస్తి రూరల్: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం శ్రీకాళహస్తి పైప్స్ పరిశ్రమలో పనిచేస్తున్న మొద్దు ప్రసాద్ (49)పై ప్రమాదవశాత్తు పైపులు పడి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి మండలం శ్రీకాళహస్తి కాపుగున్నేరులో నివసిస్తున్న మొద్దు ప్రసాద్ శనివారం ఉదయం పరిశ్రమలోని పైప్‌ల స్టోరేజ్‌లో లోడింగ్ చేస్తుండగా పైపులు పైన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ పరిశ్రమ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఏరియా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బంధువులను పరామర్శించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

వినతులపై పవన్ సమీక్ష



సాక్షి, అమరావతి: తాను ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి తన కార్యాలయానికి అందిన అర్జీల పరిష్కారంపై శనివారం పవన్‌కళ్యాణ్ సమీక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణం, అటవీ శాఖలపై వచ్చిన అర్జీలతోపాటు ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను, ఎదురవుతున్న ఇబ్బందులపై అందిన వినతుల వివరాలను ఆయన పరిశీలించారు.

టెకీలూ.. కాస్త విశ్రమించండి

ఐటీ ఉద్యోగుల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు

40 ఏళ్లలోపే చుట్టుముడుతున్న నొప్పులు, ఇతర ఇబ్బందులు

వేగంగా పెరుగుతున్న దీర్ఘకాలిక సమస్యలు

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న ఐసీఎంఆర్


సాక్షి, అమరావతి:

జీవితంలో త్వరగా స్థిరపడాలంటే ఐటీ ఉద్యోగమే బెస్ట్ అని చాలామంది అనుకుంటారు. మంచి వేతనం.. వారాంతపు సెలవులు వంటి వెసులుబాట్లు సౌకర్యాలెన్నో వారికి ఉంటాయని చెబుతారు. టెకీల జీవితంలో ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. రెండో వైపు పరిశీలిస్తే వారిని ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఒత్తిడి వల్ల తరచూ వెన్నునొప్పి వంటి సమస్యలతో టెకీలు ఇబ్బందులు పడుతున్నారు. యాంత్రిక జీవన శైలితో 25 నుంచి 40 ఏళ్లలోపే ఇబ్బందులు తలెత్తున్నాయి. ఒకేచోట గంటల తరబడి కూర్చుని పని చేయడం, శారీరక శ్రమ లేమి వంటి కారణాలతో 40 ఏళ్లు పైబడిన వారిలో ఆరోగ్య సూచీలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయి.

43% మందిలో ఆరోగ్య సమస్యలే

దేశంలో 43 శాతం మంది టెకీలు పని నుంచి ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ అంశాన్ని నాలెడ్జ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ (కేసీసీఐ) సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. టెకీల్లో సగానికి పైగా వారానికి సగటున 52.50 గంటలు పని చేస్తున్నారు. అస్థిరమైన పని షెడ్యూళ్లతో 26 శాతం మంది నిద్ర లేమి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 51 శాతం మంది రోజుకు సగటున ఐదున్నర గంటల నుంచి ఆరు గంటలు మాత్రమే నిద్రపోతున్నారు.





ఎక్కువ మందిలో వెన్నునొప్పి

ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ మందిలో మెడ, వెన్నునొప్పి సాధారణంగా ఉంటోంది. ఈ సమస్యలతో తమ దగ్గరకు వచ్చే యువతలో అత్యధికులు టెకీలే ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. టెకీలు గంటల తరబడి కార్యాలయాల్లో కూర్చుని పనిచేస్తుంటారు. మెడ ఎముక, భుజం ఎముక వెన్నెముకతో అనుసంధానమై ఉంటాయి. ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్ల మెడ, వెన్నెముకలో ఒకచోట అమరిక అస్తవ్యస్తమై ఇతర భాగా లపై ప్రభావం పడుతుంది. ఈ క్రమంలో కూర్చోవడంతో పాటు, నిలబడినప్పుడు భంగిమ సరిగా ఉండేలా చూసుకోవాలని వైద్యు లు సూచిస్తున్నారు. నిల్చున్నప్పుడు తల, భుజాల వెనుక భాగం, పిక్కలు గోడకు తాకి ఉండేలా చూసుకోవాలంటున్నారు. ఫోన్, ల్యాప్‌ట్యాప్ చూసేప్పుడు సహజంగానే మెడ ముందుకు వాల్చకుండా ఉండాలి. ఒత్తిడిని అధిగమించడానికి యోగా, మెడిటేషన్ చేయాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. ఆఫీస్ నుంచి ఇంటికి రాగానే కుటుంబ సభ్యులు, పిల్లలతో గడపడం, ఇష్టమైన సంగీతం వినడం, సినిమాలు చూడటం ద్వారా ఒత్తిడి నుంచి విముక్తి పొందాలంటున్నారు.

ఐసీఎంఆర్ ఏం చెబుతోందంటే..

పనిలో ఎంత బిజీగా ఉన్నా శారీరక శ్రమను మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని.. శరీరాన్ని కాస్త అటూ ఇటూ కదల్చాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సూచిస్తోంది. ఆ సూచనలు ఇవీ..

- ఎంత బిజీగా ఉన్నప్పటికీ పనిచేసే ప్రదేశాల్లో, ఇతర సందర్భాల్లో కుర్చీకే అతుక్కుపోకుండా పనిచేసే ప్రదేశాల్లో స్టాండింగ్ డెస్క్ ఉపయోగించాలి. లేదంటే ప్రతి అరగంటకు ఒకసారి లేచి నిలబడాలి.
- ప్రతి కొన్ని గంటలకు లేచి 5 నుంచి 10 నిమిషాలు అటూఇటూ నడవాలి.
- ఇల్లు లేదా పని ప్రదేశాల్లో ఫోన్ మాట్లాడేప్పుడు నడుస్తూ ఉండాలి. లిఫ్ట్, ఎలివేటర్‌కు బదులు మెట్లను వినియోగించాలి.
- టీవీ చూస్తున్నప్పుడు కుర్చీకే పరిమితం కాకూడదు. కమర్షియల్ బ్రేక్ సమయంలో లేచి తిరగాలి.
- రోజుకు 30 నుంచి 60 నిమిషాలు మితమైన, తీవ్రమైన వ్యాయామం చేయాలి. వారంలో ఐదు రోజులు వ్యాయామం తప్పనిసరి.
- రోజులో 8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి.

బ్లాక్ మెయిలింగ్‌లో సోమిరెడ్డి దిట్ట

- మద్యం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి
- ఎస్‌ఎస్‌జే డిస్టిలరీస్ సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే మొదలైంది
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడి డబ్బు సంపాదించడంలో సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దిట్ట అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు అధికారంలో ఉండటంతో దుప్పటి పరిచి మరీ తండ్రీ కొడుకులు వసూళ్లు చేస్తున్నారని చెప్పారు. శనివారం మీడియాతో కాకాణి మాట్లాడుతూ.. అసెంబ్లీలో నాలుగు మద్యం బ్రాండ్ల పేర్లు చెప్పడం కాదని, వాటికి ఎవరు అధికారంలో ఉన్నప్పుడు అనుమతులిచ్చారో సోమిరెడ్డి తెలుసుకోవాలని హితవు పలికారు. మద్యం వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ చేయిద్దామన్నారు. ధైర్యం ఉంటే తనపై చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో రుజువు చేయాలని సవాల్ చేశారు. ఎస్‌ఎస్‌జే డిస్టిలరీస్ గతంలో సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే మొదలైందని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సోమిరెడ్డి, ఆయన కుమారుడు చేస్తున్న అవినీతి, దందాలపై సీఎం చంద్రబాబు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కంటైనర్ టెర్మినల్‌పై తనపై ఆరోపణలు చేసిన సోమిరెడ్డి.. ఇప్పుడు అధికారంలో ఉండి ఏమి చేస్తున్నారని నిలదీశారు. వాళ్లతో డీల్ కుదరకే ఇంకా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. సీపీ ఆక్వా కంపెనీకి తాగు నీరు నిలిపివేయడం, ఓ కంపెనీ ఉద్యోగులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఓ ఆయిల్ కంపెనీ నుంచి టోల్‌కి అదనంగా ప్రత్యేక బిల్లులతో మరో రూ.800 వసూలు చేస్తూ సోమిరెడ్డి ఆఫీసుకు తరలిస్తున్నారని చెప్పారు. ట్యాంకర్‌కు రూ.4 వేలు, జెన్‌కో కాంట్రాక్టర్ల నుంచి నెలకు రూ.20 లక్షలు వసూలు చేస్తున్నారని చెప్పారు. తాను ఎప్పుడూ లేఅవుట్ల యజమానుల నుంచి వసూళ్లకు పాల్పడలేదని చెప్పారు. సోమిరెడ్డి, ఆయన కొడుకు నియోజకవర్గంలో ప్రతి లేఅవుట్ నుంచి వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. సూరాయపాళెం వద్ద సాగు, తాగునీరు ఇంకిపోకూడదనే ఇసుక రీచ్‌ల ఏర్పాటును అడ్డుకున్నానని చెప్పారు. సోమిరెడ్డి మాత్రం రైతుల శ్రేయస్సు వదిలేసి రూ.100 కోట్ల ఇసుక రవాణాకు స్కెచ్ వేశారని చెప్పారు. సోమిరెడ్డి గ్రావెల్ తవ్వకాలకు అనుమతులిచ్చి కోట్లు దండుకుంటున్నారన్నారు. అబద్ధపు శ్వేతపత్రాలతో చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చేస్తున్న అసత్య ఆరోపణలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్ని ఆధారాలతో గట్టిగా తిప్పికొట్టారని చెప్పారు.

45 రోజుల్లోనే బాబు అట్టర్ ఫ్లాప్

- హామీలు అమలుచేయలేక సీఎం చేతులెత్తేశారు
- సంపద లేదు.. సృష్టీ లేదు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయలేక సీఎం చంద్రబాబు చేతులెత్తేశారని.. ఈ విషయంలో ప్రజలు బయటకురాకుండా, ప్రశ్నించకుండా ఉండేందుకు వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ హత్యా రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. 45 రోజుల్లోనే బాబు అట్టర్ ఫ్లాప్ అయిన ముఖ్యమంత్రిగా ప్రజల దృష్టిలో మిగిలిపోయారని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడూ లేనివిధంగా ఈసారి చంద్రబాబు సీఎం అయ్యాక మాయల పకీరు అవతారమెత్తారని.. గాల్లో సంపదను సృష్టించటం.. గాల్లోనే మింగేయడం చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంపద ఉండదు.. సృష్టి ఉండదని.. అంతా మాటలతో కాలం గడిపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా చేసి తన ఇష్టానుసారంగా నోటికేది వస్తే అది చంద్రబాబు మాట్లాడేశారని టీడీపీ సభ్యులే బయటకు వచ్చి అంటున్నారని చంద్రశేఖర్ చెప్పారు. ఇచ్చిన హామీలు ఎలా అమలుచేద్దాం, ప్రజల నమ్మకాన్ని ఎలా నిలబెట్టుకుందాం అనే విషయాలపై చర్చించకుండా జగన్నామస్మరణ చేశారని చంద్రశేఖర్ మండిపడ్డారు. ఇలా ఈ ఐదేళ్లు జగన్నామస్మరణ చేసి తిరిగి 2029లో మళ్లీ జగన్ చేతుల్లో పెట్టే పరిస్థితికి వచ్చేటట్లున్నారని టీడీపీ ఎమ్మెల్యేలే అంతర్గతంగా చర్చించుకుంటున్నారని ఆయన చెప్పారు.

బడ్జెట్ పెట్టే ధైర్యం బాబుకు లేదు..

ఇక ఎక్కడైనా కొత్త ప్రభుత్వం ఏర్పడితే, బడ్జెట్ ప్రవేశపెడుతుందని.. కానీ, ఈ ప్రభుత్వం, ఏడునెలల కోసం కూడా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడంలేదని ఆరోపించారు. రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెట్టే ధైర్యం కూడా చంద్రబాబుకు లేదన్నారు. కారణం.. రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెడితే ఎన్నికల్లో తన మోసపూరిత హామీలకు సంబంధించి కేటాయింపులను అందులో చూపాల్సి ఉంటుందని.. కానీ, అలా చూపే పరిస్థితి చంద్రబాబుకు లేదన్నారు. ఆయనిచ్చే హామీలను చిత్తశుద్ధితో అమలుచేసే అలవాటు లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఇక నాడు రాష్ట్రావసరాల కోసం వైఎస్ జగన్ అప్పులు చేస్తే.. అప్పులతోనే నెట్టుకొస్తున్నారంటూ నిత్యం ఆరోపణలు చేసిన ఎల్లో మీడియా, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అదే పనిచేస్తున్నా నోరు విప్పడంలేదని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

బడ్జెట్‌కు ఎందుకు వెనకాడుతున్నారు?

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ ధ్వజం
- దమ్ముంటే శ్వేతపత్రాలపై చర్చకు రావాలి



పటమట (విజయవాడ పశ్చిమ): కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని, మరి రాష్ట్రంలో బడ్జెట్ ఎందుకు ప్రవేశపెట్టలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ ప్రశ్నించారు. శనివారం ఆయన ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్ ఎందుకు పెట్టడంలేదో రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నించాలన్నారు. చంద్రబాబు సమర్థుడని పవన్‌కళ్యాణ్ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారని, 40 ఏళ్ల అనుభవం ఉన్న నేత బడ్జెట్ ఎందుకు పెట్టలేకపోయారో రాష్ట్ర ప్రజలకు పవన్ చెప్పాలన్నారు. అసెంబ్లీలో కూటమి విడుదల చేసిన ప్రతి శ్వేతపత్రానికి వాస్తవ గణాంకాలతో సహా ప్రెస్‌మీట్ పెట్టి మరీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారన్నారు. దమ్ముంటే వాటిపై చర్చకు రావాలన్నారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి రాకుండా ఢిల్లీకి ఎందుకు వెళ్లారు అని అంటున్నారని, ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితిని కల్పించింది చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లేనని స్పష్టం చేశారు. రెడ్‌బుక్ పేరుతో హత్యలు, అరాచకాలు చేస్తుంటే అసెంబ్లీకొచ్చి మీ ప్రవచనాలు, మీ పరస్పర పొగడ్తలు వినాలా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌లకు దమ్ముంటే వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని, అప్పుడు ఆయన సత్తా ఏమిటో అసెంబ్లీలో తెలుస్తుందని చెప్పారు. ఒక్క పథకానికి కూడా విధివిధానాలు ఖరారు చేయలేని కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ప్రజలకు అర్థమైందన్నారు. మహిళల మీద అఘాయిత్యాలు జరిగాయని గతంలో గొంతు పగిలేలాగా విమర్శించిన పవన్ ఇప్పుడు సుగాలి ప్రీతి కేసుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

పట్టాలు తప్పిన మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్

విశాఖలో ప్లాట్‌ఫారంపైకి వస్తున్న సమయంలో ఘటన



కోచింగ్ కాంప్లెక్స్ నుంచి వస్తున్న సమయంలో పట్టాలు తప్పిన విశాఖ - మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం ట్రాక్ మారుతున్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పట్టాలు తప్పింది. ఇక్కడి న్యూ కోచింగ్ కాంప్లెక్స్ నుంచి ప్లాట్‌ఫారం మీదకు రైలు వచ్చే మార్గంలో ఈ ఘటన జరగడంతో రెండు గంటలు ఆలస్యంగా రైలు బయలుదేరింది. వాస్తవానికి ఈ రైలు విశాఖలో సాయంత్రం 6.40 గంటలకు బయల్దేరాల్సి ఉంది. ఈ రైలు పట్టాలు తప్పిన ఘటనతో విశాఖ నుంచి బయల్దేరాల్సిన విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ కూడా సుమారు గంట ఆలస్యంగా బయల్దేరింది.

గోదావరి మళ్లీ ఉగ్రరూపం

పోలవరం ప్రాజెక్టు 48 గేట్లు పూర్తిగా ఎత్తివేత.. 11.87 లక్షల క్యూసెక్కులు దిగువకు



అల్లూరి జిల్లా గన్నవరంలోని పునరావాస కేంద్రానికి సామగ్రితో వెళుతున్న ముంపు బాధితులు

ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 13.29 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

రెండో ప్రమాద హెచ్చరిక జారీ

నేడు ప్రమాదకర స్థాయిలో గోదావరి ప్రవహిస్తుందని సీడబ్ల్యూసీ హెచ్చరిక



కోనసీమ జిల్లా బూరుగులంక రేవులో పడవ ఎక్కుతున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. శనివారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 14,36,573 క్యూసెక్కుల వరద ప్రవాహంతో నీటి మట్టం 53.2 అడుగులకు చేరుకుంది. దాంతో అక్కడ మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. (గోదావరి చరిత్రలో 1986 ఆగస్టు 16న భద్రాచలం వద్దకు గరిష్టంగా 27.02 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు నీటి మట్టం 75.6 అడుగులుగా నమోదైంది). కూనవరం వద్ద శబరి ఉధృతి మరింత పెరిగింది. నీటి మట్టం 41.35 మీటర్ల (సముద్ర మట్టానికి)కు చేరుకోవడంతో కూనవరం వద్ద అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం 6 గంటలకు 11,87,497 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో 48 గేట్ల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో పోలవరం స్పిల్ వే ఎగువన నీటి మట్టం 33.5 మీటర్లకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 13,29,774 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కులను వదులుతూ మిగులుగా ఉన్న 13,20,274 క్యూసెక్కులను 175 గేట్లు పూర్తిగా ఎత్తేసి సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 14 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్య గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఆదివారం కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం బ్యారేజ్ వరకు గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుందని బేసిన్ పరిధిలోని రాష్ట్రాలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అప్రమత్తం చేసింది.

నీట మునిగిన రహదారులు

- గోదావరికి భారీగా వరద నీరు చేరుతుండటంతో ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లోని పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అంతర్గత రహదారులు నీట మునిగాయి.
- ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం నుంచి బూర్గంపాడుకు వెళ్లే రహదారులు పలు చోట్ల వరద నీట మునిగి రాకపోకలు స్తంభించాయి. వెంకటాపురం నుంచి తిమ్మంపేట వెళ్లే రహదారి వరద నీటితో నిండిపోయింది. వరద పెరిగితే కుక్కునూరు నుంచి అశ్వారావుపేట వెళ్లే రహదారి సైతం నీట మునిగే అవకాశం ఉంది. పలు గ్రామాల్లో పంట చేలను ముంచెత్తింది. పలు గ్రామాల్లో ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.
- తూర్పు గోదావరి జిల్లాలోని తాళ్లపూడి, పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో పంటలు నీట మునిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అప్పనపల్లి, ఎదురుబిడెం, కనకాయలంక కాజ్‌వేలపై వరద నీరు ప్రవహిస్తోంది. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో వరద ప్రభావం అధికంగా ఉంది. మలికిపురం, సఖినేటిపల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కె.గంగవరం మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.
- పలు డ్రెయిన్ల నుంచి ముంపు నీరు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ద్వారా గౌతమి, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ట గోదావరి నదీపాయల ద్వారా దిగాల్సి ఉంది. అయితే గోదావరి వరదతో స్లూయిజ్‌ల గేట్లు మూసుకుపోయాయి. దీంతో డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో 4,151 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ఈ నష్టం మరింత పెరగనుందని రైతులు వాపోతున్నారు.



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద గోదావరి ఉధృతి



చింతూరు మండలం చట్టి వద్ద వరద నీటిని దాటుతున్న వ్యక్తి



చింతూరులోని టోల్‌గేట్ ప్రాంతంలో ఇంటిలోకి చేరిన వరదనీరు

వరద నష్టం లేనిచోట మంత్రుల పర్యటన

వేలేరుపాడు/తణుకు టౌన్: పెద్దవాగు ప్రవాహం వల్ల తమ ఇళ్లు కొట్టుకుపోయి సర్వస్వం కోల్పోయిన వరద బాధితుల గ్రామాల్లో పర్యటించాల్సిన నలుగురు రాష్ట్ర మంత్రులు ఏ నష్టం జరగని ప్రాంతాల్లో శనివారం పర్యటించడం పట్ల జనం విస్తుపోతున్నారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని మేడేపల్లి, కమ్మరిగూడెం, అల్లూరినగర్, ఒంటిబండ, కోయమాధారం, రాళ్లపూడి, రామవరం, ఉదయ్‌నగర్, ఊటగుంపు, యిప్పలగుంపు, సొందే గొల్లగూడెం, వసంతవాడ, మద్దిగట్ల, పాత పూచిరాల తదితర గ్రామాల్లో ఈ నెల 18న పెద్దవాగు ఆనకట్ట తెగిపోవడంతో 12 గ్రామాల్లో 513 ఇళ్లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఆయా గ్రామాల బాధితులు సర్వస్వం కోల్పోయారు. ఈ గ్రామాల్లో పర్యటించకుండా ఏ సమస్యలూ లేని కన్నాయిగుట్టను సందర్శించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొలుసు పార్థసారథి శనివారం ఆ ప్రాంతంలో పర్యటించారు. జల దిగ్బంధంలో ఉన్న తిర్లాపురం గ్రామానికి వెళ్లకుండానే కన్నాయిగుట్ట వద్ద గోదావరిని పరిశీలించి వెనుదిరిగారు. ఆ తర్వాత శివకాశీపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో భోజనం చేసి, వరదపై తూతూమంత్రంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం తణుకు మండలం దువ్వలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు.

కృష్ణా, తుంగభద్ర పోటాపోటీ

- శ్రీశైలం ప్రాజెక్టులోకి గంట గంటకూ పెరుగుతున్న వరద
- నాగార్జునసాగర్‌కు 52,599 క్యూసెక్కుల ప్రవాహం.. 127.97 టీఎంసీలకు చేరిన నిల్వ
- తుంగభద్ర డ్యామ్ నుంచి 1.58 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల
- నేడు శ్రీశైలానికి మరింత వరద పెరిగే అవకాశం

సాక్షి, అమరావతి/హొసపేటి/శ్రీశైలం ప్రాజెక్ట్: కృష్ణా, ప్రధాన ఉప నది తుంగభద్ర పోటాపోటీగా వరదెత్తుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు జూరాల నుంచి 3.12 లక్షల క్యూసెక్కుల కృష్ణా జలాలు.. సుంకేశుల నుంచి 99,736 క్యూసెక్కుల తుంగభద్ర జలాలు వెరసి శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,12,280 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 866.4 అడుగుల్లో 127.59 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు కుడి కేంద్రంలో ఏపీ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 18,480 క్యూసెక్కులు.. ఎడమ గట్టు కేంద్రంలో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులను దిగువకు వదులుతోంది. కృష్ణా, తుంగభద్రల నుంచి భారీ వరద వస్తుండటంతో సోమ లేదా మంగళవారం ప్రాజెక్టు గేట్లు ఎత్తేయనున్నారు. నాగార్జునసాగర్‌లోకి 52,599 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 507.80 అడుగుల్లో 127.97 టీఎంసీలకు చేరుకుంది. కృష్ణా ప్రధాన పాయలో ఉధృతి మరింత పెరిగింది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్రలో ఉధృతి మరింత పెరిగింది. డ్యామ్‌లోకి 1.21 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో.. మొత్తం 33 గేట్లు ఎత్తేసి, విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 1.58 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. దాంతో మంత్రాలయం వద్ద తుంగభద్ర ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. వరద మట్టం 311.25 మీటర్లు(సముద్రమట్టానికి)కు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సుంకేశుల బ్యారేజ్‌లోకి 1,02,100 క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులు వదులుతూ గేట్లు ఎత్తి దిగువకు 99,736 క్యూసెక్కులను వదిలేస్తున్నారు. దీంతో ఆదివారం శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింత పెరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి.



కర్ణాటకలోని హొసపేటి వద్ద తుంగభద్ర జలాశయం నుంచి విడుదల అవుతున్న జలాలు



తండా నుంచి ఐఐటీ దాకా...

మధులత

ఈ ఫొటో చూడండి...

దారి కూడా సరిగ్గా లేని ఒక మారుమూల గిరిజన తండా. అబ్బాయిల సంగతి ఎలా ఉన్నా తండా దాటి పై చదువులకు వెళ్లడం అనేది అమ్మాయిలకు అంత సులువేమీ కాదు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని గోన్యానాయక్ తండాకు చెందిన బదావత్ రాములు, సరోజ దంపతులు 'మా అమ్మాయి చదివింది' చాలు అని ఎప్పుడూ రాజీ పడలేదు.

'నువ్వు ఎంత పెద్ద చదువు చదివితే మాకు అంత సంతోషం' అనేవాళ్లు తమ కూతురు మధులతతో. ఈ మాటలు మధులతకు బలమైన టానిక్‌లా పనిచేశాయి. 'ఏదో ఒకటి సాధించి తల్లిదండ్రుల కలను నిజం చేయాలి' అని బలంగా అనుకునేలా చేశాయి. రాములు, సరోజ దంపతుల చిన్న కూతురు మధులత. పెద్ద కూతురు మంజుల, రెండో కూతురు మమతను డిగ్రీ వరకు చదివించారు. మూడో తరగతి వరకు వీర్నపల్లి సర్కారు బడిలో చదివిన మధులత నాలుగో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సిరిసిల్ల సంక్షేమ హాస్టల్లో ఉంటూ గీతానగర్ జిల్లా పరిషత్ స్కూల్‌లో చదువుకుంది. సారంపల్లి గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో తొమ్మిది నుంచి పదవ తరగతి వరకు చదువుకుంది. ఇంటర్‌మీడియట్‌లో 939/1000 మార్కులు సాధించింది. ఇంటర్‌మీడియట్‌లో మంచి మార్కులు రావడంతో తన మీద తనకు నమ్మకం బలపడింది. ఆ నమ్మకం వృథా పోలేదు. అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటిగా భావించే జేఈఈ (అడ్వాన్స్‌డ్)లో ఆల్ ఇండియా స్థాయిలో 824 ర్యాంకు సాధించింది. మధులతకు సంబంధించి ఇదొక అపురూప విజయం. ఎందుకంటే...ఆమె కుటుంబ నేపథ్యం. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, పేదవాళ్లు.

'మా బిడ్డ గొప్ప చదువులు చదువుతుంది' అనే నమ్మకం తప్ప వారి దగ్గర ఏమీ లేదు. అయితే తల్లిదండ్రుల ప్రోత్సాహం, తన మీద పెట్టుకున్న ఆశలు మధులతను ముందుకు నడిపించాయి. 'నీ దగ్గర లేని దాని గురించి ఆలోచించకు. ఉన్న దాని గురించి దృష్టి పెట్టు' హైస్కూల్ రోజుల్లో తాను చదివిన మంచి మాట మధులతకు బాగా గుర్తుండి పోయింది. పేదరికం తప్ప తన దగ్గర ధనం లేకపోవచ్చు. కాని విద్య రూపంలో విలువైన నిధి ఉంది. ఆ నిధి పైనే ప్రత్యేక దృష్టి పెట్టింది మధులత. ఏదో సాధించాలనే తపనతో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు.

ఖరీదైన కోచింగ్‌లు లేకపోయినా సొంతంగా ఆల్ ఇండియా స్థాయిలో 'జేఈఈ'లో ర్యాంక్ తెచ్చుకునేలా చేసింది. పట్నా ఐఐటీలో సీటు సాధించిన మధులతకు ఉన్నత చదువుపై ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఆమెను ఇంటికే పరిమితం అయ్యేలా చేశాయి. ఇక ఏమీ చేయలేక, పై చదువులకు వెళ్లలేక తండాలో మేకలు కాయడం మొదలుపెట్టింది మధులత. మధులత దీన పరిస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన 'ఐఐటీకి వెళ్లలేక మేకల కాపరిగా' కథనం చూసి స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి మధులత చదువుకు అయ్యే ఖర్చులు మొత్తం భరిస్తామని ప్రకటించారు.

- పూరడి మల్లికార్జున్, 'సాక్షి' సిరిసిల్ల
- ఫొటోలు: **వంకాయల శ్రీకాంత్**



ఆరోజు ఎంత బాధ పడ్డానో!

'చదివించింది చాలు. ఎందుకంత కష్టపడతావు' అనే వాళ్లు కొందరు. అయితే మధు మీద మాకు చాలా నమ్మకం. చదువు తనకు ప్రాణం. పట్నంలో ఎప్పుడైనా పెద్ద ఆఫీసర్ అమ్మలను చూసినప్పుడు వారిలో నా బిడ్డే కనిపించేది. ఏదో ఒకరోజు నా బిడ్డను ఇలా గొప్పగా చూస్తాను అనుకునేవాడిని. డబ్బులు లేక, పై చదువుకు పట్నాకు వెళ్లలేక మధు ఇంట్లోనే ఉండిపోవాల్సి రావడం నాకు చాలా బాధగా ఉండేది. చదువు ఇచ్చిన దేవుడు దారి చూడడా! అనుకునే వాడిని. దేవుడు దయ తలిచాడు.

- బదావత్ రాములు, మధులత తండ్రి



చదువే లోకం...

నా బిడ్డకు చదువే లోకం. సెలవులకు వస్తే కూడా చదువుకొనుడు లేదా మా మేకలతో వెళ్లేది. మా తండాకు తొవ్వ కూడా లేదు. ఇప్పుడు మా బిడ్డకు ర్యాంకు వచ్చిందని మండల అధికారులు మా ఇల్లు వెతుక్కుంటూ రావడం సంతోషంగా ఉంది. మా బిడ్డ బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేయాలని ఆశపడుతున్నా.

- సరోజ, మధులత తల్లి

నేడు పేరెంట్స్ డే

దారి చూపే దివిటీలు

పిల్లల కంటే ముందే వారి కలలు తల్లిదండ్రులు కంటారు. 'నేను సాధించగలను' అని పిల్లలు అనుకోవడానికి ముందే 'మా పిల్లలు సాధించగలరు' అనే బలమైన నమ్మకం తల్లిదండ్రులకు కలుగుతుంది. తమ పిల్లలను పై స్థాయిలో చూడాలని కలలు కంటారు. కేవలం కలలకే పరిమితం కాకుండా 'పిల్లల కోసమే మా జీవితం' అన్నట్లుగా కష్టపడతారు. ఆ నిబద్ధతే ఎంతోమంది పిల్లలు విజేతలుగా నిలవడానికి కారణం అవుతుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే తల్లిదండ్రులు పిల్లల్ని తీర్చిదిద్దే శిల్పులు. వారి భవిష్యత్ చిత్రపటాన్ని అందంగా మలిచే చిత్రకారులు.

గోదావరి తీరం నుంచి ఒలింపిక్స్ దాకా...



తండ్రితో...

జ్యోతిక శ్రీ దండి భారతీయ క్రీడాకారిణి. మహిళల 400 మీ. పరుగులో జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో 4 x 400 భారత మహిళల రిలే జట్టులో భాగంగా పాల్గొంటోంది. స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తణుకు. జ్యోతిక ఇప్పటి వరకు రెండు అంతర్జాతీయ పతకాలు, ఆరు జాతీయ పతకాలు సాధించింది.

అయినా సరే... వెనుకంజ వేయనివ్వలేదు...

మేం ఐరన్‌కి సంబంధించిన వర్క్స్ చేస్తాం. జ్యోతిక చిన్నప్పుడు స్థానికంగా జరిగే రన్నింగ్ పోటీలు చూసి, తనూ ఉత్సాహం చూపేది. తన ఆసక్తి చూసి, కోచ్ దగ్గర చేర్చాం. అలా క్రీడలవైపు ప్రోత్సహించాం. 2013లో స్థానికంగా జరిగే పోటీలో పాల్గొంది. అక్కణ్నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటూ వచ్చింది. పాల్గొన్న ప్రతి పోటీలో విజేతగా నిలిచింది. వరల్డ్ కాంపిటిషన్స్‌కి స్కూల్ రోజుల్లోనే వెళ్లింది. టర్కీకి వెళ్లినప్పుడు లక్ష రూపాయలు తప్పనిసరి అన్నారు. అప్పుడు స్థానిక ఎమ్మెల్యే సపోర్ట్ చేశారు. ఇంటర్మీడియట్‌లో మంచి గ్రేడ్ వచ్చింది. చదువును కొనసాగిస్తూనే, ఉద్యోగం తెచ్చుకుంటాను అంది. కానీ, స్పోర్ట్స్‌లోనే ఉండమని, అదే మంచి భవిష్యత్తును ఇస్తుంది అని చెప్పాను. విజయవాడలోని అకాడమిలో నాలుగేళ్లు, హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అకాడమీలో రెండేళ్లు ఉంది. ఆర్థికంగా ఇబ్బందులు వచ్చినా తన పట్టుదల నన్ను వెనుకంజ వేయనివ్వలేదు. రెండేళ్లుగా ఇండియన్ క్యాంపులో ఉండటం వల్ల నాకు కొంచెం వెసులు బాటు వచ్చింది. ఇప్పుడు ఒలింపిక్స్‌లో తన సత్తా చాటడానికి వెళ్లింది. ఇన్నాళ్ల కృషికి తగిన ఫలితం నేడు చూస్తున్నాం. స్పోర్ట్స్‌లో రాణిస్తూనే డిగ్రీ చదువుతోంది. స్పిరిచ్యువల్ ఆర్ట్స్ వేస్తుంది.దేశానికి పతకం తీసుకురావాలనే లక్ష్య సాధన కోసమే కృషి చేస్తోంది.

- దండి శ్రీనివాసరావు, జ్యోతిక శ్రీ తండ్రి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా



పిల్లల లక్ష్యం కోసం...

మాకు ఇద్దరు కూతుళ్లు. చిన్నప్పుడు జ్యోతిక పరుగు మొదలు పెట్టినప్పుడు ఊళ్లో మాకో బిల్డింగ్ ఉండేది. పిల్లల లక్ష్యాల కోసం ఆ బిల్డింగ్ అమ్మి ఖర్చు పెడుతూ వచ్చాం. పిల్లలే మాకు బిల్డింగ్ అనుకున్నాం. స్పోర్ట్స్ అంటే మంచి పోషకాహారం, ఫిట్‌నెస్, ట్రయినింగ్ ఉండాలి. ఖర్చు అని చూసుకోలేదు.

- లక్ష్మీ నాగ వెంకటేశ్వరి, జ్యోతిక శ్రీ తల్లి



● వెనిజులా ప్రతిపక్ష నేత మరియ కొరీనా మచాదో

నాటి ఈగే నేటి డేగ!

వెనిజులా వేగుచుక్క మరియ

పన్నెండేళ్ల క్రితం ఓ రోజు – వెనిజులా నేషనల్ అసెంబ్లీలో ఆ దేశ అధ్యక్షుడు హ్యూగో చావెజ్.. దూకుడు మీదున్న దేశ పురోగతి గురించి గంభీరంగా ప్రసంగిస్తూ ఉన్నారు. స్వపక్షాలు, విపక్షాలు భయభక్తులతో వింటూ ఉన్నాయి. అంతలో అపోజిషన్ బెంచీల నుంచి మరియ కొరీనా మచాదో లేచి నిలబడి, ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు! ''మీ విధానాలు నిజంగా బాగున్నాయనే మీరు అనుకుంటున్నారా?'' అని ఆమె ప్రశ్నించారు. ఆ మాటకు చావెజ్ ఆమె వైపు డిస్టర్బ్ అయిన సింహంలా తలతిప్పి చూశారు. తీవ్రమైన ఆగ్రహంతో, అసహనంతో.. ''ఈగను డేగ వేటాడదు.. కూర్చో'' అని పెద్దగా అరిచారు. దానర్థం 'నువ్వో పిపీలికం. నీకు నేను సమాధానం చెప్పటం ఏమిటి!'' అని.

చావెజ్ ఇప్పుడు లేరు. పదకొండేళ్ల క్రితమే ఆయన మరణించారు. ఆ ఈగ మాత్రం ఇప్పుడు డేగ అయింది! చావెజ్ మరణించిన నాటి నుంచి రెండు దశాబ్దాలుగా వెనిజులాను పాలిస్తూ ఆ సంపన్న దేశాన్ని తన నియంతృత్వ పోకడలతో బికారిగా మార్చిన నికొలస్ మెరోరోస్‌ను తాజా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డేగలా వేటాడి వేటాడి, ఆ సామ్యవాద సింహానికి కంట కునుకు లేకుండా చేసింది.

ప్రజలు ఆమె వెన్నంటి...

తెల్లని దుస్తులు. మెడలో జపమాల. ఆత్మ విశ్వాసపు చిరునవ్వు. రోజంతా ప్రయాణం. సొట్టలు పడిన కారు పైభాగంలోనే నిలుచుని, ఎక్కడికక్కడ ప్రజల్ని ఉద్దేశించి ఆత్మీయంగా నాలుగు మాటలు. ప్రజల దగ్గరకు ఆమె వెళ్లటం అటుంచి, ప్రజలే ఆమె వెన్నంటి నడవటం. ఆమె వైపు చెయ్యందివ్వటం. మహిళలు ఆమె దోసిళ్లలో తలపెట్టి రోదించటం. కాపాడమని పురుషులు ఆమెను ప్రాధేయపడటం. రోడ్లు కిక్కిరిసిపోవటం. ఆమె మాట కోసం, ఆమె చూపు కోసం ఒకర్నొకరు తోసుకోవటం. ఒక యువకుడైతే తను గీసిన ఆమె చిత్రాన్ని అందివ్వటం. ఫ్రేమ్ లేని ఆ చిత్ర పటంలో ఆమె భుజాల చుట్టూ వెనిజులా జాతీయ జెండా. జెండాతో పాటుగా జీసెస్ చేతుల్లో సురక్షితంగా ఆమె.

''మరియా.. మాకు సహాయం చేయండి''.. గుంపులోంచి ఒక ఉద్వేగం.

56 ఏళ్ల మరియ కొరీనా మచాదో ఇప్పుడు వెనిజులా వేగుచుక్క. అధికార పక్షం గుండెల్లో పిడిబాకు. ఈ కొద్ది నెలల్లోనే ఒక ఉద్యమకారిణిగా, వెనిజులాకొక ఆశాదీపంలా అవతరించారు వెనిజులా విపక్ష నేత మరియ. ఆమె సారథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇళ్లలోంచి బయటికి వచ్చిన వేలాది మంది.. నేడు జరుగుతున్న వెనిజులా అధ్యక్ష ఎన్నికల బ్యాలట్‌ల వైపు లక్షలాదిగా కదులుతున్నారు. నిరంకుశ సామ్యవాద అధ్యక్షుడు నికోలస్ మదురోను ఓడించటమే వారి లక్ష్యం. అయితే ఈ ఎన్నికల్లో మరియ పోటీ చేయటం లేదు. తన తరఫున అంతగా ఎవరికీ తెలియని మాజీ దౌత్యవేత్త ఎడ్మండో గొంజాలెజ్‌ను నికోలస్‌కు వ్యతిరేకంగా నిలబెట్టారు మరియ. గొంజాలెజ్ గెలిస్తే మరియ గెలిచినట్లే. నికోలస్ ఓడిపోతే మరియ చేతుల్లో అతడు ఓడిపోయినట్లే. మరియకు గత ఏడాది జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో 93 శాతం ఓట్లు రావటం చూసి అధ్యక్ష ఎన్నికల్లో తన అపజయాన్ని శంకించిన అధ్యక్షుడు నికోలస్ వెనువెంటనే ఆమెపై ఆరోపణలు మోపి, సుప్రీం కోర్టు ద్వారా ఆమెను ఈ ఎన్నికలకు అనర్హురాలిని చేయించారు.

పిల్లలకు దూరంగా...

కుటుంబానికి ప్రాణహాని ఉందంటే పోరాటాన్ని తీసి పొయ్యిలో పడేస్తారు ఎవరైనా. కానీ మరియ తన పోరాటం ఆపలేదు. ప్రజలే తన కుటుంబం అనుకున్నారు. తన ముగ్గురు పిల్లల్ని – ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి – వారి భద్రత కోసం విదేశాలకు పంపించారు. వారు అమెరికాలో ఉన్నారని, కాదు బ్రిటన్‌లో ఉన్నారని అనుకోవటమే కానీ కచ్చితంగా ఏ దేశంలో ఉన్నారన్నది ఆమెకు తప్ప ఎవరికీ తెలియదు. ఈ పోరాటాల పోరు పడలేకే భర్త ఆమెతో విడిపోయారని అంటారు.

మరియ తండ్రి వెనిజులా రాజధాని కరాకస్‌లో పేరున్న స్టీల్ బిజినెస్‌మన్. మరియ పుట్టింది కారకస్‌లోనే. మరియ తల్లి సైకాలజిస్ట్. మొత్తం నలుగురు ఆడపిల్లల్లో మరియ పెద్దమ్మాయి. మరియ పూర్తి పేరు మరియ కొరీనా మచాదో పరిస్కా. తండ్రి పేరులోని మచాదో, తల్లి పేరులోని కొరీనా పరిస్కా కలిసి వచ్చేలా ఆమెకు ఆ పేరు పెట్టారు. మరియ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ చేశారు. కరాకస్‌లోని వీధి బాలల కోసం 1992లో ఒక అనాథాశ్రమం నెలకొల్పారు. 2002లో జాయిన్ అప్ అని అర్థం వచ్చేలా 'సూమేట్' అనే వాలంటీర్‌ల వ్యవస్థను ప్రారంభించారు. రాజకీయ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకోవటం, ప్రజా ప్రయోజన విషయాల మీద చర్చ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటుంది ఆ సంస్థ.

కేసులు.. భౌతిక దాడులు

మరియకు వెల్లువెత్తుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక గతవారమే వెనిజులా ప్రభుత్వం మరియ అంగరక్షకుల్ని తొలగించింది. ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిని చేయటం, అంగరక్షకుల్ని ఉపసంహరించు కోవటం.. ఇవేకాదు, నికొలస్ గత పదేళ్లుగా మరియాకు వ్యతిరేకంగా అనేక కేసులు పెట్టించారు. కోర్టుకు ఈడ్చారు. భౌతిక దాడులు చేయించారు. అయినా ఆమె వెనకంజ వేయలేదు. నికొలస్ ఆర్థిక విధానాలతో నిరుపేద దేశంగా మారిన ఈ చమురు నిక్షేపాల సంపన్న దేశాన్ని ఒడ్డున పడేయటానికి ప్రభుత్వంతో పెద్ద యుద్ధమే చేస్తున్నారు మరియ.

సినిమా

సినిమాలో కథను ఎవరు లీడ్ చేస్తే వాళ్లే ఆ కథకు నాయకులవుతారు. అది హీరో కావొచ్చు... హీరోయిన్ కావొచ్చు. హీరోలు లీడ్ చేసే కథలు ఏడాదికి ఓ వంద వస్తే... హీరోయిన్లు లీడ్ చేసే కథలు ఓ ఇరవై ఉంటాయేమో. అంటే... హీరోయిన్లకు అరుదైన అవకాశం అన్నమాట. అందుకే ఇలాంటి అవకాశం రాగానే అందిపుచ్చుకుంటారు. ప్రస్తుతం హిందీలో అలా కథకు హీరోగా మారిన కథా'నాయిక'లు చేస్తున్న చిత్రాలు, వెబ్ సిరీస్‌ల గురించి తెలుసుకుందాం.

కథానాయక



● ఆలియా భట్

సూపర్ ఏజెంట్స్

బాలీవుడ్‌లో స్పై క్యారెక్టర్స్ చేసి ప్రేక్షకులను మెప్పించిన కథానాయికల్లో ఆలియా భట్ ఒకరు. 'రాజీ' (2018) మూవీలో స్పైగా ఆలియా భట్ నటన ఆడియన్స్‌ను ఎంతగానో మెప్పించింది. ఆరేళ్లకు మళ్లీ పూర్తి స్థాయి స్పై క్యారెక్టర్‌కు ఆలియా భట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి 'ఆల్ఫా' అనే టైటిల్ ఖరారు చేశారు. అయితే 'రాజీ' సినిమాలో కాస్త కూల్‌గా ఉండే స్పైగా కనిపించిన ఆలియా 'ఆల్ఫా'లో మాత్రం అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లు చేసి, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేసే స్పైగా నటిస్తున్నారు. ఆలియా భట్‌కు తోడుగా మరో హీరోయిన్ శార్వరీ ఉంటారు. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌లకు ఎంత ప్రాధాన్యం ఉందంటే... దాదాపు రెండు నెలలకు పైగా ఆలియా, శార్వరి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ ఇద్దరు సూపర్ ఏజెంట్స్ చేసే ఫైట్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురి చేసే విధంగా ఉంటాయట. 'ధూమ్ 3' సినిమాకు దర్శకత్వ విభాగంలో చేసి, ఆ తర్వాత 'ది రైల్వే మేన్' వెబ్ సిరీస్‌తో దర్శకుడిగా తన సత్తా నిరూపించుకున్న శివ్ రావేల్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 'వై ఆర్‌ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యానివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న ఈ 'ఆల్ఫా' చిత్రం ఏడాది థియేటర్లకు రానుంది.



● కాజోల్

పోలీస్ వర్సెస్ సైకో

ఓ పోలీస్, ఓ సైకో మధ్య పోటాపోటీగా సాగే మైండ్ గేమ్‌తో గతంలో కొన్ని సినిమాలు వచ్చాయి. తాజాగా ఇలాంటి మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో కాజోల్, కృతీ సనన్ నటించారు. 'దో పత్తీ' టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాతో శశాంక్ చతుర్వేది దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆల్రెడీ చిత్రీకరణ ముగిసింది. ఇటీవల టీజర్‌ను కూడా విడుదల చేశారు. నార్త్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సైకో థ్రిల్లర్ మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా కాజోల్, సైకో పాత్రలో కృతీసనన్ కనిపిస్తారు. అంతేకాదు... ఈ సినిమాకు ఓ నిర్మాతగా కూడా ఉన్నారు కృతీ సనన్. మరో ఆసక్తికర విషయం ఏంటంటే... 'దిల్‌వాలే' (2015)లో స్క్రీన్ షేర్ చేసుకున్న కాజోల్, కృతి తొమ్మిదేళ్లకు 'దో పత్తీ'లో కలిసి నటించారు. ఈ చిత్రం త్వరలోనే నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.



● కృతీ సనన్ ● ప్రియాంక



● కత్రినా కైఫ్

రోడ్ ట్రిప్

ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్ లీడ్ రోల్స్‌లో నటించాల్సిన చిత్రం 'జీ లే జర'. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా ప్రకటన వచ్చి దాదాపు మూడేళ్లు అవుతున్నా సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో ఈ చిత్రం ఆగిపోయిందనే వార్తలు వచ్చాయి. కానీ 'జీ లే జర' చిత్రీకరణ లేట్ అవుతున్న మాట వాస్తవమే అని, అయితే ఆగిపోలేదని, రణ్‌వీర్ సింగ్‌తో 'డాన్ 3' తీసిన తర్వాత ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకువెళ్తానని ఇటీవల ఫర్హాన్ అక్తర్ పేర్కొన్నారు. ఒకరితో ఒకరికి పరిచయం లేని ముగ్గురు మహిళల రోడ్ ట్రిప్ నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుందని టాక్.



● సోనాక్షీ సిన్హా ● అదితీరావు హైదరీ

లాహోర్ టు ముంబై

ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ తీసిన తొలి వెబ్ సిరీస్ 'హీరామండి: ది డైమండ్ బజార్'. మనీషా కోయిరాల, సోనాక్షీ సిన్హా, అదితీరావ్ హైదరీ, రిచా చద్దా, సంజీదా షేక్, షర్మిన్ సెగల్ లీడ్ రోల్స్‌లో నటించారు. 2024 మే 1 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తొలి సీజన్‌కు వీక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో రెండో సీజన్‌ను ప్రకటించారు భన్సాలీ. తొలి సీజన్‌లో ఉన్న వారితో పాటు రెండో సీజన్‌లో మరికొంతమంది హీరోయిన్స్ యాడ్ అవుతారట. దేశ విభజన సమయంలో లాహోర్‌లోని మెజారిటీ వేశ్యలు ముంబై, కోల్‌కతా వెళ్లి స్థిరపడతారు. వారు సినిమా ఇండస్ట్రీకి ఎలా వచ్చారు? సినీ ఇండస్ట్రీని ఏ విధంగా ప్రభావితం చేశారు? అనే కోణాల్లో 'హీరామండి' సెకండ్ సీజన్ ఉంటుంది.



● కీర్తి సురేష్

రివెంజ్

కీర్తి సురేష్, రాధికా ఆప్టే లీడ్ రోల్స్‌లో 'అక్క' అనే రివెంజ్ థ్రిల్లర్ సిరీస్ రూపొందుతోంది. ధరమ్ రాజ్ శెట్టి ఈ సిరీస్‌తో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పీరియాడికల్ రివెంజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ ఉంటుందని బాలీవుడ్ టాక్. అయితే కీర్తిపై రాధికా రివెంజ్ ప్లాన్ చేశారా? లేక రాధికా పై కీర్తి పగ తీర్చుకుంటారా? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఆదిత్యా చోప్రా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు.

ఇలా హిందీలో కథానాయిక ప్రాధాన్యంగా సాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఇంకా ఉన్నాయి.

'అల్లరి' నరేశ్ కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. 'అల్లరి' నరేశ్ హీరోగా రచయిత–దర్శకుడు మెహర్ తేజ్ ఓ సినిమాను తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఇందులో రుహానీ శర్మ హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా శనివారం ఆరంభమైంది. మరో వారం రోజుల్లో

సరికొత్తగా...



● 'అల్లరి' నరేశ్

రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించనున్నారు. ''సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, సహ–నిర్మాత: వెంకట్ ఉప్పుటూరి.

కాలేజ్‌లో...



● స్నేహా, పవన్, సాహిబా

'పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహ మాల్వియ, సాహిబా భాసిన్, వివియా సంత్, ఝాన్సీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. పవన్ కుమార్ కొత్తూరి, బిషాలి గోయెల్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'కాలేజ్‌లో ఉన్నంత వరకే స్టూడెంట్ నాని.. ఆ తరువాత కూకట్‌పల్లి నాని' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''రొమాన్స్, కామెడీ, యాక్షన్, ఎమోషన్స్... ఇలా అన్ని అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను మా చిత్రం అలరిస్తుంది'' అనియూనిట్ పేర్కొంది.

నా లుక్ కొత్తగా ఉంటుంది

- సత్యరాజ్



● సత్యరాజ్, విజయ్ ఆంటోనీ, విజయ్

''బాహుబలి' తర్వాత సినిమాల రేంజ్ పెరిగింది. తెలుగు ప్రేక్షకులతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. 'తుఫాన్' సినిమాతో వారికి మరింత దగ్గరవుతానని ఆశిస్తున్నాను'' అని విజయ్ ఆంటోనీ అన్నారు. విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, డి. లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ–''తుఫాన్' కంటెంట్, క్వాలిటీ మాకు సక్సెస్ ఇస్తాయన్న నమ్మకం ఉంది. నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమాను తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. వారికి థ్యాంక్స్'' అన్నారు. ''నాకు నచ్చిన థ్రిల్లర్ మూవీ 'తుఫాన్'. ఈ సినిమాలో నా లుక్, మేకోవర్, క్యారెక్టర్ కొత్తగా ఉంటాయి'' అన్నారు సత్యరాజ్. ''తుఫాన్'ను థియేటర్స్‌లో చూడండి'' అన్నారు విజయ్ మిల్టన్. ''తుఫాన్'లో క్వాలిటీ కంటెంట్, కమర్షియల్ అంశాలు ఉన్నాయి'' అన్నారు ధనుంజయ.

PARIS 2024
సాక్షి
ఆదివారం
28-7-2024

స్పోర్ట్స్



తొలి స్వర్ణం చైనాదే... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో పసిడి పతకం

పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో తొలి స్వర్ణ పతకాన్ని సాధించిన జట్టుగా చైనా నిలిచింది. శనివారం జరిగిన షూటింగ్ క్రీడాంశంలో చైనా ఈ ఘనత సాధించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో 17 ఏళ్ల హువాంగ్ యుటింగ్, 19 ఏళ్ల షెంగ్ లిహావో ద్వయం విజేతగా నిలిచి 'పారిస్'లో చైనాకు తొలి పసిడి పతకాన్ని అందించింది. ఫైనల్లో హువాంగ్ యుటింగ్-షెంగ్ లిహావో జోడీ 16-12 పాయింట్ల తేడాతో కెయుమ్ జిహైన్-పార్క్ హాజున్ (దక్షిణ కొరియా) జంటను ఓడించింది. ఫైనల్లో ఓడిన కొరియా జోడీకి రజత పతకం లభించింది. అంతకుముందు కజకిస్తాన్‌కు చెందిన అలెగ్జాండ్రా లె-సత్పయెవ్ జంట కాంస్య పతకాన్ని గెల్చుకుంది. కాంస్య పతకం కోసం జరిగిన పోటీలో అలెగ్జాండ్రా-సత్పయెవ్ ద్వయం 17-5తో అనా జాన్సెన్-మాక్సిమిలన్ ఉల్‌బ్రిచ్ (జర్మనీ) జంటపై విజయం సాధించింది. మహిళల డైవింగ్ సింక్రనైజ్డ్ 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డు ఈవెంట్‌లో చాంగ్ యాని-చెన్ యిఫెన్ ద్వయం 337.68 పాయింట్లు సాధించి చైనాకు 'పారిస్'లో రెండో స్వర్ణ పతకాన్ని అందించింది.



దిగ్గజాల సమక్షంలో...


- వెలిగిన ఒలింపిక్ జ్యోతి
- అద్భుతంగా సాగిన పారిస్ విశ్వ క్రీడల వేడుకలు

'మీ గెలుపే మా గెలుపు... మీ ఓటమే మా ఓటమి... వచ్చే రెండు వారాల పాటు మీ భావోద్వేగాల్లో మేమూ భాగం... మేమందరం మీ వైపే'... పారిస్ క్రీడల అధ్యక్షుడు, మూడు సార్లు ఒలింపిక్ స్వర్ణపతక విజేత టోనీ ఎస్టాన్‌గెట్ ఒలింపిక్ క్రీడల విశిష్టత గురించి ఇచ్చిన సందేశంతో ఒలింపిక్స్‌కు తెర లేచింది. శుక్రవారం భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ప్రారంభోత్సవ కార్యక్రమాలు సుదీర్ఘ సమయం పాటు సాగాయి. సెన్ నదిపై జరిగిన బోట్ పరేడ్‌లో అందరికంటే చివరగా ఆతిథ్య ఫ్రాన్స్ జట్టు వచ్చినప్పుడు నదీ తీరమంతా స్థానిక అభిమానుల కేరింతలతో హోరెత్తింది. స్విమ్మర్ ఫ్లొరెంట్ మనాడు, డిస్కస్ త్రోయర్ మెలినా రాబర్ట్ మికాన్ ఆ దేశపు ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించారు. అంతకుముందు గత ఒలింపిక్స్ నిర్వహించిన జపాన్, 2028 ఒలింపిక్స్ జరిగే అమెరికా జట్లు వచ్చాయి. టెన్నిస్ స్టార్ కోకో గాఫ్, బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ యూఎస్ పతాకధారులుగా వ్యవహరించారు. ఆ తర్వాత అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) పతాకంతో ఒక గుర్రంపై 'మెటల్ ఉమన్' కూర్చొని సెన్ నదిపై దూసుకుపోగా... ఆ వెంటనే ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న అన్ని దేశాల జాతీయ పతాకాలతో పరేడ్ సాగింది. ఆ సమయంలో నేపథ్యంలో ఒలింపిక్ గీతాన్ని వినిపించారు.

జ్యోతి వెలిగింది...

ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్ ముందుగా ప్రసంగిస్తూ... ఆధునిక ఒలింపిక్ క్రీడల సృష్టికర్త అయిన పియరీ డి క్యూబర్టిన్ జన్మస్థలంలో ఈ క్రీడల నిర్వహణ తమకు గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ ఒలింపిక్ క్రీడలను అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులందరి తరఫున ఫ్రాన్స్ ఫ్లాగ్‌బేరర్లు ఫ్లొరెంట్ మనాడు, మెలినా రాబర్ట్ మికాన్ ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత అసలైన మరో ఘట్టం మొదలైంది. కార్యక్రమం ఆరంభమైన దగ్గరి నుంచి ముఖానికి ముసుగులో ఒలింపిక్ టార్చ్‌తో కనిపించిన వ్యక్తి ఎట్టకేలకు దానిని తీసుకొచ్చి ఫ్రాన్స్ ఫుట్‌బాల్ గ్రేట్ జినెదిన్ జిదాన్ చేతిలో పెట్టగా... జిదాన్ దానిని టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు అందించాడు. స్పెయిన్‌కు చెందినవాడే అయినా రోలాండ్ గారోస్‌లో 14సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ నెగ్గి ఈ మట్టితో ప్రత్యేక అనుబంధం ఉండటంతో నిర్వాహకులు నాదల్‌ను సముచితంగా గౌరవించారు. ఆ వెంటనే మెరుపులు, బాణాసంచాతో ఈఫిల్ టవర్‌పై ఐదు ఒలింపిక్స్ రింగ్స్ ప్రదర్శించడంతో ఒక అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. 9 ఒలింపిక్ స్వర్ణాల విజేత కార్ల్ లూయిస్, నాలుగు స్వర్ణాలు సాధించిన సెరెనా విలియమ్స్, రొమేనియా జిమ్నాస్టిక్స్ దిగ్గజం నాదియా కొమనెసి వేదికపై నాదల్‌కు జత కలిశారు. జ్యోతి ఆ తర్వాత ఫ్రెంచ్ మాజీ టెన్నిస్ ప్లేయర్, ఈ ఒలింపిక్స్ డైరెక్టర్ అమెలీ మౌరెస్మో వద్దకు వెళ్లి ఆ తర్వాత బాస్కెట్‌బాల్ స్టార్ టోనీ పార్కర్ వద్దకు చేరింది. చివరగా ఫ్రాన్స్ జూడో ప్లేయర్ టెడ్డీ రైనర్, అథ్లెట్ మేరీ జోస్ పెరెక్ టార్చ్‌ను అందుకున్నారు. ప్రస్తుత, మాజీ ఒలింపియన్లు, పారాలింపియన్లు కలిపి మొత్తం 18 మంది సమక్షంలో చివరగా రైనర్, పెరెక్ జ్యోతిని వెలిగించడంతో లాంఛనంగా పారిస్ 2024 ఆటలకు నగారా మోగింది. కార్యక్రమం సాగినంత సేపూ స్వల్పంగా చినుకులు కురిసినా... దాని వల్ల ఎలాంటి ఆటంకం కలగలేదు.





మేరీ జోస్, టెడ్డీ రైనర్











ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్



మెలినా, ఫ్లొరెంట్







ఫ్రెంచ్ ప్రభుత్వం ఆధీనంలోని 'తహితి'లో ఒలింపిక్స్‌కు సంబంధించిన సర్ఫింగ్ పోటీలు జరుగుతాయి. ఈ దీవి పసిఫిక్ మహా సముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా, ఫ్రాన్స్‌కు దాదాపు 15 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. పారిస్‌లో ప్రారంభోత్సవ వేడుకలు జరుగుతున్న సమయంలోనే ఇక్కడ కూడా ఘనంగా ఉత్సవం నిర్వహించడం విశేషం.

రోదసిలో ఒలింపిక్ జ్యోతి...

ఒకవైపు పారిస్‌లో వేడుకలు ఘనంగా జరుగుతుండగా మరోవైపు రోదసిలో కూడా ఒలింపిక్స్ సంబరం కనిపించింది. ప్రతిష్టాత్మక సంస్థ 'నాసా' దీనికి సంబంధించి ఒక వీడియోను విడుదల చేసింది. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో భాగంగా ఉన్న సునీతా విలియమ్స్, మరో ఐదుగురు ఆస్ట్రోనాట్‌లు కలిసి ఒలింపిక్ క్రీడలను అనుకరించి తమ సంఘీభావాన్ని ప్రదర్శించారు. ఒక్కో క్రీడాంశాన్ని గుర్తుకు తెచ్చేలా వారంతా విన్యాసాలు చేశారు. ఒలింపిక్ జ్యోతిని పోలిన నమూనా జ్యోతిని కూడా ఒకరినుంచి మరొకరు అందుకుంటూ క్రీడల పట్ల తమ అభిమానాన్ని ప్రదర్శించారు.



పెళ్లి ఉంగరం నీటిపాలు...



ప్రారంభోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఇటలీ హైజంపర్, టోక్యో స్వర్ణపతక విజేత గియాన్‌మార్కో టాంబెరి కొద్దిసేపటి తర్వాత తీవ్ర నిరాశలో మునగాల్సి వచ్చింది. ఇటలీ ఫ్లాగ్‌బేరర్ కూడా అయిన గియాన్‌మార్కో పెళ్లి ఉంగరం సెన్ నదిలో పడిపోయింది. అయితే ఒకవైపు దీనికి తన భార్యకు క్షమాపణలు చెబుతూనే అతను రాసిన వాక్యాలు హృద్యంగా, ఆసక్తికరంగా అందరి మనసులను గెలుచుకోవడం విశేషం. 'నా పెళ్లి ఉంగరం సెన్ నదిలో పడిపోవడం బాధాకరమే అయినా అది కోల్పోవడానికి ఇంత కంటే మంచి చోటు లభించదు. ప్రేమకు చిరునామాలాంటి నగరపు నదిలో అది ఎప్పటికీ నిలిచిపోతుంది. నా జాతీయ పతాకాన్ని సగర్వంగా పైకి ప్రదర్శించే క్రమంలో దానిని కోల్పోయాను. ఇందులో కొంత కవిత్వం కనిపించవచ్చు గానీ... నీ ఉంగరాన్ని కూడా అందులో విసిరేస్తే అవి కలిసి ఉండిపోతాయి. పెళ్లినాటి ప్రమాణాలను మళ్లీ మళ్లీ గుర్తుకు తెచ్చుకునే మనం మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశం కూడా ఉంటుంది' అని అతను రాశాడు.

మనూ చరిత్ర లిఖించేనా!

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఫైనల్లోకి మనూ భాకర్
- క్వాలిఫయింగ్‌లో 580 పాయింట్లతో మూడో స్థానం
- నేడు మధ్యాహ్నం గం. 3:30 నుంచి పతకం కోసం పోటీ



మనూ భాకర్

మూడేళ్ల క్రితం ఎన్నో అంచనాలతో టోక్యో ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేసిన భారత యువ షూటర్ మనూ భాకర్ తడబడి నిరాశ పరిచింది. అయితే ఈసారి 'పారిస్'లో మాత్రం మనూ తుపాకీ గర్జించింది. ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా క్వాలిఫయింగ్‌లో పూర్తి విశ్వాసంతో లక్ష్యంవైపు గురి పెట్టిన మనూ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో నేడు జరిగే ఫైనల్లో మనూ అదే జోరు కొనసాగిస్తే పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ కొడుతుంది.

పారిస్: విశ్వ క్రీడల్లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ నుంచి రెండు జోడీలు బరిలోకి దిగినా పతకానికి దూరంగా నిలిచాయి. అయితే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 22 ఏళ్ల మనూ భాకర్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్లోకి ప్రవేశించి పతకంపై ఆశలు రేకెత్తించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ త్రుటిలో ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫయింగ్‌లో అర్జున్ బబూతా-రమితా జిందాల్ (భారత్) ద్వయం 628.7 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన సందీప్ సింగ్-ఇలవేనిల్ వలారివన్ జోడీ 626.3 పాయింట్లు సాధించి 12వ స్థానంతో సరిపెట్టుకుంది. మొత్తం 28 జోడీలు క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డాయి. టాప్-4లో నిలిచిన జోడీలు ఫైనల్ చేరుకుంటాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్ సింగ్ త్రుటిలో ఫైనల్‌కు దూరమయ్యాడు. 33 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధించారు. సరబ్‌జోత్, జర్మనీ షూటర్ రాబిన్ వాల్టర్ 577 పాయింట్లతో సంయుక్తంగా ఎనిమిదో స్థానంలో నిలిచారు. అయితే సరబ్‌జోత్ (16) కంటే 10 పాయింట్ల షాట్‌లు ఎక్కువ కొట్టిన రాబిన్ వాల్టర్ (17) ఎనిమిదో స్థానంతో ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ అర్జున్ సింగ్ చీమా 574 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచాడు.



సరబ్‌జోత్

నిలకడగా...

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో భారత్ నుంచి మనూ భాకర్, రిథమ్ సాంగ్వాన్ బరిలో నిలిచారు. మొత్తం 44 మంది షూటర్లు క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డారు. మనూ 580 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. రిథమ్ మాత్రం 573 పాయింట్లతో 15వ స్థానాన్ని దక్కించుకొని ఫైనల్‌కు దూరమైంది. టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత పొందారు. క్వాలిఫయింగ్‌లో ఒక్కో షూటర్‌కు 10 షాట్‌లతో ఆరు సిరీస్‌లు అవకాశం ఇచ్చారు. మనూ వరుసగా ఆరు సిరీస్‌లలో 97, 97, 98, 96, 96, 96 పాయింట్లు సాధించింది. నేడు జరిగే ఫైనల్లో వెరోనికా (హంగేరి), జిన్ ఓ యె (దక్షిణ కొరియా), విన్ తు ట్రిన్ (వియత్నాం), కిమ్ యెజి (దక్షిణ కొరియా), జుయ్ లీ (చైనా), తర్హాన్ సెవల్ (టర్కీ), రాన్‌జిన్ జియాంగ్ (చైనా)లతో కలిసి మనూ పోటీపడుతుంది. ఫైనల్లో ముందుగా 8 మంది షూటర్లు 10 షాట్‌లు సంధిస్తారు. 10 షాట్‌ల తర్వాత తక్కువ స్కోరు ఉన్న చివరి షూటర్ నిష్క్రమిస్తుంది. ఆ తర్వాత ప్రతి రెండు షాట్‌ల తర్వాత ఒక్కో షూటర్ అవుట్ అవుతారు. చివరకు 24 షాట్‌లు ముగిశాక టాప్-3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

బ్యాడ్మింటన్

మహిళల సింగిల్స్ తొలి లీగ్ మ్యాచ్: పీవీ సింధు x ఫాతిమత్ నభా (మాల్దీవులు) మధ్యాహ్నం గం. 12:50 నుంచి. పురుషుల సింగిల్స్ తొలి లీగ్ మ్యాచ్: హెచ్ఎస్ ప్రణయ్ x ఫాబియన్ రోథ్ (జర్మనీ) రాత్రి గం. 9:00 నుంచి

షూటింగ్

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్: ఇలవేనిల్ వలారివన్ (మధ్యాహ్నం గం. 12:45 నుంచి). పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్: సందీప్ సింగ్, అర్జున్ బబూతా (మధ్యాహ్నం గం. 2:45 నుంచి). మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్: మనూ భాకర్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

రోయింగ్

పురుషుల సింగిల్ స్కల్స్ (రెపిచేజ్ 2): బలరాజ్ పన్వర్ (మధ్యాహ్నం గం. 1:18 నుంచి).

టేబుల్ టెన్నిస్

మహిళల సింగిల్స్ (రెండో రౌండ్): ఆకుల శ్రీజ x క్రిస్టియానా క్లైబెర్గ్ (స్వీడన్) (మధ్యాహ్నం గం. 12:15 నుంచి). మహిళల సింగిల్స్ (రెండో రౌండ్): మనికా బత్రా x అన్నా హర్సే (ఇంగ్లండ్) (మధ్యాహ్నం 12:15 నుంచి). పురుషుల సింగిల్స్ (రెండో రౌండ్): శరత్ కమల్ x డేనీ కోజుల్ (స్లొవేనియా) (మధ్యాహ్నం గం. 3:00 నుంచి).

స్విమ్మింగ్

పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ (హీట్-2): శ్రీహరి నటరాజ్ (మధ్యాహ్నం గం. 3:16 నుంచి). మహిళల 200 మీటర్ల ఫ్రీస్టయిల్ (హీట్-1): ధీనిధి (మధ్యాహ్నం గం. 3.30 నుంచి).

ఆర్చరీ



మహిళల రికర్వ్ టీమ్ క్వార్టర్ ఫైనల్: భారత్ (దీపిక కుమారి, అంకిత భకత్, భజన్ కౌర్) x ఫ్రాన్స్/నెదర్లాండ్స్ (సాయంత్రం గం. 5:45 నుంచి). మహిళల టీమ్ సెమీఫైనల్: (రాత్రి గం. 7:17 నుంచి). మహిళల టీమ్ ఫైనల్: (రాత్రి గం. 8:18 నుంచి).

హాకీలో భారత్ శుభారంభం

పారిస్: ఒలింపిక్స్‌లో తమ కాంస్య పతకాన్ని నిలబెట్టుకునే లక్ష్యంతో 'పారిస్'కు వచ్చిన భారత పురుషుల హాకీ జట్టు శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున మన్‌దీప్ సింగ్ (24వ ని.లో), వివేక్ సాగర్ ప్రసాద్ (34వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ జట్టుకు స్యామ్ లేన్ (8వ ని.లో), సిమోన్ చైల్డ్ (53వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.



సాత్విక్ జోడీ బోణీ



సాత్విక్

బ్యాడ్మింటన్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ అలవోక విజయంతో బోణీ కొట్టింది. గ్రూప్ 'సి' తొలి రౌండ్‌లో మూడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 21-17, 21-14తో లుకాస్ కోర్వీ-రోనన్ లాబర్ (ఫ్రాన్స్) ద్వయంపై విజయం సాధించింది. మొదటిసారి ఒలింపిక్స్ ఆడుతున్న యువ షట్లర్ లక్ష్య సేన్ పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎల్' తొలి రౌండ్‌లో 21-8, 22-20తో కెవిన్ కార్డన్ (గ్వాటెమాలా)పై గెలిచాడు.

హర్మీత్ విజయం

టేబుల్ టెన్నిస్ (టీటీ)లో భారత ఆటగాడు హర్మీత్ దేశాయ్ ముందంజ వేశాడు. ప్రాథమిక రౌండ్ మ్యాచ్‌లో హర్మీత్ 11-7, 11-9, 11-5, 11-5తో జైద్ అబో యమన్ (జోర్డాన్)పై విజయం సాధించాడు. తదుపరి రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫెలిక్స్ లెబ్రాన్ (ఫ్రాన్స్)తో హర్మీత్ తలపడతాడు.

రెపిచేజ్‌కు బాలరాజ్

భారత రోవర్ బాలరాజ్ పన్వర్ రెపిచేజ్ దశకు అర్హత సాధించాడు. పురుషుల సింగిల్స్ స్కల్స్ హీట్-1లో బాలరాజ్ నాలుగో స్థానంలో నిలిచాడు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన రోవర్లు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించగా.. రెపిచేజ్ రౌండ్లో రాణిస్తేనే బాలరాజ్ ముందంజ వేస్తాడు.



బాలరాజ్

యువ భారత్ ప్రతీకలు వాళ్లు

పీవీ సింధు

ప్రపంచంలోనే అతి పెద్ద క్రీడా మహోత్సవంలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ... భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించడం అనిర్వచనీయమైన అనుభూతి. ఒలింపిక్ వేదికపై తొలిసారి పతాకధారిగా టీమిండియాకు ముందు నిలవడంతో ఇది నాకు మరింత ప్రత్యేకం. గతంలో రియో, టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్నా ఇవి నాకు మూడో విశ్వక్రీడలు. దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని మాటల్లో వర్ణించలేం. ఈసారి కూడా అంతే. పారిస్ క్రీడాగ్రామంలో అడుగుపెట్టగానే కొత్త ఉత్సాహం వచ్చింది. 140 కోట్ల మంది భారతీయుల ఆశలు మోస్తూ అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు సిద్ధంగా ఉన్నా.



ఈసారి భారత బృందంలో 70 మందికి పైగా అథ్లెట్లు తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగుతున్నారు. వారు కాస్త ఆందోళన చెందుతుండొచ్చు. 2016 రియో ఒలింపిక్స్ సమయంలో నా పరిస్థితి కూడా అంతే. కానీ ఈసారి విశ్వక్రీడల్లో అరంగేట్రం చేస్తున్న వారిని చూస్తుంటే ముచ్చటేస్తోంది. వారు యువభారతానికి ప్రతీకల్లా కనిపిస్తున్నారు. ఈ తరం మరింత ఉత్సాహంగా ఉంది. తాము ఎవరికంటే తక్కువ కాదనే నమ్మకం వారిలో కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ వేదికలపై సాధించిన విజయాల వల్ల వారి ఆలోచనల్లో ఈ మార్పు వచ్చింది. ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యే క్రమంలో ప్రభుత్వ సహకారం మరవలేనిది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందించిన ప్రేరణ, మానసిక బలం అథ్లెట్లలో మరింత ఉత్సాహాన్ని నింపింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న 117 మంది భారత బృందం అటు అనుభవజ్ఞులు, ఇటు యువకులతో సమతూకంగా ఉంది.

ప్రతీ అథ్లెట్ తమ తమ విభాగాల్లో అత్యుత్తమ శిక్షణ పొందడంతో పాటు... మానసిక స్థయిర్యాన్ని సాధించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇతోధిక సాయం చేసింది. అథ్లెట్లు అడిగిన సౌకర్యాలన్నింటినీ క్రీడాశాఖ సమకూర్చింది. ఇప్పుడు యావత్ భారతావని నమ్మకాన్ని నిలబెట్టడం అథ్లెట్ల బాధ్యత. పారిస్ ఒలింపిక్స్-2024లో భారత ఆటగాళ్ల ప్రదర్శన చూసేందుకు సిద్ధంగా ఉండండి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



పారిస్‌లో 'ఇండియా హౌస్'... రిలయన్స్ ఫౌండేషన్ ఏర్పాటు

పారిస్: ప్రతిష్టాత్మక ఒలింపిక్ క్రీడల సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ భారత ఆటగాళ్ల విజయాలు, ఘనతలను వేడుకలా నిర్వహించేందుకు కొత్త ప్రయత్నం చేసింది. క్రీడల వేదిక పారిస్‌లో 'ఇండియా హౌస్' పేరుతో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఒలింపిక్స్ వేదికకు సమీపంలో ఈ తరహాలో 'ఇండియా హౌస్' ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యురాలు నీతా అంబానీ శనివారం దీనిని ప్రారంభించారు. ఇందులో భారత్ ఘనతలు, సంస్కృతి సాంప్రదాయాలను ప్రదర్శిస్తారు. దీంతో పాటు ఆటగాళ్ల విజయాలు, ఘనతలపై ప్రత్యేక చర్చలు తదితర రోజువారీ కార్యక్రమాలు ఉంటాయి. ఒలింపిక్స్ ముగిసే వరకు ఇది సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. భారీ వేడుకల మధ్య జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష, బీసీసీఐ కార్యదర్శి జై షా, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ అభినవ్ బింద్రా తదితరులు పాల్గొన్నారు.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	2	0	0	2
బెల్జియం	1	0	1	2
జపాన్	1	0	1	2
కజకిస్తాన్	1	0	1	2
ఆస్ట్రేలియా	1	0	0	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

నినో... నీకు సలాం!

వరుసగా పదో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ జార్జియా మహిళా షూటర్ నినో సాలుక్‌వాడ్జె



ఒలింపిక్స్‌కు ఒక్కసారి అర్హత సాధించడమే గొప్ప అనుకుంటుంటే... వరుసగా పదోసారి విశ్వక్రీడల్లో పోటీ పడటాన్ని ఏమనాలి! జార్జియాకు చెందిన 55 ఏళ్ల మహిళా షూటర్ నినో సాలుక్‌వాడ్జె ఇలాంటి అసాధారణ ఘనత సాధించింది. 1988 సియోల్ ఒలింపిక్స్ ద్వారా విశ్వక్రీడల్లో అరంగేట్రం చేసిన నినో... తొలి ప్రయత్నంలో 25 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణం, 10 మీటర్ల విభాగంలో రజతం సాధించి అదరగొట్టింది. ఇక అప్పటి నుంచి వరుసగా అన్నీ ఒలింపిక్స్‌లో పాల్గొన్న నినో... తాజాగా పారిస్ క్రీడల ద్వారా వరుసగా పదోసారి గేమ్స్ లో పాల్గొన్న క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో నినో బరిలోకి దిగి 562 పాయింట్లు స్కోరు చేసి 38వ స్థానంలో నిలిచింది. కెనడాకు చెందిన ఈక్వెస్ట్రియాన్ ఇయాన్ మిల్లర్ కూడా 10 ఒలింపిక్స్‌లో పాల్గొన్నా... అతడు 1980 మాస్కో ఒలింపిక్స్‌కు దూరంగా ఉన్నాడు. 2016 రియోలో కుమారుడు సోట్నే మచావరియానితో కలిసి పోటీపడటం ద్వారా.. విశ్వక్రీడల్లో బరిలోకి దిగిన తొలి తల్లీ తనయులుగా నినో రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు మూడు పతకాలు సాధించిన నినో... తండ్రి చివరి కోరిక మేరకే పదో ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొంది.

ఆరంభం అదిరింది

- తొలి టి20 మ్యాచ్‌లో 43 పరుగులతో గెలిచిన భారత్
- చెలరేగిన సూర్యకుమార్, పంత్
- 8 బంతుల్లో 3 వికెట్లు తీసిన పరాగ్
- నిసాంక మెరుపులు వృథా
- నేడు రెండో టి20


పరాగ్


సూర్యకుమార్

పల్లెకెలె: టి20 ప్రపంచ చాంపియన్ భారత్... శ్రీలంక పర్యటనలో శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ బృందం 43 పరుగుల తేడాతో లంకపై విజయం సాధించింది. మూడు టి20ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. విరామం లేకుండా నేడే రెండో టి20 మ్యాచ్ జరగనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ (26 బంతుల్లో 58; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రిషభ్ పంత్ (33 బంతుల్లో 49; 6 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. పతిరణకు 4 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 19.2 ఓవర్లలో 170 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు నిసాంక (48 బంతుల్లో 79; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (27 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్) ఒకదశలో భారత శిబిరాన్ని వణికించేలా మెరిపించారు. రియాన్ పరాగ్ (1.2–0–5–3) బంతితో మ్యాజిక్ చేశాడు. అర్ష్‌దీప్ (2/24), అక్షర్ పటేల్ (2/38) కీలక వికెట్లు తీశారు.

జైస్వాల్, గిల్ మెరుపులతో...

ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (21 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (16 బంతుల్లో 34; 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్‌తో భారత్ ఇన్నింగ్స్ మొదలైంది. ఉన్నది కాసేపే అయినా ఇద్దరు పోటీపడి బౌండరీలు బాదడంతో 4వ ఓవర్లో జట్టు స్కోరు 50 దాటింది. పవర్ ప్లేలో పవర్ చూపిన ఓపెనర్లిద్దరిని లంక బౌలర్లు వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చారు. మదుషంక వేసిన ఆరో ఓవర్లో శుబ్‌మన్ రెండు ఫోర్లు, డీప్ మిడ్‌వికెట్ దిశగా భారీ సిక్సర్ బాదాడు. తొలి ఐదు బంతుల్లోనే 15 పరుగులు రాగా... అదే ఊపులో ఆఖరి బంతిని షాట్ ఆడేందుకు ప్రయత్నించగా, మిడాన్‌లో ఉన్న ఫెర్నాండో క్యాచ్ పట్టడంతో గిల్ వెనుదిరిగాడు. 6 ఓవర్లలో 74/1 స్కోరుతో ఉన్న భారత్‌కు తర్వాతి బంతి మరో దెబ్బతీసింది. హసరంగ వేసిన ఏడో ఓవర్ తొలిబంతికి జోరుమీదున్న జైస్వాల్ స్టంపౌట్ అయ్యాడు.

సూర్య ఫిఫ్టీ...

ఈ ఊరట కాస్తా ఆ రెండు బంతులకే పరిమితమైంది. తర్వాత దశను హార్డ్ హిట్టర్లు సూర్యకుమార్, రిషభ్ పంత్ మొదలుపెట్టారు. దీంతో పరుగుల్లో వేగం, బ్యాటింగ్‌లో దూకుడు మరింత పెరిగిందే తప్ప తగ్గనేలేదు. 8.4 ఓవర్లోనే భారత్ 100 పరుగుల మైలురాయిని చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ స్ట్రోక్ ప్లేతో పదేపదే బౌండరీలకు తరలించాడు. చెత్త బంతులు ఎదురైతే సిక్స్‌లుగా బాదేశాడు. ఈ మెరుపులతో అతని అర్ధశతకం 22 బంతుల్లోనే పూర్తవగా, 13.1 ఓవర్లో జట్టు స్కోరు 150 పరుగులకు చేరింది. కానీ తర్వాతి బంతికి పతిరణ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో కెప్టెన్ ఇన్నింగ్స్ ముగిసింది. హార్దిక్ పాండ్యా (9), పరాగ్ (7) విఫలమైనప్పటికీ పంత్ తనశైలి ఆటతీరుతో జట్టు స్కోరును 200 పైచిలుకు తీసుకెళ్లాడు. పరుగు తేడాతో అర్ధసెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

చకచకా లక్ష్యం వైపు... అంతలోనే!

శ్రీలంక కూడా లక్ష్యానికి తగ్గ దూకుడుతోనే బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు నిసాంక, కుశాల్ మెండిస్ మెరుపులతో సగటున ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో లంక ఇన్నింగ్స్ దూసుకెళ్లింది. 5.1 ఓవర్లలో జట్టు స్కోరు 50కి చేరింది. నిసాంక భారీషాట్లతో విరుచుకుపడగా, మెండీస్ బౌండరీలతో భారత బౌలర్ల భరతం పట్టాడు. జట్టు స్కోరు 84 వద్ద అర్ష్‌దీప్... మెండిస్‌ను అవుట్ చేసి తొలివికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. తర్వాత కుశాల్ పెరీరా (14 బంతుల్లో 20; 3 ఫోర్లు) అండతో నిసాంక మరింతగా రెచ్చిపోయాడు. 14 ఓవర్లదాకా ఎంతవేగంగా లక్ష్యం వైపు దూసుకొచ్చింతో... నిసాంక అవుటయ్యాక అంతే వేగంగా లంక ఇన్నింగ్స్ పతనమైంది. 140 స్కోరు వద్ద నిసాంక రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. 36 బంతుల్లో 74 పరుగుల సమీకరణం ఏమంత కష్టం కాకపోయినా... భారత బౌలర్లు పట్టు బిగించడంతో అనూహ్యంగా మరో 30 పరుగుల వ్యవధిలోనే 8 వికెట్లను కోల్పోయి లంక 170 పరుగులకే ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) హసరంగ 40; గిల్ (సి) ఫెర్నాండో (బి) మదుషంక 34; సూర్యకుమార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరణ 58; పంత్ (బి) పతిరణ 49; పాండ్యా (బి) పతిరణ 9; పరాగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరణ 7; రింకూ సింగ్ (బి) ఫెర్నాండో 1; అక్షర్ (నాటౌట్) 10; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 213. వికెట్ల పతనం:** 1–74, 2–74, 3–150, 4–176, 5–192, 6–201, 7–206. **బౌలింగ్:** మదుషంక 3–0–45–1, అసిత ఫెర్నాండో 4–0–47–1, తీక్షణ 4–0–44–0, హసరంగ 4–0–28–1, కమిందు మెండీస్ 1–0–9–0, పతిరణ 4–0–40–4.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) అక్షర్ 79; కుశాల్ మెండిస్ (సి) జైస్వాల్ (బి) అర్ష్‌దీప్ 45; పెరీరా (సి) బిష్ణోయ్ (బి) అక్షర్ 20; కమిందు మెండిస్ (బి) పరాగ్ 12; అసలంక (సి) జైస్వాల్ (బి) బిష్ణోయ్ 0; షనక (రనౌట్) 0; హసరంగ (సి) పరాగ్ (బి) అర్ష్‌దీప్ 2; తీక్షణ (బి) పరాగ్ 2; పతిరణ (సి) అక్షర్ (బి) సిరాజ్ 6; ఫెర్నాండో (నాటౌట్) 0; మదుషంక (బి) పరాగ్ 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19.2 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం:** 1–84, 2–140, 3–149, 5–160, 6–161, 7–163, 8–170, 9–170, 10–170. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3–0–24–2, సిరాజ్ 3–0–23–1, అక్షర్ 4–0–38–2, రవి బిష్ణోయ్ 4–0–37–1, పాండ్యా 4–0–41–0, పరాగ్ 1.2–0–5–3.

ఎనిమిదో టైటిల్ లక్ష్యంగా...

ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో నేడు శ్రీలంకతో భారత్ తుది సమరం

- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–3లో ప్రత్యక్ష ప్రసారం



దంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియాకప్ టి20 క్రికెట్ టోర్నీలో ఎదురు లేకుండా సాగుతున్న భారత జట్టు.. నేడు తుది సమరానికి సిద్ధమైంది. టోర్నీలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన టీమిండియా.. ఆదివారం జరగనున్న ఫైనల్లో శ్రీలంకతో తలపడనుంది. ఇప్పటికే ఎనిమిదిసార్లు (వన్డే, టి20 ఫార్మాట్లలో కలిపి) ఆసియాకప్ ఫైనల్ ఆడి అందులో ఏడింట విజేతగా నిలిచిన టీమిండియా.. ఎనిమిదోసారి ట్రోఫీ కైవసం చేసుకోవాలని తహతహలాడుతోంది. గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ బృందం.. దాయాది పాకిస్తాన్, యూఏఈ, నేపాల్ జట్లపై గెలిచి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఏకపక్షంగా సాగిన సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించి తుదిపోరుకు చేరింది. ఇటీవలి కాలంలో హర్మన్‌ప్రీత్ బృందం జోరు చూస్తుంటే.. కప్ ఖాయంగానే కనిపిస్తోంది. ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మతో పాటు జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్‌తో బ్యాటింగ్ పటిష్టంగా ఉంటే... బౌలింగ్‌లో రేణుక సింగ్, రాధ యాదవ్, దీప్తి శర్మ అదరగొడుతున్నారు. హర్మన్, జెమీమాకు ఈ టోర్నీలో పెద్దగా బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినా... సమయం వస్తే సత్తా చాటడం ఖాయమనే మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌లు నెగ్గిన లంక... పాకిస్తాన్‌తో హోరాహోరీ సెమీఫైనల్లో ఒత్తిడిని జయించి ఫైనల్‌కు అర్హత సాధించింది. కెప్టెన్ చమరి అటపట్టుపై లంక భారీ ఆశలు పెట్టుకుంది. ఈ టోర్నీలో 243 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్న చమరి రాణిస్తేనే టీమిండియాకు లంక పోటీనివ్వగలదు.

24 టి20 ఫార్మాట్‌లో భారత్, శ్రీలంక జట్ల మధ్య ఇప్పటి వరకు 24 మ్యాచ్‌లు జరిగాయి. 19 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 4 మ్యాచ్‌ల్లో శ్రీలంక విజయం సాధించింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

ఇంగ్లండ్‌కు ఆధిక్యం

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 33 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (0), మెకెన్జీ (8) వెనుదిరగ్గా... మికైల్ లూయిస్ (18 బ్యాటింగ్), అతనజె (5 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 38/3తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆ జట్టుకు 94 పరుగుల ఆధిక్యం లభించింది. జేమీ స్మిత్ (109 బంతుల్లో 95; 12 ఫోర్లు, 1 సిక్స్), జో రూట్ (87), క్రిస్ వోక్స్ (62), బెన్ స్టోక్స్ (54) అర్ధ సెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టగా...జేడెన్ సీల్స్‌కు 3, షామర్ జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి రెండు టెస్టులు నెగ్గిన ఇంగ్లండ్ ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకుంది.

మహానందిలో మరోసారి చిరుత కలకలం

శుక్రవారం రాత్రి గోశాల వద్ద సంచారం



మహానంది: నెలరోజులుగా నంద్యాల జిల్లా, మహానంది ఆలయ పరిసరాల్లోనే సంచరిస్తున్న చిరుత, తాజాగా శుక్రవారం రాత్రి ఆలయంలోని గోశాల వద్దకు మరోసారి రావడం కలకలం రేపింది. గోవులకు రక్షణగా ఉన్న గ్రీన్‌మ్యాట్ దాటి లోపలికి చొరబడేందుకు యత్నించగా, గోవులు ఒక్కసారిగా అరచి, కొమ్ములతో పొడిచే యత్నం చేయడంతో వెనుదిరిగినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఉదయం విధులకు వచ్చిన ఏఈవో ఓంకారం వెంకటేశ్వర్లు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురు, శుక్ర వారాల్లో రెండురోజులపాటు నంద్యాలవైపున్న ఈశ్వర్‌నగర్ కాలనీ శివార్లలో సంచరించినట్టుగా కూడా గుర్తించారు. అలాగే తిమ్మాపురం సమీపంలోని ప్రేమబీట్, లెపర్డ్ బీట్లలోనూ సంచరిస్తుండటంతో అటువైపుగా ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు కూలీలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులుగా పరిస్థితి ఇలానే ఉన్నా.. అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ మరో ఘనత

100 మిలియన్ టన్నులు దాటిన ఉత్పత్తి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ 100 మిలియన్ టన్నుల ఉత్పత్తిని దాటడం ద్వారా మరో మైలురాయిను అధిగమించింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ 1982 ఫిబ్రవరి 18న కార్యకలాపాలు ప్రారంభించగా, 1990లో పూర్తి స్థాయి ఉత్పత్తి ప్రారంభించింది. 1990-91లో 37,242 టన్నుల ఉత్పత్తితో ప్రారంభమైన ప్రస్థానం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 జూలై 26కు 10,76,635 టన్నులు సాధించడం ద్వారా 100 మిలియన్ టన్నులకు చేరుకుంది. ఈ ఘనతపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



క్లుప్తంగా...


ట్రిపుల్ ఐటీల్లో తొలి విడత కౌన్సెలింగ్ పూర్తి



నూజివీడు: రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో తొలి విడత కౌన్సెలింగ్ పూర్తయినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ శనివారం తెలిపారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి తొలి విడత కౌన్సెలింగ్‌లో 3,396 సీట్లు భర్తీ అయ్యాయని, ప్రత్యేక కేటగిరీ సీట్లు మినహా 736 సీట్లు మిగిలినట్టు పేర్కొన్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు అర్హుల జాబితాను ఆగస్టు 3న విడుదల చేస్తామన్నారు. పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఆగస్టు 19, 20 తేదీల్లో ఆయా క్యాంపస్‌ల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

టెట్‌కు 3.20 లక్షల దరఖాస్తులు

ఆగస్టు 3వ తేదీ వరకు గడువు



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్-2024)కు ఇప్పటివరకు 3,20,333 మంది దరఖాస్తు చేశారని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామ రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 2వ తేదీన వెలువడిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు గడువు ఆగస్టు 3వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. అర్హత గల అభ్యర్థులు గడువులోగా తమ దరఖాస్తులు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

18 నెలల చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం




సాయి వత్సవ్‌తో తల్లిదండ్రులు

పులివెందుల టౌన్: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ప్రముఖ వైద్యులు పల్లె శరణ్య, పల్లె నవీన్‌ల కుమారుడు తనయ సాయి వత్సవ్ 18 నెలల వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. 11 నిమిషాల 29 సెకండ్లలో 100 పదాలకు యాక్షన్ చేయడంతో పాటు 100 వస్తువులను గుర్తుపట్టడం (జంతువులు, పండ్లు, కూరగాయలు, వాహనాలు), 50 చిత్రాలకు సరిపోల్చడంతో వత్సవ్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది.

వైద్యసేవ ట్రస్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎన్టీఆర్ వైద్యసేవల ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఆరోగ్యశ్రీ స్థానంలో బీమాను ప్రవేశపెడుతున్న క్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్ర, టీం లీడర్‌లు, జిల్లా మేనేజర్‌లు, ఇతర సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ఎన్టీఆర్ వైద్య సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.గోవిందు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2007లో ఆరోగ్యశ్రీ ప్రారంభం నుంచి సేవలు అందిస్తున్న ఉద్యోగులు చాలామంది ఉన్నారని, వారి అనుభవాన్ని, సేవలను పరిగణించి ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ కులవృత్తులకు పూర్తి రాయితీతో రుణాలు ఇవ్వాలి

అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ కుల వృత్తులకు 100 శాతం రాయితీతో ఉపాధి రుణాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు, ఇటీవల ఢిల్లీకి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు వినతిపత్రాలను అందజేశారు. శనివారం ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీసీలపై జరిగే దాడులను అరికట్టాలని, మండల కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో తప్పనిసరిగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు.

సీటుకు నోటు!

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగించాలన్నా, కోరుకున్న చోటకు పోస్టింగ్ ఇవ్వాలన్నా అధికారి స్థాయి, పరిధిని బట్టి మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఆర్డీవోల నుంచి ఎమ్మార్వోల దాకా ఎస్ఐ నుంచి సీఐ దాకా రేట్లు నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. తిరుపతి ఆర్డీవో పోస్టు కోసం ఎవరు ఎక్కువ కోట్ చేస్తే వారికి ఇస్తామంటూ అధికార పార్టీ నేతలు బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీర్ఘకాలం జిల్లాలో పనిచేసిన ఓ అధికారి రూ.3 కోట్లు ముట్టజెప్పేందుకు సిద్ధపడ్డారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఓ తహశీల్దార్ తిరుపతి రూరల్ ఎమ్మార్వో పోస్టు కోసం భారీ మొత్తం ఇస్తానంటూ అధికార పార్టీ నేతలను ఆశ్రయించారు.

హోదా బట్టి కూటమి నేతలు ఫిక్స్ చేసిన మామూళ్లు

తిరుపతి ఆర్డీవో: రూ.3 కోట్లు	తహశీల్దార్: రూ. 25 లక్షల నుంచి రూ. కోటి (మండలాన్ని బట్టి)	సీఐ: రూ. 40 లక్షలు (ఏరియాని బట్టి)
ఎస్ఐ: రూ.10 - 15 లక్షలు	ఫీల్డ్ అసిస్టెంట్: రూ. 5 -7 లక్షల వరకు	మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు: రూ.25 వేలు- 2 లక్షల వరకు
రేషన్ డీలర్లు: రూ. 50 వేలు	సంఘమిత్ర: రూ. 25 వేలు	వలంటీర్: రూ. లక్ష ఇస్తే తిరిగి పోస్టు

కొమ్ము కాయాల్సిందే...!



కూటమి నేతలకు కొమ్ము కాయడంతోపాటు మామూళ్లు అందించే ఖాకీలపై కన్నేసి ఉంచారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ సీఐ పోస్టు కోసం స్థానిక ఎమ్మెల్యే రూ.40 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావటంతో గిరాకీ ఏర్పడింది. ప్రస్తుతం ఉన్నవారిని కొనసాగించేందుకు సైతం రేట్లు నిర్ణయించడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

➤ కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కోసం ఓ సీఐ రూ.15 లక్షలకు బేరం కుదుర్చుకోగా ప్రస్తుతం రూ.10 లక్షలు ఇచ్చారు. లెటర్, డీవో (డ్యూటీ ఆర్డర్) రాగానే మిగతాది చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ఈ సర్కిల్‌కు భారీ ఆదాయం ఉంది. కర్నూలు చుట్టుపక్కల రియల్ ఎస్టేట్‌తో పాటు మట్కా, పేకాట, రేషన్ బియ్యం అక్రమ రవాణా తదితర వ్యవహారాలతో పాటు నిత్యం స్టేషన్‌లో పంచాయతీలు జరుగుతుంటాయి. దీంతో డబ్బులు కట్టినా ఇక్కడ సంపాదనకు ఢోకా లేదనే భరోసాతో ఆఫర్ ఇచ్చారు.

➤ ఎమ్మిగనూరు రూరల్ స్టేషన్ కోసం ఓ సీఐ రూ.20 లక్షలు స్థానిక నేతకు ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో ఆదోనిలో పని చేసిన ఆయన ప్రస్తుతం లూప్‌లైన్‌లో ఉన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఆయనకు లెటర్ ఇవ్వగా త్రిసభ్య కమిటీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. ఇక ఎమ్మిగనూరు టౌన్ సర్కిల్‌కు కూడా రూ.20 లక్షలకు స్థానిక నేతతో బేరం కుదిరినట్లు సమాచారం.

➤ అనంతపురంలో ఆదాయం బాగున్న ఓ పోలీస్‌స్టేషన్‌కు సీఐగా వచ్చేందుకు ఓ అధికారి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం మరో డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆయన నియోజకవర్గ అధికార పార్టీ ముఖ్య నేత అనుచరుడి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. రూ.5 లక్షల దాకా ఇస్తానని చెప్పడంతో గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు జోరుగా చర్చ సాగుతోంది. అనంతపురం జిల్లాకే చెందిన ఓ అధికారి పుట్టపర్తి బదిలీ అయ్యేందుకు పట్టు వదలకుండా ప్రయత్నిస్తున్నారు. పరిటాల కుటుంబానికి సన్నిహితుడైన ఆయన పుట్టపర్తిలో ఓ జిల్లా శాఖ ఇన్‌చార్జీగా వచ్చేందుకు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. రూ.15 లక్షలు ఇస్తానని పరిటాల కుటుంబం ద్వారా ఓ మంత్రిని ఆశ్రయించినట్లు చెబుతున్నారు. కందికుంట వెంకట ప్రసాద్, పరిటాల సునీతకు తొత్తుగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న చిత్తూరు జిల్లాకు చెందిన ఓ పోలీసు అధికారి కదిరి లేదా ధర్మవరం సబ్ డివిజన్‌లో సీఐ పోస్టు కోసం రూ.10 లక్షలు చెల్లించేందుకు రెడీగా ఉన్నారు.

➤ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కందుకూరు, గుడ్లూరు, కావలి రూరల్, కొడవలూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, సంగం, ఆత్మకూరు, పొదలకూరు, నెల్లూరు వేదాయపాలెం, నవాబుపేట, నెల్లూరు రూరల్, వెంకటాచలం అర్బన్ పోలీసుస్టేషన్లలో పోస్టింగ్‌లకు భారీ డిమాండ్ ఉంది.

➤ గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి కొత్తపేట, లాలాపేట పోలీసు స్టేషన్లలో పోస్టింగ్‌లన్నీ పూర్తిగా మంత్రి నారా లోకేశ్ కనుసన్నల్లో జరుగుతున్నాయి. కొత్తపేటకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఐని, లాలాపేటకు కాపు సామాజిక వర్గానికి చెందిన సీఐని నియమించడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పాత గుంటూరు స్టేషన్‌కు మాత్రమే సీఐ నియామకాన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు అప్పగించినట్లు చెబుతున్నారు.



➤ కాకినాడ జిల్లాలో ప్రధాన సర్కిళ్లలో అధికార పార్టీ నేతల జోక్యం మితిమీరింది. ప్రత్తిపాడు, పెద్దాపురం, కాకినాడ డివిజన్‌లోని సర్కిల్స్‌లో నియోజక వర్గ నాయకుల ప్రమేయం ఎక్కువగా ఉండగా పిఠాపురం సమీప సర్కిల్స్‌లో స్థానిక నేతల అనుచరుల హవా రాజ్యమేలుతోంది. ఐదేళ్ల క్రితం కాకినాడ టూ టౌన్ నుంచి బదిలీపై వెళ్లిన ఓ సీఐ లక్షలు సమర్పించైనా తిరిగి వచ్చేయాలనే పట్టుదలతో నియోజకవర్గ నేతతో సంప్రదింపులు జరుపుతున్నారు. జిల్లాలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు బదిలీల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రాంతాలను బట్టి రూ.30 నుంచి రూ.40 లక్షలు ఇచ్చుకునేలా బేరసారాలు జరుగుతున్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఓ మహిళా అధికారి కాకినాడ జిల్లాలో అదే పోస్టులో కొనసాగేందుకు ఓ ప్రజాప్రతినిధికి రూ.20 లక్షలు ఆఫర్ చేసినట్లు సమాచారం. జిల్లా పరిషత్‌లో ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పని చేసిన ఒక అధికారి తిరిగి అదే పోస్టు కోసం రూ.20 లక్షలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు!

➤ నంద్యాలలో ఆర్డీవో, తహసీల్దార్ కుర్చీ కోసం ఈసారి పోటీ తీవ్రంగా ఉంది. నంద్యాల లోని రెవెన్యూ శాఖ అధికారి కుర్చీ కోసం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ పని చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో డివిజన్ స్థాయి పోస్టు కోసం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు చెల్లించేందుకు పలువురు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆళ్లగడ్డలో డీఎస్పీ పోస్టు కోసం రూ.10 లక్షలు, చాగలమర్రి ఎస్ఐ పోస్టుకు రూ.5 లక్షల చొప్పున స్థానిక ప్రజాప్రతినిధి డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

➤ శ్రీకాకుళం జిల్లాలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ తమకు కావాల్సిన ఎమ్మార్వో, ఎస్ఐ, సీఐల జాబితా తయారు చేసుకున్నారు. ఇక అచ్చెన్నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం!

➤ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో తమ వద్దకు వచ్చిన అధికారుల పేర్లు నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా వారి గురించి ఆరా తీస్తున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తమకు అనుకూలంగా పనిచేసిన అధికారులను తిరిగి తెచ్చుకునే పనిలో ఉన్నారు. చేపల చెరువులతోపాటు పందాలు, పేకాట ఎక్కువగా జరిగే భీమవరం, ఉండి, ఆచంటలో పోస్టింగ్‌కు భారీగా డిమాండ్ ఉంది. అమలాపురం రూరల్ సీఐ బదిలీ వ్యవహారం టీడీపీలో అంతర్గత కుమ్ములాటకు దారి తీయటంతో ఈ పంచాయతీ టీడీపీ అధిష్టానం, డీజీపీ వద్దకు వెళ్లింది.

➤ ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరంలో ఎస్ఈ పోస్టు కోసం ఐదుగురు పోటీ పడుతుండగా మాజీ మంత్రి జవహర్ బావమరిది కూడా లైన్‌లో ఉన్నారు. పోస్టు కోసం రూ.50 లక్షలు ఇచ్చేందుకు సైతం వెనుకాడటం లేదు.

➤ అనకాపల్లి జిల్లాలో పాయకరావుపేట, యలమంచిలి, చోడవరం, అనకాపల్లి ప్రాంతాల్లో పని చేసేందుకు అధికారులు ఆసక్తి చూపుతున్నారు. మాడుగుల, యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో రెండు జాబితాలు సిద్ధం చేశారు.

➤ విజయనగరం జిల్లాలో ఏ పదవిలోనూ లేకపోయినా టీడీపీ సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు తన బంగ్లా నుంచే యంత్రాంగాన్ని శాసిస్తున్నారు. ఆయన కుమార్తె అదితి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో అధికారులు ఆమె అనుచరుల చుట్టూ తిరుగుతున్నారు. కీలక స్థానాల కోసం అదితి కొన్ని పేర్లు కలెక్టరుకు సిఫారసు చేసినట్లు తెలిసింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలో దాదాపుగా తమ కులం వారికే పోస్టింగ్‌లు ఇచ్చేలా ఆయన తండ్రి కొండలరావు ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, నెల్లిమర్ల (జనసేన) ఎమ్మెల్యే లోకం మాధవి కూడా తమకు అనుకూలమైన తహసీల్దార్ల పేర్లను కలెక్టరేట్‌కు పంపినట్లు సమాచారం. కిమిడి కళావెంకట్రావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి సైతం ఇప్పటికే సిఫారసు లేఖలను కలెక్టరేట్‌కు పంపించారు.

➤ విశాఖ పరిధిలో పెందుర్తి, సబ్బవరం, పరవాడలో తహశీల్దారు, ఎస్ఐ, సీఐ పోస్టులకు గిరాకీ ఉంది. జనసేన ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జీ రెండు జాబితాలు సిద్ధం చేసుకున్నారు. భీమిలిలోనూ అధికార పార్టీకి చెందిన కీలక నేత బేరాలు కుదుర్చుకున్నారు.

➤ ప్రకాశం జిల్లాలో టీడీపీ పెద్దల సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించాలని తీవ్ర ఒత్తిళ్లు వస్తున్నాయి. తహసీల్దార్లు ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



తుపాను అలలు తన టీ షాపును ధ్వంసం చేస్తే.. ఏం చేయాలో తెలియక.. దాని ముందు నిస్సహాయంగా నిల్చున్న ఈ బాలిక చిత్రం మాంగ్రోవ్(మడ అడవులు) ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్-2024 పోటీలో ఓవరాల్ విన్నర్‌గా ఎంపికైంది. మాంగ్రోవ్ యాక్షన్ ప్రాజెక్టు ఈ అవార్డును ప్రకటించింది. 'ప్రపంచంలోనే అతి పెద్ద మడ అడవులుగా పేరొందిన సుందర్‌బన్స్ మానవ అభివృద్ధి కార్యకలాపాల వల్ల నానాటికీ క్షీణిస్తున్నాయి. దీని వల్ల సముద్ర తీరం కోతకు గురవుతోంది. మడ అడవుల క్షీణత వల్ల సుందర్‌బన్స్ ప్రాంతం తరచూ తుపాను బారిన పడుతోంది. ఈ అమ్మాయి దయనీయమైన పరిస్థితి.. ఈమె ఒక్కరిదే కాదు. తీరానికి దగ్గరగా నివసించే లక్షలాది మంది ప్రజలది కూడా. వాతావరణ మార్పులు, సముద్ర మట్టాల పెరుగుదల వల్ల చాలామంది శరణార్థులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది' అని అవార్డు జ్యూరీ పేర్కొంది. ఈ చిత్రాన్ని 'సింకింగ్ సుందర్‌బన్స్' పేరిట సుప్రతీం భట్టాచార్జీ అనే ఫొటోగ్రాఫర్ తీశారు.

ఒంటరితనం ఊపిరి తీసింది!

కర్నూలులోని ట్రిపుల్ ఐటీడీఎంలో విద్యార్థి ఆత్మహత్య

- హాస్టల్‌పై నుంచి దూకిన సాయికార్తీక్
- తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి
- ఒంటరితనమే కారణం అంటూ సూసైడ్ నోట్!



సాయికార్తీక్

కర్నూలు సిటీ: కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీడీఎం)లో చదువుతున్న నల్ల సాయి కార్తీక్ నాయుడు(20) ఒంటరితనం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లా, జియ్యమ్మవలస మండలం, కుదమ గ్రామానికి చెందిన నల్ల వెంకట నాయుడు కుమారుడైన సాయికార్తీక్ ట్రిపుల్‌ఐటీడీఎంలో ఈసీఈ బ్రాంచ్‌తో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం క్యాంపస్‌లోని కలాం హాస్టల్ భవనం 9వ అంతస్తు నుంచి దూకడంతో కుడి కాలు విరిగి, తలకు తీవ్ర గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే చనిపోయాడు. క్యాంపస్‌కు వేసవి సెలవులు ముగిసి ఈ నెల 22 నుంచి క్లాసులు తిరిగి ప్రారంభమయ్యాయి. సాయి కార్తీక్ క్యాంపస్‌కి వచ్చినప్పటి నుంచి ఒంటరిగానే ఉంటూ మానసికంగా ఇబ్బంది పడే వాడని, సమస్య ఏంటో ఎవరికీ చెప్పలేదని తోటి విద్యార్థులు చెబుతున్నారు. చదువులో ఒత్తిడి ఉంటే కౌన్సిలింగ్ ఇచ్చేందుకు సైకాలజిస్టులు అందుబాటులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. విద్యార్థి ఆత్మహత్యపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒంటరితనం, తాను చెప్పినా ఎవరు వినిపించుకోలేదని సూసైడ్ నోటులో రాసినట్లు సమాచారం. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యాన వర్సిటీలో ఐడియా ఫెస్ట్

విజేతలుగా నిలిచిన ముగ్గురికి బహుమతులు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీసీ)లో సెలబ్రేటింగ్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ కాంపోనెంట్ కింద శనివారం ఐడియాఫెస్ట్ నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఐసీఏఆర్ (హైదరాబాద్) సీనియర్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ డాక్టర్ ఏఎస్ సత్యేంద్రకుమార్, ప్రాజెక్టు మేనేజర్లు డాక్టర్ పూజా, డాక్టర్ సుబిన్ థామ్‌లు వ్యవహరించారు. 37 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొని తమ ఇన్నోవేటివ్ ఐడియాస్‌ను ప్రదర్శించారు. దుర్గ, ఎ.మనోజ్, లక్ష్మి లహరిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి బహుమతులు అందజేశారు. మరో ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులిచ్చారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ డీఆర్ సలోమి సునీత, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పోలీసులమంటూ బురిడీ

- కుమారుడిని అరెస్ట్ చేశామని చెప్పగానే ఆన్‌లైన్‌లో రూ.74 వేలు పంపిన తల్లి
- చివరకు అవాస్తవమని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు

అజిత్‌సింగ్ నగర్ (విజయవాడ సెంట్రల్): 'మేం అమెరికా పోలీసులం. ఇక్కడ మీ అబ్బాయి స్నేహితులతో కలిసి ఓ అమ్మాయిని ఏడిపించాడు. వెంటనే డబ్బులు పంపకపోతే అరెస్ట్ చేస్తాం' అని చెప్పిన ఓ అగంతుకుడి ఫోన్‌కాల్‌ని నమ్మిన ఆ తల్లి అతనికి రూ.74 వేల నగదు పంపించిన ఘటన విజయవాడ అజిత్‌సింగ్ నగర్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్ నగర్ నందమూరి నగర్ ప్రాంతానికి చెందిన భాగవతల శ్రీదేవి, బాలసుబ్రహ్మణ్యం దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రావణ్‌కుమార్ యూఎస్‌లో చదువుకుంటున్నాడు. ఈ నెల 23న 707925079 నంబర్ నుంచి ఓ అగంతకుడు ఫోన్ చేసి మీ అబ్బాయి అమెరికాలో తన స్నేహితులతో కలిసి అమ్మాయిని ఏడిపించాడని, అతన్ని ఇప్పుడు అరెస్ట్ చేసి జైలుకు పంపుతున్నామంటూ ఆమెను భయపెట్టాడు. వారి మాటలను నమ్మిన ఆమె తన కుమారుడిని వెంటనే విడిపించాలని కోరగా.. అందుకు రూ.74 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో ఆమె తన గూగుల్‌పే ద్వారా రూ.50 వేలు ఒకసారి, రూ.24 వేలు ఒకసారి పంపించింది. తరువాత తన కుమారుడికి ఫోన్ చేయగా అటువంటిదేమి లేదని, ఎవరూ తనను అరెస్ట్ చేయలేదని చెప్పడంతో తాను మోసపోయినట్టు ఆమె గుర్తించింది. అమెరికా పోలీసులమంటూ డబ్బులు కాజేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించింది.

పాతబకాయిలే అడుగుతున్నాం

సీఎం చంద్రబాబు



సీఆర్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు మాత్రమే వచ్చాయని.. తాము అడిగింది కూడా పాత బకాయిలేనని, కొత్తగా కేంద్రం ఇచ్చింది ఏమీలేదని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. విభజన సమయం కంటే గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వైఫల్యాలవల్ల రాష్ట్రానికి మరింత నష్టం జరిగిందని ఆరోపించారు. ఢిల్లీలో శనివారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఆ తర్వాత సాయంత్రం కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరా యలుతో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పోలవరం డయాఫ్రమ్ వాల్‌కు సంబంధించిన డిజైన్ల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని కేంద్ర మంత్రిని కోరారు. సమావేశానంతరం చంద్రబాబు అక్కడున్న మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

విభజన చట్టంవల్ల నష్టం..: విభజన చట్టాన్ని రూపకల్పన చేసింది కాంగ్రెస్ పార్టీయేనని.. వాళ్లు చేసిన ఆ చట్టం ద్వారా పోలవరానికి ఎంతో నష్టం జరిగిందని చంద్రబాబు చెప్పారు. విభజన చట్టంలో ఏర్పడిన నష్టం నుంచి తేరుకుంటున్న సమయంలో తమ ప్రభుత్వం ఓటమి పాలైందని.. ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోలవరాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. అదేవిధంగా అప్పులు పెరగడం, రాష్ట్రానికి ఆదాయం తగ్గడం, అమరావతిని నాశనం చేయడం, పరిశ్రమలు పారిపోయేలా చేశారని విమర్శించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఎవరూ పూడ్చలేరని, అందుకే పోలవరం పునర్నిర్మాణానికి పాత బకాయిలను అడుగుతున్నామని, కొత్తగా ఇచ్చిందేమీ లేదనే విషయాన్ని విమర్శించే వాళ్లు గుర్తించాలని చంద్రబాబు కోరారు. విభజన సందర్భంగా అన్యాయం జరిగిన దానిని ఇస్తే తాము నిలదొక్కుకునే అవకాశముందన్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసికెళ్లినట్లు చంద్రబాబు చెప్పారు.

నవంబర్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం..: ఇక నవంబరు నెలలో వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని, అప్పుడు డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపడతామని.. ఆ తర్వాత ఎర్త్‌కం రాక్ ఫీల్డ్ డ్యామ్ నిర్మాణం చేపడతామని చంద్రబాబు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943